శ్రీ

మోహినీరుక్మాంగద నాటకము.

:0:

ఇది

బళ్ళారిలోనున్న డిస్ట్రిక్టుకోర్టు వకీలు

"ఆంధ్రనాటక పితామహ" యను బిరుదువహించిన

ధర్మవరము-రామకృష్ణమాచార్యులచేత

రచియింపఁబడి

టి. కె. కృష్ణమాచార్లు, వారిసహోదరులవలన ప్రకటింపబడియె.

మొదటి కూర్పు.

బళ్ళారి

రమావిలాస ముద్రాక్షరశాలయందు

ముద్రింపబడియె.

1920

[క్రయము రూ. 1-0-0.]

పీఠిక.

ఇదివఱకు లోకులెఱింగిన రుక్మాంగద చరిత్రమునందలి సంవిధానమునకును దీనికిని జాలవ్యత్యాసము గలదు. సంవిధానమున నీవ్యత్యాసము గల్పించినందులకు గ్రంథకర్త గారే కారణముల నుడివియున్నారు. ప్రప్రథమమున నీనాటకము ప్రదర్శింపఁ బడినప్పు డీక్రింది విధమున నాచార్యులవారే కరపత్రములయందుఁ బ్రకటించియుండిరి.

సాధారణముగ రుక్మాంగద నాటకమునాడని నాటక సంఘములే లేవు. కథయు జనులకంతయు దెలిసినదే. అయిన నందలి సంవిధానము మాత్రము కొంచెము చింతనీయము. రుక్మాంగదు నేకాదశీ వ్రతప్రభావమున జీవాత్మలంతయు వైకుంఠము నకు పోవను ప్రారంభించి యమలోకమున నరకములు శూన్యములుకాగా యముడు నారదునితో కన్నులకు నీళ్లుపెట్టుకొని యేడ్చినది చాలక బ్రహ్మతో మొరబెట్టుకొని తన యమాధికారమునకు 'రాజీనామా' యిచ్చెదనని గోడు చెప్పుకోగా బ్రహ్మ మిక్కిలి వ్యసనపడి ఈ వ్రతము భంగము చేయుటకు మోహినియను కన్యకను పుట్టించి వ్రతము చెఱచెనని కథ. ఇదియే పలువిధములుగా నాటకకర్తలామోదించియున్నారు. నాటక కర్తలకు కథలోని బీజము మాత్రము వదలక స్వారస్యము కొరకు సంవిధానము కొరకు కథను మనసునకు వచ్చినంత మార్చుటకు స్వాతంత్ర్యముకలదు. ఈ కథలో తననరకములకు జీవులు రాకపోయినంతనే కన్నీరుమున్నీరుగా నేడ్వవలశినంత యముని తాతలార్జించినంత గంటేమిపోయెనో? యముడు మొత్తుకొన్నంతనే నిష్పక్షపాత సృష్టి కర్తయగు బ్రహ్మకు రుక్మాంగదు సద్వ్రతము చెఱుప వలసినంత కార్పణ్యము పుట్టుటకు కారణమేమో—అందుకు ఒక స్త్రీ పుట్టి రుక్మాంగదునియెడల మోహము లేక మోహించి మోసగించి క్రూరకృత్యముల చేయింప నుద్యమించిన యా నారీతిలక ప్రభావమెట్టిదియో యుక్తిశాలురందరును నూహింపవచ్చును. ఈనాటకమునగల సంవిధానము పూర్పున క్రిందిపద్యము మాత్రమే చాలును. బ్రహ్మ యమునితో ముచ్చటించుచు "నీకేమైన కొదవగా నున్నదియా" యని యడుగగా—

సీ. "సతతంబుసంగీతసాహిత్యవిద్యల గారవించుటకవకాశమబ్బె
నతిశయంబుగమిత్రతతులతోడ వినోద గోష్టినుండుటకనుకూలమయ్యె
నెమ్మదిఁగడుభక్తినిండారమిముఁబోలు పెద్దలదర్శింపవేళగలిగె
నరుదారురీతిగా హరినామకీర్తనల్ దమిదీఱ సేయంగసమయమొదవె
నరసిచూడంగరుక్మాంగదావనీశు
సలలితైకాదశీవ్రతసత్ఫలంబు
నాకుమోదంబునకుఁగారణంబుగాక
వారిజాసన! కొదవకుఁగారణంబె".

మల్లనామాత్యకృత రుక్మాంగద చరిత్రమునందలి మనోహర పద్యములు పెక్కు లిందుఁ గైకొనఁబడియున్నవి.

మోహినీరుక్మాంగదనాటకము.

—: కథాసంగ్రహము :—

ప్రథమాఙ్కము.

రం. 1. అజామిళుని చరిత్రము నారదునివలన విని రుక్మాంగదుడు ఏకాదశీ వ్రతము పట్టుట.

రం. 2. ఏకాదశీ వ్రతమును గురించిన ముఖ్యప్రకటన.

రం. 3. పిచ్చిల వలాహకులను నిరువురు సత్రధర్మకర్తలు. పంచాపకేశ శాస్త్రియను మధుర వైపునుండి వచ్చిన యధికారిచే బలవంతపు ఏకాదశి చేయించుట.

ద్వితీయాఙ్కము.

రం. 1. యముడు విరామముగా వైద్యనాథుడను గంధర్వునితో చదరంగమాడుట. వారిసంభాషణము.

రం. 2. నందనవనములో రంభాదులయిన యప్సరసల సంగీత వినోదము. అసందర్భము లైన విఘ్నములు.

రం. 3. యమ బ్రహ్మల సంవాదము. విష్ణు సేనానియగు విష్వక్సేనుడు వచ్చి వైకుంఠ మును వృద్ధిచేయుమని చెప్పుట. అప్సరసల మొఱ.

తృతీయాఙ్కము.

రం 1. రుక్మాంగదునిభార్య సంధ్యావళి గర్భములోనుండుట. ఇష్టకామేశ ప్రభావ మున నాయమ జాడ్యము నివర్తించియుండినందున శివస్తుతి.

రం. 2. అప్సరసల నిర్ధారణము.

రం. 3. రుక్మాంగదు హరికథా కాలక్షేపము. మోహిని యకృత్రిమ మోహము. (మనోహరరంగము).

చతుర్థాఙ్కము.

రం. 1. వింధ్యపర్వతములో నిష్టకామేశాలయము. మోహిని గానము. రుక్మాంగదు మోహము. (శృంగార రసప్రధానమైన రంగము). శివలింగము నుభయులు స్తుతించుట.

రం. 2. రుక్మాంగదు భార్యల యాలోచన. వారి నిర్ధారణము. మోహినీ సంధ్యావళుల స్నేహము. (పాతివ్రత్యమును ప్రకటించు ధీరరంగము).

పఞ్చమాఙ్కము.

రం. 1. రంభాదుల యాగ్రహము. మోహిని పశ్చాత్తాపము

రం. 2. రుక్మాంగదు నేకాదశీ నియమువలని దుఃఖము. మోహినీ క్రూరకృత్యము. ధర్మాంగదుని మనోదార్ఢ్యము. శ్రీవిష్ణు నాగమనము. స్తవము.

—: మంగళం ఉత్తరరంగము :—

శ్రీ

మోహినీ రుక్మాంగద నాటకము.

—:o:—

ప్రథమాఙ్కము-ప్రథమరంగము.

—o—

ప్ర: రుక్మాంగదుఁడు. మంత్రి బలదేవుఁడు. పండితులు.

(పండితులు శాస్త్రప్రసంగము చేయుదురు.)

రుక్మా—పండితోత్తములారా! మీ శాస్త్రసంవాదము మమ్మెల్లర నానందమగ్నులఁ గావించె. ఇప్పటికిఁ గడుంగడు సంతోషమయ్యె. ఇఁక విరమింపుఁడు. సేవకా! ఈపత్రిక కోశాధ్యక్షునియొద్దకుఁ గొనిపోయి యీపండితోత్తములకు బహుమతు లిప్పింపుము.

(పైన మృదంగధ్వానము. సంగీతరవము. భేరీనిస్వనము వినిపించును.)

రుక్మా—ఆహా! ఏమి యీ మనోహరగీతము! కిన్నరగానమున్నట్లులున్నదే! ఎన్నఁడు వినియెఱుఁగము.

ప్ర: నారదుఁడు.

రుక్మా—(నారదులకు నమస్కరించి యుచితాసనమునఁ గూర్చుండఁ జేయును).

నార—రుక్మాంగద రాజేంద్రా! నీవు సుఖముగలుగుఁగాక?

రుక్మా—మునిశ్రేష్ఠులారా! మీరాక నన్నెంతయు ధన్యుఁగావించె. కృతార్థుఁడనైతిని. మునీంద్రా! ఇప్పటికిఁ గొంతసేపటికిముందు నాకాశమార్గమున నెన్నఁడు వినని మనోహరగానము వినిపించె. ఆగాన మెంతయువర్ణింపవచ్చును. అదియేమి గంధర్వగానమా? కిన్నరగీతమా? నాకానతీయ వేఁడువాఁడ.

నార—ధరణీశా! అయ్యెడ నే వచ్చియుండి నినుదర్శించుకొని పోవు కుతూహలమున నేనిక్కడకు నే నేతెంచితిని. అదియొక చిత్రకథ. కన్యాకుబ్జపురిలోనున్న యజ్ఞామిళుఁడను బ్రాహ్మణుని నీవు వినియున్నావుగదా?

రుక్మా—ఆహా! వినియున్నాను. అతఁడు కులముచెడెననియుఁ ద్రో)వలఁ తింపఁబడి శిక్షితుఁడైవచ్చి, మఱల దొంగలలోఁ జేరుకొని చౌర్యముఁగాపి హింస యొనర్చుచు నారాజ్యమునకే వచ్చియున్నాఁడని మా యారక్షకుల వచ్చియున్నందున, నేను నందునకుఁ దగినభంగి రక్షణములొనర్ప యున్నాను. అదిప్పుడేల ?

నార—అహ్హో! అదియొక పెద్దకథ. అయ్యజామిళునిఁ బోలిన పుణ్యవంతుఁడే అతఁడు మరణముఁజెందిన వేళ యమలోకమునకుఁ గొనిపోవలయునని ఁ దూతలును, విష్ణువును, సమకట్టివచ్చి యెట్టకేలకు భార్యతో నతని విష్ణులో గొనిపోయిరి. ఆకాలమున సంభవించిన కిన్నరగీతము, గంధర్వగానము నాట్యమును, దేవదుందుభిధ్వానమును అవియే నీవువినినవి.

రుక్మా—అహా! ఏమిచిత్రము ? ఎంతయో పాపాత్ముఁడని యెంచఁబడు మిళునకు విష్ణులోకప్రాప్తియా ? ఇదియెట్లు సంఘటిల్లు ? అతఁడొనరి పుణ్యమదియేమి ?

నార—ధరారమణా! అతనిపూర్వజన్మపాపఫలమువలన నతనికి మహ దుష్కీర్తి గలిగెఁగాక, యతనిఁబోలిన నిర్మలమానిసులు లభించుటరది. యెట్టిపాపము లెన్ని యొనర్చియుండినను, దనయంత్యకాలమందొనర్చిన పు సర్వపాపములు కొట్టువడిపోయె.

రుక్మా—మునీంద్రా! అదియేమిపుణ్యము?

నార—ఎనలేని పుణ్యకార్యము మరణపువేళఁ బూర్ణవ్రతంబుగ, నేకాదశీవ్ర ప్రాణోత్క్రమణసమయమున, నారాయణస్మరణ యొనర్చినాఁడు.

రుక్మా—మునికులతిలకా! నీమాటలవలన నిన్ను మఱల మఱల నడుగవలెఁ తయో కుతూహలంబు గలిగెడు. మేమందఱము నేకాదశినాఁ డుపవాస చున్నారమేకదా ? ఆయజామిళుఁడొనర్చిన వ్రతవిశేషమేమి ? అ యానతిమ్ము.

నార—రాజేంద్రా! ఆయేకాదశీవ్రత మహాత్మ్యమింతని వర్ణింపసాధ్యమా

సీ. పుణ్యమూర్తులలోనఁ బురుషోత్తముఁడువోలె
గ్రహములలో దివాకరుఁడువోలె
నంభోనిధులలోన నమృతార్ణవమువోలె
నగములలో మేరునగమువోలె

నాశ్రమంబులలో గృహస్థాశ్రమము వోలెఁ
దరువులలోఁ గల్పతరువు వోల
నధిక దానములలో నన్న దానము వోలె
మణులలోఁ గౌస్తుభమణియుఁ బోలె

తే. గీ. స్వర్గమున భూమియందు రసాతలమునఁ
బ్రతియొనర్పఁగరాని సద్వ్రతము సకల
మంగళాస్పద మఖిలసంపత్కరంబు
క్షితితలేశ్వర! యేకాదశీవ్రతంబు.

అట్టి యేకాదశీవ్రతాచరణమున విధానములు వేఱువేఱుగా నున్నవి. ఏమనగా.

సీ. దశమినాఁ డేకభుక్తము చేసి మఱునాఁడ
దివారాత్రములు భక్తి నుపవసించి
హరిమందిరమున జాగరమొప్పఁ గావించి
వేగిన ద్వాదశీవేళయందు
విప్రోత్తములకు షడ్విధరసోపేతంబు
గా భుజింపఁగఁ బెట్టి కనకనిష్క
తతులు దక్షిణలిచ్చి తదనంతరము సుహృ
జ్జనులతో నామిషక్షౌద్రశాక

గీ. విరహితంబుగఁ బారణ వేడ్కఁ జేసి
నిద్రదివమెల్ల వర్జించి నియమపరత
మాపుభుక్త్యంగనాసంగమములు మాని
యుచితగతి నుండుటది యుత్తమోత్తమంబు

ఇది సంపూర్ణమగు నేకాదశీవ్రతము. దీనివలన సర్వపాపములు నశించు. మహాక్షేత్ర దర్శనపుణ్యము లెన్నియో లభించు.

రుక్మా—మునీంద్రా! ఈదినమె సుదినము, నీవలన నీపుణ్యకథ నాలింపఁగలిగె. అజామిళుఁ డేకాదశీవ్రతము సలిపెనంటివే యెన్నిసంవత్సరములు తద్వ్రతవిధానము జరుపుచుండెను? చోరులలోఁగలసి జాతినీతు లుజ్జగించియున్నవాని కీవ్రత మెట్లు పట్టుపడియె? ఇదియంతయు నుల్లాసముగ విను కుతూహలము నాకుఁ బొడమెడు.

నారద—రాజేంద్రా! అయ్యజామిళుఁడు నియమముగా వ్రతము నుపాసించినవాఁడు కాఁడు. వ్రతోద్దేశము నతనికి నుండలేదు. అయిన ఫలముమాత్రము కలకాలము వ్రతము ననుసంధించి జరుపువారికంటె నెక్కువగా లభించినది.

రుక్మాం—ఆహా! ఇదేమాశ్చర్యము. నిరుద్దేశముగ నతఁడు వ్రతమెట్లుసలిపె? ఫలమెట్లుగలిగె? నిందలిరహస్యము నానతిండు.

నారద—రాజచంద్రా! ఇప్పుడు నీరాజ్యము చుట్టుపట్టుననున్న రాజ్యముల బాధించుచు మిమ్మును భయముప్పతిల్లఁజేయు నాఖుమారిజాడ్య మతనికి సోఁకినందున దశమి నాఁడు రాత్రియు నేకాదశినాఁడహోరాత్రములును, నతనికి భోజనము లేదయ్యె. ద్వాదశినాఁ డుదయమునకుముందే హరినామస్మరణ యొనర్చుచు నసువుఁబాసెను. ఇదియే యతఁడొనర్చినవ్రతము

రుక్మాం—మునీంద్రా! ఏమి చిత్రచరిత్రము వచించితిరి. జాడ్యమువలన నతఁ డుపవాసమున్నంత నే, వ్రతాచరణఫలము లభించె నను టచ్చెరవుగదా? దీని రహస్యమెల్ల సవిస్తరముగ వినఁగోరెద.

నారద—ధరణీవరా! ఇందు రహస్యమేమున్నది. ఆవ్రతవిధానమ్మిట్లు.

సీ. పతికార్యభారసంభ్రమునవశంబునైనను
నాఁకలిలేకైన నరుచినైన
భామినీవిరహసంప్రాప్తి నొందుటనైన
నశనమబ్బకయైన నలుకనైన
మృగయావినోద నిమిత్తంబునందైన
వ్యసనంబునందైన వనటనైన
దారుణజ్వరపీడ తగిలియుండుటనైనఁ
గయ్యంబుకోరికైనఁ గలుపునైన

గీ. నంచు హరివాసరమునాఁడహర్నిశంబు
చాలశక్త్యోపవాసంబు సంభవించె
నేని యాపుణ్యునకుఁగల్గు సిద్ధమై త
నర్చు శ్రీహరివైకుంఠనగరసుఖము.

రుక్మాం—ఆహా! యతీంద్రా! నీయనుగ్రహమువలన నాకెంతయు జ్ఞానోదయముగలిగె. నాకును నావ్రతము సమ్మోదయుక్తముగ నాచరించు కుతూహలముపొడమె. అయ్యజామిళుని చరిత్ర మింకను సవిస్తరముగా నాకర్ణించు నుత్సాహమును జనించె.

నార — రాజేంద్రా! ఆయజామిళ చరిత్రమంతయు సవిస్తరముగా నింకొకసారి వచించెద, ఇప్పటికి వేళయ్యెనది. నీకు మంగళమ్ము కానిమ్ము నేనుపోయివత్తును

రుక్మా — ఉ॥ ధన్యుఁడనైతి మీకృపకుఁ దావలమైతి సమస్తరాజతా
జన్యులలోన ధర్మగుణశాశ్వతకీర్తుల నెల్లవారికిన్
మాన్యుఁడనైతి మీరు బహుమానముతో నిటు లేగుదేర సా
మాన్యులకిట్టి భాగ్యమహిమల్ సమకూరునె మౌనిచంద్రమా.

క॥ కారణబాంధవులితరు ల
కారణబాంధవులు మీరు గాన ననున్ శ్రీ
నారాయణపుణ్యవ్రత
పారాయణుఁ జేసితిరి కృపామతులారా.

(నమస్కరించును).

నార — ఐశ్వర్యమస్తు. (నిష్క్రమించును).

రుక్మా — మంత్రిసత్తముఁడా! వింటివే యీ నారద మహర్షి యాడిన యేకాదశీ వ్రతమహాత్మ్యము! భవతారకమై, మోక్షదాయకమై వెలయునట్టి వ్రతరాజమును ఢిను, నిర్మలమానసములఁ బూనికతో నిది జరుపలేకయున్నారుగదా. నేఁడే యీ రెల్ల నొక నేమమువారియుందురు. నా రాష్ట్రమునను నగరగ్రామ జనపదములకెల్లఁ బంపి యీ యాకారగ నీ యేకాదశీవ్రత మాచరింపవలయునని చెప్పి చాటింపఁ బంపుఁడు. ఈవ్రతాచరణమునఁ బ్రకృతిజనులేనైన శ్రద్ధఁ జూపిన వారికి శివముగలుగుననియుఁ జెప్పుఁడు. బలవంతముననైన సన్మార్గాచరణము కలుగఁజేయుట విహితము కావున వైకుంఠనగరలాభమున నా యాదివిష్ణుపదపంకజములయొద్ద నుండు స్వాతంత్ర్యము కల్గించి యేతద్వ్రతాచరణము బలవంతముననైన నెలకొల్పవలయు. ఎల్లవారికిని మొదట నొక్కింత కష్టముగానుండినను, నభ్యాసవశమున నీమార్గము సంతోషమున నవలంబింతురు.

మంత్రి — భాగ్యము. రాజరాజా! ఇప్పుడే యన్నియూళ్లకును భవన్నియోగమ్ముఁ బంపెద.

(నిష్క్రమింతురు.)

ప్రథమాఙ్కము-ద్వితీయరంగము.

—:o:—

వీధి.

ప్ర: రాజసేవకుఁడు (బండిపై నగారవాయించుచు నొకభటునితో) కాగితము చేపట్టి.

సేవక—ఇదిగో! జనులారా! రుక్మాంగద మహారాజుసభకు ననుగ్రహించి విచ్చేసియున్న మహామహాత్ములగు నారద ఋషివర్యులు వ్రతములలో నెల్లఁ బ్రతిలేనిదై యేకాదశీవ్రతము రాజిల్లుననియు నాదివిష్ణులోకనిశ్రేణి యనియు మోక్షసౌఖ్య పేటిక యనియు భవసన్నిపాతబ్రహ్మాస్త్ర మనియుఁ బెక్కువిధముల శ్లాఘించినందున రాజుగారు యోచించి సర్వజనులకు క్షేమమును నాముష్మిక సత్ఫలమును నొదవుటకై తా మొక్కరే కాక తమరాష్ట్రమునఁజేరిన యెల్లజనులు తద్వ్రత సంపూర్ణాచరణము పాటింపవలయునని యాజ్ఞయిచ్చియున్నారు. ఎల్లవారును చాతుర్భక్త్యవజ్ఞముగా నేకాదశీవ్రతము సల్పవలయు. దశమినాఁ డభ్యంగనము చేసికొని రాత్రిభోజనము మాని యేకాదశిశుద్ధోపవాసము చేసి రాత్రియంతయు శ్రీహరినిలయమున జాగర మొనర్చి ద్వాదశినాఁడుదయమునకే పారణ మొనర్చి యారాత్రి మఱల భోజనమును స్త్రీపురుషసంగమునుమాని వ్రతాచరణ మొనర్పవలయునట్లును నిందులకుఁదప్పి వారు శిక్షార్హులగునట్లును, రాజుగారు గట్టికట్టడ మొనర్చియున్నారు. తమరాష్ట్రజనులు విధేయులై పరమరాజ భక్తిపరులై యున్న కారణమున శిక్షవలని యేభయము లేకయే మనఃపూర్తిగ భక్తినై తమయాజ్ఞ నెఱవేర్తురని రాజుగారు మిక్కిలి విశ్వసించి యున్నను విధికొఱకై యాశిక్షమాట వచింపఁబడియున్నది.

సీ. అభ్యంజనస్నానమాచరించి దశమి
నిలనొక్కప్రొద్దుండవలయునుండి
హరివాసరము నిరాహారులై జాగర
మెలమిమైనిశిఁజేయవలయునుండి
ద్వాదశి విప్రసంతర్పణం బొనరించి
యెలమిపారణసేయవలయునుండి
తద్దివసంబెల్లనిద్రయు రాత్రియన్నంబు
వర్జించి యుండఁగావలయునుండి

గీ. అందఱికిదేవిధంబు రాజాజ్ఞనుండి
నవ్యకైవల్యఫలసాధనంబునుండి
తప్పఁగారాదు తప్పినఁ దప్పునుండి
ఆదినారాయణునకుప్రియంబునుండి.

(నగారవాయించుచు నిష్క్రమించును),

(యవనికదిగజారును).

ప్రథమాఙ్కము-తృతీయరంగము.

సత్రము. (సత్రము కావలివారిరువురుందురు).

[ప్ర: పిచ్ఛిలుఁడు, వలాహకుఁడు.]

పిచ్ఛిల—వలాహకా! ఈరాత్రి కేశవాలయమున గంగావతరణ కథ కాలక్షేపమఁట నే వినలేదా? శోభనాచార్యులను భాగవతుఁడు మాళవమునుండి వచ్చియున్నాఁడఁట. మిక్కిలి గొప్పవాఁడఁట?

వలాహ—పిచ్ఛిలా! నేనటు వినలేదే మురభంజనోపాఖ్యానము కాలక్షేపము చేయుదురని వింటినే.

పిచ్ఛిలా—అదియెక్కడ?

వలాహ—కేశవాలయమునందో లేక పద్మనాభదేవాలయముననో చక్కఁగాఁదెలియదు

[ప్ర: పథశ్రాంతియైన పంచాపకేశుఁడను నధికారి-చంటిబిడ్డతో నతనిభార్య కుముదాంబ-జలంధరుఁ డను సేవకుఁడు.]

అందఱు—(సత్రమున నాయాసమున వచ్చి కూరుచుండుదురు).

పిచ్ఛిల—అయ్యా! మీరెవరు?

పంచా—ఇదిసత్రమేకదా?

పిచ్ఛిల—ఆహా! ధర్మసత్రమే. మీరెక్కడనుండి వచ్చినారు? ఎక్కడకుఁ బోవుచున్నారు?

పంచా—అయ్యా మాది బహుదూరదేశము. దక్షిణ మధురవైపున నుండు వారము. యాత్రకై వచ్చియున్నారము.

పిచ్ఛిల—సంతోషము. ఆప్రక్కన రెండుగదులున్నవి. అక్కడమీవస్తువులుంచుకొనుఁ

(బిడ్డయేడ్చును.)

పంచా—అయ్యా! ఇక్కడ బిడ్డకుఁ బాలెక్కడనైనఁ జిక్కునా?

పిచ్ఛిల—అయ్యా! ఈనాఁ డామాటాడకుము.

పంచా—అదియేమి! ఈయూరపాలు దొరకవా?

పిచ్ఛిల—తృణజలసమృద్ధి గలిగి యమోఘ గోధనముచే రాజిల్లుచున్న యీరాజ్యమున బాలకేమి తక్కువ? ఈసత్రముననే బాటసారుల యుపయోగముకొఱకు నిఱు పిదుకుటావులుగలవు.

పంచా—అట్లయిన పాలు లేవంటివేల?

పిచ్ఛిల—పాలు లేవని యెవరుచెప్పిరి? ఈనాఁడు పాలీఁబడదనియంటిని.

పంచా—అదియేమి?

పిచ్ఛిల—ఈనాఁ డేకాదశియనుట తెలియదా?

పంచా—ఏకాదశియైన?

పిచ్ఛిల—అట్లడిగెదవేమి? చిన్నబిడ్డలు మొదలుకొని యేకాదశి నిరాహారమే చేయవలెఁ

పంచా—ఇదియేమి యసాధ్యమే? ప్రణతార్తిహరా! యీవస్తువులన్నియు నాగది నుంచి యూరిలోనికిఁబోయి యెందైన నిన్నిపాలు తీసుకొనిరమ్ము.

ప్రణత—చిత్తము. (అని పిచ్ఛిలునితో) అయ్యా! వీరు మధురలో న్యాయాధిక పంచాపకేశ శాస్త్రియనిపేరు. గొప్పయింటివారము. భార్యతో బిడ్డతో వచ్చినారు. నెలకు రెండువేల నిష్కములు వేతనము. ఎక్కడనైన నిన్నిపాలు తెప్పియిమ్ము రొక్కముకావలసియున్న నిచ్చెదను.

పిచ్ఛి—నీకేమి పిచ్చిపట్టెను. సర్వజనులు నేకాదశి చేయవలయునని రాజాజ్ఞ యున్నది రాజునాజ్ఞ యట్లుండఁగా దైవమునాజ్ఞయు మాకట్టిదియేయగు. రొక్కమిచ్చినను నేమిచ్చినను పాలేకాదు వంటకుఁ బదార్థములైనను నేఁ చిక్కవు. (బాలుఁడేడ్చును)

పంచా—ఏడవకు నాయనా! యేడువకు సప్తఋషీ! సప్తఋషీ (అని యూఱార్చి) (పిచ్ఛిలునితో) ఇదియేమన్యాయమయ్యా! యీయూరిలో బిడ్డకుఁ బాలివ్వర బిడ్డలు చచ్చిపోవరా?

పిచ్ఛిల—అయ్యో! శాస్త్రిగారూ! ఇంతేనా మీ ధర్మశ్రవణము. ఒకనాఁటి కూ లేమికే మృతిజెందఁగలరా! మృతిజెందెఁబో యేకాదశీమరణము. అదిలంభించుట్లకు పుణ్యముండవలయు.

పంచా—ఛీ! యేమిమాటాడెదవు. ఆమాటనకుము ప్రణతార్తిహరా! లెమ్ము పోయి రమ్ము. కావలసిన పదార్థములన్నియుఁ దీసుకొనిరమ్ము వంటచేసికొందము.

పిచ్ఛిల—నీకుచెప్పువాఁడేమి బుద్ధిలేనివాఁడా? ఒక్కపదార్థమును నీయూరిలో నీనాఁడు దొరకదు. కొంచెము నాలుకగడియలు ప్రాణము బిగఁబట్టుకొనుఁడు. తెల్లవాటియు వాఱకముందే యమూల్యభక్ష్యములతో వంటకాఁగలదు. మీరువల దన్నను విడువక పిలుచుకొనిపోయి యారగింపఁ బెట్టెదరు. ఒక్కనాఁటికే ప్రాణము పోవునా?

పంచా—అయ్యా! ఈయుపదేశము నిన్నేమియు నడుగలేను. పోవరా! ప్రణతార్తి హరా! (ప్రణతార్తిహరుఁడు నిష్క్ర.)

పంచా—అయ్యా! ఆమూల వంటచేసుకొనవచ్చునా?

పిచ్ఛిల—నీగనులలోనే వంటశాలగలదు. పండుకొనుఁడు. రాత్రి కేశవాలయమున నద్భుతరీతిగా హరికథ జరుగఁగలదు. మహానందమున జాగరమొనర్పవచ్చును. తెల్ల వాఱకముందే మీరు వంటచేసుకొన నెంచిన సర్వపదార్థముల నిచ్చెదము. సంతర్ప ణకువచ్చితిరా యింకను మేలే?

పంచా—అయ్యా! ఇంకఁజాలును. మాకు మీయేకాదశియేవలదు. మీపదార్థములును వలదు. మీపుణ్యమును వలదు. మీయుపచారమును వలదు.

పిచ్ఛిల—అయిన మీయిష్టము.

పునః ప్రవేశము ప్రణతార్తిహరుఁడు

ప్రణ—అయ్యా! ఇదిపాడవూరు. అంగళ్లలోఁ గావలసిన పదార్థములున్నవి. ఈ నాఁ డేకాదశియని క్రయమున కీయరు గొల్లవాండ్రు పాలు కుండలకు నించియున్నారు. లొక్కమునకైన, నుపకారమునకైన నేపు తెల్లవాఱుటపఱకు నివ్వరు. వీరలనేమి పుణ్యాత్ములనవలయునో, పాపాత్ములనవలయునో, తెలియదు.

పంచా—అయ్యా! మీయూరివాండ్రు బహుపుణ్యాత్ములుగా నున్నట్టున్నారే? మీరాజెవఁడు?

పిచ్ఛిల—మాయూరు విదిశారాజ్యమునకుఁ జేరియున్నది. అధిక ధర్మాత్ముఁడై సము దంచిత దైవభక్తిపరుఁడై యలఘులీల నేకాదశీవ్రతము పాలింపుచు మమ్మెల్లరఁ గృతార్థులఁ జేయుచున్న రుక్మాంగదుఁడు మాకధీశుఁడు.

పంచా—(స్వ) సరియే మంచియధీశుఁడే! (ప్ర) ప్రణతార్తిహరా! అక్కడ సర స్సున్నట్టున్నది. పోయి స్నానమొనర్చి యాకడవతో నీరుగొనిరమ్ము.

(ప్రణతార్తిహర నిష్క్రమించును).

కుముదా! యీబాలుని నెత్తికొనిపోయి యాడింపుము. మనయొద్దనున్న పాలపొడిపైన నింతకాఁచి పాలుగానొసర్పుము.

పునః ప్రవేశము ప్రణతార్తిహారుఁడు.

ప్రణ—ఏమన్యాయముకొంప! ఆసరస్సునొద్ద నొకకాపలివాఁడున్నాఁడు. క ముంచి తేనీయఁడు. కావలసినన్ని నీళ్లు తీసుకొని గట్టున స్నానము మాత్రము వినియోగముచేసి పోవలయుఁగాని కడవలో నీరుముంచుకొని పోనివ్వనని నిర్బ పెట్టుచున్నాఁడు.

పంచా—(పిచ్ఛిలునితో) ఇదేమన్యాయమయ్యా! మీయూరిలో నీరు తీసుకొనని రఁట?

పిచ్ఛిల—ఎన్నిమాఱులు చెప్పవలయునయ్యా! ఒక్కటే కథగదా? ఏకాదశినాఁ పగటివేళ నీరు నీరెందులకయ్యా? తెల్లవాఱేఁ జేయవలసినవంటకు రాత్రిజా హారిద్దుమీాఱిన పిదపఁ గావలసిన నన్నినీళ్లు తెచ్చుకొనవచ్చును. అభ్యంతరముండఁ కావలసియున్న నాచమనమునకని చిన్న పంచపాత్రతో నీరు తెచ్చుకొనవచ్చును.

పంచా—ఆచిన్న పంచపాత్రనైన నీరుతేరా! ప్రణతార్తిహరా! కొంచెము కాఁ కొందము.

పిచ్ఛిల—ఎట్లు కాఁచుకొందురు?

పంచా—ఏల? కాఁచుకొనుటకుఁ గట్టెలైనఁ జిక్కవా?

పిచ్ఛిల—ఈనాఁ డర్ధరాత్రియైన పిదప నేయంగళ్లలోఁ గట్టెలైనఁ జిక్కుట.

పంచా—ఏమయ్యా! యీసత్రములో కొండ వేసినట్లు వేసియున్నారే వంటచెఱకుఁ అవి రెండివ్వరాదా?

పిచ్ఛిల—అర్ధరాత్రము మీాఱుటవఱకు వాని నిచ్చుటకు మాకాజ్ఞలేదు.

కుముద—నాథా! బాలుని యేప్పు నిలుపుటకు సాధ్యమేలేదు. ఈపాడుకొంప నేల? ఎంతశ్రమమైనఁగాని బండిగట్టుకొని ముందూరికైనను బోవుదము.

పిచ్ఛిల—కావచ్చును. అయిన నీనిర్బంధములు తప్పవలయునన్నఁ దూర్పు మున యామడలు, పశ్చిమమున ముప్పదియామడలు, ఉత్తరమున నిరువదినైదామడ మాత్రము పోవలసియుండును. అంతవఱకు విదిశానాథుని రాజ్యమే.

పంచా—హా! దైవమా! దేవీ! ఇంకేమిచేయవలయు. బలవన్మాఘస్నానము వినియోఁగుదుముగదా? అట్లనే యిదియు బలవంతపు టేకాదశీ వ్రతమనుకొందు

(లోపల భేరీధ్వని).

పిచ్ఛిల—అయ్యా! తప్పదు లెండు. స్నానభేరి మోఁయుచున్నది. ఏటికిఁబోయి స నముచేసి వత్తము. (నిష్క్రమింతురు).

—: ప్రథమాఙ్కము సమాప్తము. :—

———:o:———

శ్రీ

మోహినీ రుక్మాంగద నాటకము.

---:0:---

ద్వితీయాఙ్కము-ప్రథమరంగము.

---0---

సంయమపురి.

ప్ర: యముఁడు. వైద్యనాథుడనుగంధర్వుఁడును. (చదరంగమాడుచు)

వైద్య—ఓడితినింకఁజాలును. ధర్మరాజా! ఇప్పుడిప్పుడుకదా కొన్ని సంవత్సరముల నుండి నీ కవకాశముదొరకుట ఇంతకుఁ బూర్వమీయాటలకై యొక్కింతైన నీకుఁ గలుగుండదే? ఇట్లుండియు నింత స్వల్పకాలమున నెట్టిశక్తి యార్జించితివి!

యమ—వైద్యనాథా! ఇంగులకింత ప్రశంసవలయునా! నీ పాండిత్యము నెదుట నా ప్రతిభయెంత? చూచితివా! ఇన్నిదినములు నాకుఁ బ్రొద్దుచాలదేయని యేకరువు చుంటి. ఇప్పుడు ప్రొద్దుపోవదేయని వేసరుచున్నాను.

వైద్య—ఏమి! ఒక్కరైన నీపిటికి రారా యిప్పుడు?

యమ—ఎప్పుడో యొకప్పుడు వచ్చుచుందురుగాని, నా కవకాశముగలుగుటయే మెండు.

వైద్య—అయిన నాకింక సెలవా? మరల నెప్పుడు రావలయు.

యమ—ప్రొద్దంతయు నీ విందేయున్న సంతసింతును.

వైద్య—ధర్మరాజా! అవశ్య మాడవచ్చును కాని, నాకింపుక పనియుండుటంజేసి విధిలేకయున్నది.

యమ—చాలదినములయ్యె నీమిత్రుఁడగు చిత్రకేతుని పాటవినక. అతని నింత పంపఁ గలవా?

వైద్య—చెప్పఁగలను కాని వచ్చునను నమ్మకము మాత్రము నాకుఁ గలుగదు. దినమును, రుక్మాంగదు నేకాదశీ ప్రభావమున, భూమిని నిలిచిన ప్రాణులు వైకుంఠలోకమున కరుగునప్పుడు గంధర్వులు-కిన్నరులు-కింపురుషులు పాడుచు, నప్సర స్త్రీ లాడుచు, దేవదుందుభి ధ్వాన మొనర్పవలయునని తప్పని పద్ధతిగానున్నది. కావున నిందఱు గంధర్వులుండియు నొక్కరికైన రెండు గడియలైన నవకాశ మొదవకున్నది. ఎందైనఁబోయి వేడుకగాఁ గాలము గడపవలయునని కూర్చుండిరా వెంటనే సేవకులు పిలువవత్తురు.

యమ—అట్లనా! ఇదియే మసాధ్య ప్రక్రియగానున్నది. పోనీ! దేవేంద్రుఁ డప్పుడప్పుడు నడపుచుండిన యప్సరోవధూమణులనాట్యములకు నన్నుఁ బిలిపించుచుండె. నాకనకాళే మేమాత్రమును జాలక యొక్కనాఁడైనఁ బోవఁజాలకుంటి. ఇప్పుడెంతయో యవకాశము గలదుగదా? పోవలయునన్న, నాట్యములే లేకుండ నయ్యె. ఒక్కమాట నీవెట్లయినఁజేసి దేవనాథునికిఁ జెప్పి రెండుగడియ లెవ్వరినైన నచ్చరలఁ బంపమనఁగలవా? కావలసియున్న లేఖవ్రాసియిత్తును.

వైద్య—ఎట్లయిన విశ్వప్రయత్న మొనరించి యెవరినైన గంధర్వుని బంపఁగలను గాని, యచ్చరల మాట విడిచిపెట్టుము. గంధర్వులసంఖ్య మిక్కిలియగుటచే నది యెట్లయిన సాధ్యమగు. అచ్చరలన్ననో యల్పసంఖ్యాకులు క్షణక్షణమును వారికిఁ బిలుపుదగిలి యొక్కరికైన నవకాశములేమిచే నెంతయుఁ బరితపించుచున్నారు. వారిలోనసే వారొక్కరికొక్కరు మాటలాడవలయునన్న, నాజీవ వైకుంఠ ప్రయాణోత్సవకాలమునఁ గాక, వేఱుకాలమున వారి యునికిపట్టుల నవకాశమేలేదు. తమ్ము ననిమేషలుగా నిద్రలేకుండ బ్రహ్మ సృజించినందులకు వారు పడుసంకట మింతయని చెప్పఁజాలను. మఱచితి నిన్న బ్రహ్మలోకమునకుఁ బోయెదనని చెప్పి యుంటివే? అందలి విశేషము లేమియుఁ జెప్పవైతివి.

యమ—నేఁ బోవలయునని వెడలి యొక్కింత దూరముపోవఁగా దేవగురుఁడగు బృహస్పతి దర్శనము నాకులభించె. అతనితో ధర్మశాస్త్ర విచారమునకుఁ బూనుకొని సంభాషించుచుండఁ బ్రొద్దుపోయినందున విరించి దర్శనముకాలేదు. రేపు మఱల పోవలయునని యున్నాను.

వైద్య—శమనా! నిరంతరము జీవవిచారమున నున్న నీకు నిపుడించుకైన పనిలేకుండుట విచారమునకుఁ గారణముగా నున్నదా లేక సంతసమునకుఁగారణముగానున్నదా?

సీ. అసిపత్రవనములయందుఁ ద్రోయఁగలేదె
విలపింపఁ గన్యకావిక్రయులను
దారుయంత్రములనంతటఁ ద్రిప్పఁగాలేదె
దారుణక్రియ గురుతల్పగులను
కూటశాల్మలులందుఁ గుదియఁగొట్టఁగలేదె
పాడిఁదప్పినధరాపాలకులను
గాలసూత్రములందు గడియనొంపఁగలేదె
ఘనశక్తి విశ్వాసఘాతకులను

తే. గీ. వహ్నికుండములంబడవైవలేదె
తల్లడంబందఁగా గృహదాహకులను
బెబ్బులులచేతవడిఁగఱపింపలేదె
గరళమన్నములోనిడుకష్టమతుల.

యమ—గంధర్వోత్తమా! నీతో నిదివఱకే చెప్పియుండలేదా? మొదట కొన్నిదినములుమాత్ర మీపనిలేనియునికి మహావిచారమునకుఁ గారణమయ్యె. ఎందఱు జీవులనో, యెన్ని నరకములనో, చెప్పరానిబాధల వారి పాపానుగుణముగాఁ బెట్టుచుండిననాకు నేమియుఁబనిలేక యూరక నీఁగలఁదోలుకొనుచుఁ గూర్చుండియుండవలయునన్నఁ బెన్నిధానము పోయినట్లు చింతకుఁ గారణముగానుండె. తర్వాతఁ గొన్నిదినములకు నాకార్యహీనత యెనలేని సంతోషమొదవించునట్లయ్యె. నే నదివఱకొనర్చుచుండిన హింసాకార్యముల నేవగించుట కాస్పదయయ్యె. అభ్యాసవశమున నేడియు నిట్లేగదా?

వైద్య—సందేహమేమి?

యమ—అదిగాక యిన్నిదినములు బ్రహ్మదర్శనముగాని, దిక్పాలమిత్ర దర్శనముగాని, నాకులభింపవలయునన్నఁ గష్టసాధ్యముగానుండె. ఇప్పుడెన్నిమారులు దర్శనము చేసికొనవలయునన్నను నెంతకాలము సంభాషణచేఁ గడపవలయునన్నను, నభ్యంతరములేదు. ఇది మిక్కిలి మోదకారిగదా?

అనుబంధము 1.

వైద్య—ఔను.

యమ—కానిమ్ము. పొమ్ము. రేపు మఱలఁ గలియుదము. (నిష్క్ర.)

ద్వితీయాఙ్కము-ద్వితీయరంగము.

———:o:———

ఇంద్రపురిలో

[ప్ర. రంభ-మేనక-తిలోత్తమ-హారిణి-మోహిని-ఊర్వశి హేమ-వరూధిని.

రంభ—ఊర్వశీ! నిన్న సురగురుఁడు రచించి ప్రకటించియున్న గీతమిదివఱకు మేము విన్నదానికంటె మిక్కిలి మనోహరముగా నుండలేదా? అది నేర్చుకొనుటకే మిక్కిలి కష్టముగానున్నదే. నాకింకను బట్టువడలేదు. నీవేమైన గ్రహించితివా?

ఊర్వశి.—నేనేదో యొకవిధముగ గ్రహించియున్నాను గాని యింకను నామార్గము ఋజుమార్గముగా నుండినట్టు కనపడలేదు.

రంభ—ఏదీ! ఇంతాలకింతము.

ఊర్వ—(ప్రయత్నము చేసి) లేదే! ఇంకను క్రమముగా రాలేదు. కొంపటికి నేర్వ వచ్చును.

హేమ—అక్కలారా! మన మోహిని యప్పుడే గుఱుతించినట్టున్నది. నేఁడుదయమును నసే మనోహరముగఁ బాడుచువచ్చె.

రంభ—అట్లనా? అట్లయిన నీమోహిని సమగ్గ్రాలే. ఏదీ మోహినీ! నీకా సురగురు గీతము పట్టుపడియున్న నింత విందము.

మోహి—నాకు నింకను జక్కఁగఁ బట్టువడలేదు.

హేమ—నేఁడుదయమున నన్నట్టుకానిమ్ము చాలును.

మోహి—

అనుబంధము 2.

అందఱు—(కరతాళధ్వనులు చేయుదురు).

ఊర్వ—సెబాసు. మోహినీ! నీవు గానవిద్యావిశారద వయ్యెదవు. ఇన్ని దినముల నుండి విద్యావిశారదలని ఖ్యాతిగన్న మాకెవ్వరికిఁగాని రానిమాదిరి నీ వచిరకాలమునసే గ్రహించితివి. ఏదీ! ఇంకొకసారి పాడుము.

మోహి—(పాడును).

హేమ—ఊర్వశీ! ఇదియే యెంతో యందముగానున్నదిగదా? నిన్న రాత్రిఁ గచుఁడు రచియించిన గీతము దీనికంటె శ్లాఘ్యమని నాకుఁ దోఁచుచున్నది.

ఊర్వ—ఏది! వినలేదే.

సోమ—మోహినీ! దానినింత విందము చెప్పుము.

ఊర్వ—నిన్నరాత్రి యతఁడు రచించియు రచింపకముందే యీమోహిని గ్రహించెనా? అట్లయిన నీకఁ గొన్ని నాళ్లలో రంభనుగాని, మేనకనుగాని, నన్నుగాని, తిలోత్తమనుగాని పాటించువారే లేకపోవుదురుగదా? (అని చిఱునవ్వుమాపును)

మోహి—అక్కా! సముద్రములయెదుటఁ గాలువలన్నట్లు సముచిత ఖ్యాతిసమేతలగు మీయెదుట నేనొక పదార్థమా?

ఊర్వ—మోహినీ! నేను వేడుకకుఁ బ్రశంసాపూర్వకముగ మాటలాడితిఁగాక, యసూయచే నన్నదానను గాను ఏదీ! కచుగీత మింత వినిపింపుము.

[ప్ర: శీఘ్రగమనమున దేవసేవకుఁడు

దేవసేవ—రంభాదులారా! మీరందఱిందుఁ జేరియున్నారా? ఇదియేమన్యాయము. అదె వైకుంఠలోకమునకుఁ బోవు జీవాత్మలు నిలిచియున్నారు. వెడలిరండు.

రంబ—ప్రారంభమాయెనా! హరిణీ! నీవుపొమ్ము, ఒక్కింతసేపు.

హరిణి—(స్వ) గానము వినుటకులేదే ఈపాడు జీవాత్మలెక్కడనుండి వచ్చిరి.

దేవసేవక—వెడలివచ్చెదరా—దేవేంద్రునితోఁ జెప్పవలయునా?

హరిణి—అయ్యా! వచ్చితిని. కోపగింపవలదు. (దేవసేవకునితో నిష్క్ర.)

ఊర్వ—ఏదే! మోహిని. కచుగీతము.

మోహి— అనుబంధము 3 (పల్లవిమాత్రము పాడును).

ప్ర: 2వ సేవకుఁడు

2వ దేవసేవ—ఇంకలెండు. ఇక్కడనేల కూర్చుండితిరి. దక్షిణవైపుననుండి జీవాత్మల యుత్సవము వెడలినది. వైకుంఠము వఱకు నడిచి రండు. లెండు. లెండు.

రంభ—వరూధినీ! నీవుపొమ్ము.

వరూ—అక్కలారా! ఎన్నాళ్లీ యుగ్రహచారము మనకు.

(2వ సేవకునితో నిష్క్రమించును).

ఊర్వ—మోహినీ! ఈకచుగీతము బహుమనోహరముగానున్నది. ముగింపుము.

మోహి— అనుబంధము 3 (ఒక చరణముపాడును.)

[పునః ప్రవేశము 3వ సేవకుఁడు.]

3వ సేవ—లెండు. పడమట వైపువారు వచ్చుచున్నారు. ఇక్కడఁ గూర్చుండిన జరుగదు.

సోమ—నేను పోయివత్తును. (దేవసేవకునితో నిష్క్రి)

మోహి—ఇంకమనము వెడలవలయు.

రంభ—దినదినము నిదేగోడయ్యానే మనకు. ఇదివఱకప్సరసలన్న వారినాట్యముతో నెన్నఁడో యొకనాఁడు పనిపడుట. ఇప్పుడు తెల్లవాఱినది మొదలు విరామము లేకుండ పనియున్నదే? ఎన్నిదినము లిట్లుండఁగలరు.

ఊర్వ—ఈ యేకాదశీవ్రతము లోకమున జరిగినన్నాళ్లు నిదేగతియే యుండఁగలదు.

తిలో—నాకేఁజూడ రుక్మాంగదుఁడు చచ్చుఁటకు మనకీ గ్రహచారముండవచ్చుననియే తోఁచుచున్నది. అతని జీవము వైకుంఠమునకుఁ జేర్చినపిదప మనయప్సరల నాట్యముతో నంతపనియుండదు.

రంభ—ఇదేటిమాట! రుక్మాంగదుడు పోయినంతనే యతఁడిన్ని దినములు బహుప్రయాసమున స్థాపించిన యేకాదశీవ్రత మెట్లుడఁగు. ఇంక మనకు కొనవఱకునింతే.

ప్ర: 4వ దేవసేవకుఁడు

4వ దేవసే—వెడలిరండు. ఉత్తరమువైపు వారువచ్చుచున్నారు.

రంభ—ఆహా! యేమివిధి.

మోహిని—నేఁబోయెద.

మేనక—మోహినీ! వలదు. ఆగీతము ముగించి పోవుదము.

తిలో—ఔను మోహినీ! పాడుము

4వ దేవసేవ—మంచిమాటాయె. మీపాటలు-మీవేడుకలు-మీవినోదములు మీరులేకున్న నక్కడఁ పను లెట్లు జరుగవలయు. అందఱు నిరీక్షించుచున్నారే?

తిలో—పడియుండని యొకగడియ?

4వ దేవసేవ—ఆగడియలో ఇంకెందఱో మీ—రాఁగలరో లెండు. లెండు.

తిలో—రంభాదులారా! ఆగీతము నేను పిదప వినఁగలను. నేఁబోయెద. మీరువినుఁడు.

ప్ర: 2వ సేవకుఁడు

2వ దేవసేవ—ఏమిరా! ఇక్కడవచ్చి వీరితో సరసములాడుచున్నావే. అక్కడ నుత్తరవైపున గంధర్వాదులెల్ల నిరీక్షించి—.

4వ దేవసేవ—అదియే వీరితోఁ జెప్పుచున్నాను. వీరలు తెలివిలేక పాటలు పాడుకొనుచున్నారు. తిలోత్తమా! రమ్ము.

(తిలోత్తమ 2వ దేవసేవకునితో నిష్క్రమించును).

రంభ—ఇంకనొక క్షణములో మనవంతు రాఁగలదు. మోహినీ! కానిమ్ము.

మోహిని— అనిబంధము 3 పాడును.

4వ దేవసేవ—బళీ! బళీ! (అని మెచ్చును).

మోహి—ఇంకమనము వెడలవలయు.

రంభ—దినదినము నిదేగోడయ్యెనే మనకు. ఇదివఱకప్సరసలన్న వారినాట్యముతో నెన్నఁడో యొకనాఁడు పనిపడుట. ఇప్పుడు తెల్లవాఱినదిమొదలు విరామము లేకుండ పనియున్నదే? ఎన్నిదినము లిట్లుండఁగలము.

ఊర్వ—ఈ యేకాదశీవ్రతము లోకమున జరిగినన్నాళ్లు నిదేగతియే యుండఁగలదు.

తిలో—నాకఁజూడ రుక్మాంగదుఁడు చచ్చునంతకు మనకీ గ్రహచారముండవచ్చు ననియే తోఁచుచున్నది. అతని జీవము వైకుంఠమునకుఁ జేర్చినపిదప మనయప్సరల నాట్యముతో నంతపనియుండదు.

రంభ—ఇదేటిమాట! రుక్మాంగదుఁడు పోయినంతనే యతఁడిన్ని దినములు బహుప్రయాసమున స్థాపించిన యేకాదశీవ్రత మెట్లుడఁగు. ఇంక మనకు కొనవఱకునింతే.

ప్ర: 4వ దేవసేవకుఁడు

4వ దేవసే—వెడలిరండు. ఉత్తరమువైపు వారువచ్చుచున్నారు.

రంభ—ఆహా! యేమివిధి.

మోహిని—నేఁబోయెద.

మేనక—మోహినీ! వలదు. ఆగీతము ముగించి పోవుదము.

తిలో—ఔను మోహినీ! పాడుము

4వ దేవసేవ—మంచిమాటాయె. మీపాటలు-మీవేడుకలు-మీవినోదములు మీరు లేకున్న నక్కడఁ పనులెట్లు జరుగవలయు. అందఱు నిరీక్షించుచున్నారే?

తిలో—పడియుండని యొకగడియ?

4వ దేవసేవ—ఆగడియలో ఇంకెందఱో మీ—రాఁగలరో లెండు. లెండు.

తిలో—రంభాదులారా! ఆగీతము నేను పిదప వినఁగలను. నేఁబోయెద. మీరువినుఁడు.

ప్ర: 2వ సేవకుఁడు

2వ దేవసేవ—ఏమిరా! ఇక్కడవచ్చి వీరితో సరసములాడుచున్నావే. అక్కడ నుత్తరవైపున గంధర్వాదులెల్ల నిరీక్షించి—.

4వ దేవసేవ—అదియే వీరితోఁ జెప్పుచున్నాను. వీరలు తెలివిలేక పాటలు పాడుకొనుచున్నారు. తిలోత్తమా! రమ్ము.

(తిలోత్తమ 2వ దేవసేవకునితో నిష్క్రమించును).

రంభ—ఇంకనొక క్షణములో మనవంతు రాఁగలదు. మోహినీ! కానిమ్ము.

మోహిని— అనిబంధము 3 పాడును.

4వ దేవసేవ—బళీ! బళీ! (అని మెచ్చును).

ద్వితీయాఙ్కము-తృతీయరంగము.

———o———

బ్రహ్మసభ.

ప్ర: బ్రహ్మ-సరస్వతి-ఋషులు-సనకుఁడు-సనందుఁడు-యముఁడు-నారదుఁడు.

అనుబంధము ౫.

బ్రహ్మ—ధర్మరాజా! మఱేమి వచ్చియుంటివి? నావలనఁ గాఁదగినకార్య మేమైన నున్నదియా?

యమ—ధాతా! నిను దర్శించుకొనుటకంటె నాకుఁగార్యమేమి? విరామములేక పగలును రాత్రియు జీవవిచారమువలన నున్నకాలమున నిన్ను దర్శింపవలయునన్నఁ దీఱిక యెదవుటయే దుర్లభముగానుండె. ఇప్పుడన్న నో యెడలేని విరామము నాకు లభించియుండుట మున్న నే విన్నవించితిఁగదా?

చ. ఒదవినకార్యభారమున నుజ్జ్వలజీవవిచార మెప్పుడున్
వదలక చేసి బాధ లనివార్యముగా నిడుచున్నవానికిన్
ఇదెయవకాశమిప్పుడురహించె భవాదృశులైనవారిస
త్పదములగొల్వవచ్చుటకు భాగ్యముగాదెసరోజసంభవా.

నినుబోలు గొప్పవారి సందర్శనమునకుఁ బుణ్య సంవాదనమునకు నాకిప్పుడింత యా స్పదము కలిగియున్నది.

బ్రహ్మ—సంతోషము. ధర్మరాజా! నీకిప్పుడు పనియేలేకున్నదిగదా?

యమ—బొత్తిగా లేకున్నదని చెప్పుటకులేదు, ఇన్నాళ్లుండిన పనిలో శతాంశమైనలేదు.

బ్రహ్మ—ఇదియంతయు రుక్మాంగదు హరివాసర వ్రతాచరణ మహాత్మ్యమేగదా?

యమ—అన్నిటికిని నీవేకదా కర్తవు? నీవువారియెక్క వ్రతాచరణమున జీవులకెల్ల వైకుంఠగమనము లభించియుండునా?

బ్రహ్మ—ఐనశమనా! ఈ కార్యలోపమువలన నీకేమైన మనసునకుఁ గొదవగానున్నదా?

యమ—అయ్యో! కమలాసనా! అట్లైన్నటికైన నుండునా? కార్యమువలన వేసట గొనక చేయుచునే యుంటి. కార్యము లేకున్న మఱియు మేలయ్యె. భగవత్కైంకర్యము

కర్యమునకుఁ దన్నామ స్మరణకు నినుబోలు విజ్ఞుల సందర్శించుకొనుటకు నపూర్వ రీతిగా నాకు విరామ మొదవినందులకు మనసున సంతోషము వొడముఁగాక కొదవ జనించుటకుఁ గారణమేమి?

సీ. సతతంబుసంగీత సాహిత్యవిద్యల
గారవించుటకవకాశమబ్బె
నతిశయంబుగ మిత్రతతులతోడ వినోద
గోష్ఠి సేయుటకనుకూలమయ్యె
నెమ్మదిఁగడుభక్తి నిండారమిముఁబోటి
పెద్దలదర్శింప వేళఁగలిగె
నరుదారురీతిగా హరినామకీర్తనల్
తమిదీఱసేయంగ సమయమొదవె

తే గీ. నరసిచూడంగరుక్మాంగదావనీశు
సలలితైకాదశీవ్రతసత్ఫలంబు
నాకుమోదంబునకుఁగారణంబుగాక
వారిజాసన కొదవకుఁగారణంబె.

బ్రహ్మ—మిక్కిలి సంతసించితిని.

యమ—నేనొకటి విన్నవించెద. నీమనసునకుఁ గొదవగలిగెనాయని నన్నడిగితివే యందునకుఁ గారణము మేమియని యడుగవచ్చునా?

బ్రహ్మ—మఱేమియులేదు. జీవవిచారములేక నరకములన్నియుఁ బాడుపడియుండినది చూచి నీకు సంతాపము కలిగినదని నే వినుటచే నామాట యడిగితి.

యమ—ఎట్టివారికైన జీవహింస చేయుటకు లేకపోయెనే-నరకములవారి బాధించుటకు లేకపోయెనే యని సంతాపము వొడముటకాస్పదమగునా? ఈమాట నీకెవ్వరు చెప్పిరి?

బ్రహ్మ—ఎవరో ప్రస్తాపవశమున వచించిరి.

నారద—కృతాంతా! నేనే చెప్పితిని. కొన్నినాళ్లకుముందు నేను నీలోకమునకు వచ్చి వినోద సంభాషణము జరుపుకాలమున నేకాదశీ వ్రత ప్రభావము ముచ్చటించుచు జీవులు పాపమొనరించినను దత్ప్రభావమున నా లోకమునకు రాకున్నారే యని విచారము జనించెడునని నీవనియుండలేదా? అదియే వచించితి.

యమ—ఆమాటయా? నేనన్న వృత్తాంతమేమి నీవుచెప్పిన వృత్తాంతమేమి! చతురాననా! నేనన్నమాట యిది. జీవులు పాపమొనరించినను, నా పాపమునకుఁ దగిన శాంతివడయక యేకాదశీ వ్రత ప్రభావమున నాపాపముమాటి పుణ్యముగలిగి వైకుంఠమునకుఁ బోవుచుండుట శోచనీయ విషయమనియు, దురాత్ములగువారికి నావ్రతమును మాత్రము నమ్మి యితరవిషయములఁ బాపమొనరించినను బాధకము లేదనియు నెక్కడ తోఁచునోయని భీతికాస్పదముగా నున్నదనియు నే నాడితి. దాని ననుసంధించి నీపుత్రుఁడగు నీ నారదుఁడు జీవవిచారము చేయమికి నేనేమో దుఃఖించునట్లు వచించియున్నాఁడు. అతని స్వభావమేకదా?

నారద—నాస్వభావమేమియుఁగాదు. నీదురాపమే? నీమనమున నేమనుకొంటివో కాని వెలికిమాత్రము జీవులకు నరకబాధలు పొసఁగుటకు లేదయ్యెనేయని నీవు దుఃఖించినట్లె నాకుఁదోఁచెను. ఉన్నమాటయే చెప్పితిని.

[ప్ర: ఒక ఋషి.]

ఋషి—కమలాసనా! విష్ణులోకమునుండి సేనానియగు విష్వక్సేనుఁడు వచ్చియున్నాఁడు.

బ్రహ్మ—(లేచి) మనమందఱము పోయి పిలుచుకొని వత్తము. (ఋషులతోఁబోయి విష్వక్సేనునిఁ బిలుచుకొనివచ్చి పీఠముపైఁ గూర్చుండఁబెట్టును).

విష్వ—ధాతా! మీకెల్లరకుఁ గుశలమా?

బ్రహ్మ—సేనానాయకా! అందఱికిని గుశలమే. నీవిందు విచ్చేయుట యామహావిష్ణువే యనుగ్రహించినట్టులయ్యె. ఏదో ఘనకార్యముండవలయుఁ గాక లేకున్న మహామహుఁడవగు నీవు వచ్చియుందువా? ఆనతిచ్చిన నదెట్టికార్యమైనను శిరసావహించి చేసెద.

విష్వ—కమలాసనా! ఘనకార్యమేమియు లేదు. ఒకానొక పనికై నీతో నాలోచించి రమ్మని కమలానాథుఁడంపియుండ వచ్చియున్నాఁడను. రుక్మాంగదు నేకాదశీ వ్రత మాహాత్మ్యమున జీవులెల్ల వైకుంఠమునకే వచ్చుచుండుట నీ వెఱుఁగుదువుగదా? ఆ వైకుంఠము వైశాల్యమున లెక్కింప నలవిగాని విరివిగలిగియుండియు నిండుచు వచ్చియున్నది. మిద్దెలు మేడలెల్లఁ గ్రిక్కిఱిసియున్నవి. ఇంకఁ గొన్నినాళ్లు మాత్ర మీరీతిగనే జీవాత్మాగమనము జరుగుచుండెనా? చోటులేకుండెడు. కావున ముందునకు ముందే తగిన ప్రయత్నమును జేసి యాపట్టణము నింకెంత పెంచుటయో లేదా మఱియొక వైకుంఠమును గల్పించుటయో యీవిషయమున నిన్నడుగవచ్చితి.

బ్రహ్మ—సూత్రవతీనాథా! సంకల్పమాత్రమున మాదృశులఁ గోట్లకొలఁది సృజింపఁగల యా వైకుంఠనాథునకు నిదియొక్క యోచనయా? నన్నింత పెద్దచేయుఁ దలంపతనికిఁ గలిగెఁగాక.

అనుబంధము 6.

ఇందులకు యోచన యొకించుకైన నేచెప్పఁగలనా? ఆమహామహుఁడెట్లొనర్పుమని యాజ్ఞయిడిన నట్లొనర్చుటకు సిద్ధముగా నున్నాఁడను.

విష్వ — ధాతా! అందునకుఁగాదు. ఆమహాత్మునకు నెంత సామర్థ్య ముండినను సృష్టిక్రమమంతయు నీవలనే జరుగవలయునుగదా? కావున నీతో నాలోచించుటకు నన్నంపియున్నాఁడు. విశ్వకర్మ యెన్నియోగృహములు సౌధములు నావైకుంఠమునఁ గట్టియున్నాఁడు. ఎన్నికట్టినను జాలకున్నది. ఇప్పటికేమో చాలినంత ప్రదేశమున్నది నిక్కువమే? ఇంకఁ గొన్ని యేండ్లు మాత్రముపోయినఁ జోటుచిక్కదు. నూతనగృహనిర్మాణమునకు నెడముచాలదు.

బ్రహ్మ — క్షేత్రధరా! అయ్యాదివిష్ణు వేమొనరింప నాజ్ఞయిడిన నాకార్య మొనర్చుటకు సిద్ధముగానున్నాను.

విష్వ — ఇప్పటికిమాత్రము విశ్వకర్మవంటివాని మఱియొకని సృజింపుమనియు నీకఁ గొన్ని యేండ్లకే వైకుంఠాంతర నిర్మాణ మవశ్యముగా నుండుననియు శ్రీధరుఁడు వచింపుమనినాఁడు.

బ్రహ్మ — భాగ్యము. మదినుంచుకొనెద.

యమ — అబ్జగర్భ! ఇది చిత్రముగదా! నాలోకమెల్ల నివసించువారులేక పాడుపడుటకుఁ గారణమయ్యె. అందొ మఱియొక్క లోకము నిర్మింపవలసివచ్చె.

[ప్రవేశము: ఋషి.]

విధాతా! దేవలోకముననున్న యప్సరస్త్రీలందఱు వచ్చియున్నారు.

బ్రహ్మ — మిక్కిలి మేలయ్యె. మంచిసమయము. రాక రాక శ్రీధరప్రతినిధియగు నీ సేనాని వచ్చియున్నాఁడు. యముఁడును గార్యాంతరములేక యాసీనుఁడై యున్నాఁడు. రమ్మనుము వారి నాట్యమో గానమో జరిపింతుము.

(ఋషి నిష్క్రమించును)

[ప్ర: రంభ-ఊర్వశి-మేనక-తిలోత్తమ-మొదలగువారు
బ్రహ్మకు నమస్కరించి.]

అనుబంధము 7.

బ్రహ్మ — అచ్చరలారా! రండు. మీలోకరొక్కరు వచ్చుటకే కష్టముగనుండునే. ఉన్న యచ్చరలెల్ల నొక్కసారియే వచ్చియుండుట వింతయగుఁగదా?

మేనక — దేవా! ఒకవిన్నప మొనర్ప వచ్చియున్నారము. ఆనతిచ్చిన విన్నవింతుము.

బ్రహ్మ — ఏమది?

మేనక—స్వామీ! భూలోకమునుండి వైకుంఠమునకుఁ బేరులుగట్టి పోవు జీవాత్మల వెంట నప్సరో నాట్యముండవలయునని నీవే విధించితివో యింకెవ్వరు విధించిరో తెలియదు కాని నావిధమును మేమిప్పుడు కంటగించుచున్నాము. పగలును రాత్రియు విరామము లేక మాకెల్ల నాట్యకార్యమే యేర్పడినది. మేము మితసంఖ్యావారమే కదా యుండుట? ఆసంఖ్య యెంతమాత్రమును జాలకయున్నది. కావున మావిన్నప మింతయే. వారివెంట నుత్సవమునకుఁ బోవుటకు మాయవశ్యకత తప్పించితివా బ్రతుకు కొందుము. ఒండేని యింకను నెక్కువ సంఖ్య యప్సరలనైనను సృజించి పుణ్యముఁ గట్టుకొనుము. ఈ రెండింటిలో నొక్కటి యొనర్పకుంటివా మాకు బ్రతుకు లేదు. మేము నిర్జరులమే యమరులమే నిక్కము. ఐన నింత యలవిలేని వ్యాయామము మాకుఁ గలిగియున్న మానిర్జరత్వమును, మాయమరత్వమును, మాకు లేకుండిన మేలని యనిపించుచున్నవి. అనుగ్రహించి మము రక్షింపుము.

బ్రహ్మ—అచ్చలారా! కూర్చుండుడు.

రంభ—ఆర్యా! విధాతా! మేమెక్కడ కూర్చుండఁగలము.

అనుబంధము 8.

ఈ యింతసేపటికే మేము లేనందున జీవవైకుంఠ యాత్రోత్సవమున కల్లోల కల్లోలమై యుండును. ఎందఱు దేవసేవకులో మాకొఱకు వెదకుచుందురు. మేము నితరాప్సరసుల వేఁడికొని కొంతకాలము మాత్ర మవకాశము వడసి వచ్చితిమి. మాకేమి యాజ్ఞ యొసంగెదవు.

బ్రహ్మ—వనితామణులారా! మీకు మిక్కిలి శ్రమగలుగుట నేనొప్పుకొందును. ఐన నిందున నాయత్నమేమియు లేకయున్నది. వైకుంఠమునకుఁ బోవువారికి మీ నాట్యము తప్పక యుండవలయుననుట నే రచించిన విధానము కాదు. ఆదినుండి వేదములతోఁగూడ నుద్భవించిన విధానము గానున్నది. అది మార్చుటకు నెప్పటికెని సాధ్యము కాదు.

అనుబంధము 9.

ఇంక నూతనాప్సరో నిర్మాణమునకా! అది నాకు సాధ్యమా? మీ జననమన్న నెట్టి యసాధ్య కార్యమువలన లభించినది. దేవాసురుల యుద్ధ నెపంబున నెల్ల దేవతలు నెల్లరాక్షసులుఁజేరి యేకమై మంథరమును మోసితెచ్చి విశ్వప్రయత్న మొనరించుచు శ్రీహరికిఁ గూర్మావతారము కలుగునట్టుచేసి యసాధ్య ప్రక్రియగా క్షీరసాగర మథనముఁ గావించి యింత ప్రయత్న మొనరించినఁగదా మీ జననము గలిగె? ఇప్పుడింకెట్లు చేయవలయు. ఈ రెండును నాచేతఁగాని పనులే.

ఊర్వశి—అయిన మాభాగ్య మింతయేకదా ? సంకల్పమాత్రమున జగత్సృష్టి మొనర్పఁగ గలిగి నీవే మా కష్టములకుఁ బ్రతిక్రియ కావింపఁజాలవన్న మా దురదృష్ట విశేషమే కదా ? ఇంకెవ్వరిని వేఁడుకొనఁగలము.

బ్రహ్మ—తరుణీమణులారా ? విధి విధానమున నన్ని కార్యములు జరుగనే వలయుఁ గదా ? దాని కెవరేమి చేయఁగలరు. మీకష్టము నిరంతము నుండఁగలదా? కాలము నిరీక్షించి యుండుఁడు. మీకష్టముల కంత్యము కానేవలయు. ఏవిధానము గాని యెల్లకాలము నొకేరీతిగా నుండదు. పోనిండు. యోచింపకుఁడు. నా పై ననుగ్రహమున నిదే విష్ణుసేనాని యీనాఁడు విచ్చేసియున్నాఁడు. శమనుఁడును గార్యాంతర ప్రసక్తి లేమి ననుఁజూడ నరుదెంచి యున్నాఁడు. మీరును యాచింపకయే వచ్చియున్నారు. ఏదీ మా వీనులకు విందు నాట్యముతోఁగూడ గానము నింత వినిపింపుఁడు.

ఊర్వ—దేవా ! మాకెల్లరకు నిరంతర గానమున రాసుగొంతును, నిరంతర నాట్యమునఁ జచ్చుకాళ్లును లభించియున్నవి. ఐనను మహాత్ముఁడవగు నీ వాజ్ఞయిడిన వలదనఁ జాలుదుమా ? శిరసావహించెదము.

అనుబంధము 10.

—: ద్వితీయాఙ్కము సంపూర్ణము :—

శ్రీ

మోహినీ రుక్మాంగద నాటకము.

———:0:———

తృతీయాఙ్కము-ప్రథమరంగము.

———:0:———

రుక్మాంగదు నగరు.

[ప్ర: గర్భవతియగు రుక్మాంగదు రాణి సంధ్యావళి పడకపై పండియుండ రుక్మాంగదుఁడు ప్రక్కనఁ గూర్చుండియుండును.]

రుక్మా—ఇప్పటికి నేధన్యుఁడ. ఈతన్వి యింత నిద్రించియున్నది. ఏమపాయము కలుగునోయని భీతిల్లియుంటిని. ఆపద్బాంధవుఁడగు వాసుదేవుని నమ్మి తదనుగ్రహమే యెల్లవేళలఁ గోరు భక్తులకు నేకీడుఁగలుగునే? అదిగో మెదలుచున్నది.

సంధ్యా—(మెల్లఁగలేచి కూర్చుండి) నాథా! ఎంతసేపైనది నీవువచ్చి?

రుక్మా—దేవీ! కొంతసేపైనది. ఇప్పుఁడు కొంచము లఘువుగా నున్నదియా?

సంధ్యా—ఇప్పుడేమియు నున్నట్టులేదు. ఈ నిద్రవలన బాధయంతయుఁ దీసిపోయి నట్లున్నది.

రుక్మా—తరుణీ! భగవద్భక్తులమగు మనకు నెన్నటికిని జేటుగలుగదు. నేను మిక్కిలి బెగడుపడియుంటి. పూర్ణ గర్భభారము ధరించియున్న నీ వవశ్య కరణీయమగు చతుర్భక్తి వర్జైకాదశీ వ్రతము నాచరించియుండుటచే నించుక యాయాసమునకుఁ గారణమయ్యె. వైద్యుని ప్రభావమున మొన్నటినుండి క్రమక్రమముగా నీకారోగ్య స్థితికన్నుఖమయ్యె. నేఁడు నిద్రయువచ్చె. ఇంకేమియు భీతియులేదు. తరుణీ! మొన్న నీవు మాటలాడిన మాటలు తలఁచుకొన్న నిప్పటికిని నాకన్నులకు నీరు వచ్చుచున్నది.

సంధ్యా—నాథా! నేను బ్రతుకుదునని నిక్కముగా నమ్మియుండలేదుకదా? కావున నాతీరున మాటలాడితి.

రుక్మా—రమణీ! సంతానములేక యన్ని దేవతలఁ గొలిచి తత్ప్రార్థన ఫలముగ నీవాపన్న సత్వవై యుండినందున నీడులేని సంతోషము వహించి నాకెన్నఁడు కుమారుఁడు కలుగునని మితిమీఱిన కాంక్ష నెదురు చూచుచున్న నాకు నీయాయాసముగాంచిన

లోకమే మునిఁగినట్లుండెఁ. ఇప్పుడింత దైవానుగ్రహము గలిగినందున నాఁటకుఁ గారణమయ్యె. మనోహారిణీ! వింధ్యాద్రిలోనున్న మనయిలువేల్పగు చంద్రమౌళీశ్వరునకు నయుత కుంభాభిషేక మొనర్చెదనని మ్రొక్కుకొంటిని. ఆమహాత్ముని ప్రభావమువలననే నీకునిరామయత కలుగఁగలదు. ఎక్కువగ మాటలాడిన నీకాయాసమగును. నేనుపోయివత్తును మనకింత సమ్మదము గల్గించిన యీశ్వరు నుపాసింతము.

సీ. కదలిపాఱనితేరు వదలిపాఱనిపేరు
జరుపఁగా మెఱుపఁగా నెఱుఁగరేని
సాన వెట్టనియమ్ము మేనఁబుట్టినసొమ్ము
పట్టఁగాఁ బెట్టఁగాఁ బుట్టరేని
కంతుగందపుఁబూఁత వింతచందపుమేఁత
పూయఁగా మేయఁగా డాయరేని
మింటఁబుట్టినధార ముంటఁగుట్టనిచీర
తలయందు మొలయందుఁ దాల్పరేని

గీ. మెఱుపువిల్లు విలాసంబు నెఱపువిల్లు
గలుగ నుతి కెక్కరేని నాకరము లెత్తి
మ్రొక్కనటువంటి దేవసమూహములకుఁ
గ్లేశభవభంగ యిష్టకామేశలింగ.

(నిష్క్రమించును).

తృతీయాఙ్కము-ద్వితీయరంగము.

———0———

అమరావతిలో మేనకయిల్లు.

[ప్ర: రంభ-మేనక-ఊర్వశి-తిలోత్తమ-హారిణి-హేమ-వరూధిని-మోహిని.]

ఊర్వశి—బ్రహ్మపైఁ బెట్టుకొనిన యాశనిల్లుయు నిన్న నే తీఱెఁగదా? ఇంకేమి చేయుదము.

రంభ—ఏము చేయుటకు నేమియుఁ దోఁచకున్నది. ఆరుక్మాంగదుఁడు చచ్చువఱకు మన బాధ యిట్లె యుండఁగలదని నే నెంచుచున్నాను.

ఊర్వశి—చచ్చినపిదపమాత్ర మతఁడు విత్తిన యీ వ్రతబీజము పెరిగి వృక్షముగాక నిలుచునా? ఎప్పటికి మన కిదేగతియని యెంచవలయును.

మేనక—అట్లేలగును. రుక్మాంగదుని యాజ్ఞకు భయపడి జనులు విధిలేక యీ వ్రతాచరణ మొనర్చుచున్నారు గాని, అతనిపిదప నెట్టి యాచరణముండఁజాలదని నే నమ్మెద.

తిలో—నాకు నట్లె తోఁచుచున్నది. నిన్న బ్రహ్మను సందర్శించినపుడు రుక్మాంగదుఁ డింకను నెన్నిదినములు మనియుండఁగలఁడో యదియైన విచారింపక పోయితిమి. అదిగో! అప్పుడే జీవయాత్ర మొదలుపెట్టినది. దేవసేవకుఁడు పిలువవచ్చుచున్నాఁడు హారిణీ! నీవుపొమ్ము.

(హారిణి-నిష్క్రమించును).

ప్రవేశము: [హరిభజన మొనర్చుచు నారదుఁడు.

(అందఱు నమస్కరించి పీఠమిత్తురు.)

మేనక—నారదా! నీయాగమనము మమ్ము ధన్యులఁగాఁ జేసె. ఎక్కడకుఁ బోవుచు వచ్చితిరి? మాయెడ మీకెంత యనుగ్రహము!

నారద—అప్సరోమణులారా! విమానారూఢుఁడనై యట్టె పోవుచుంటిని. మీరెల్ల నీ మేడపైఁ జేరియుండ నాకచ్చెరువు జనించి వచ్చితి.

మేనక—అచ్చెరువేల?

నారద—మీరొకరొకరొక్కొక్క లోకమును స్వాధీనమునం దుంచుకొనుటకు సమర్థులు. తపోనాశన మొనరింప వలయునన్న, నాకార్యమున మీ యహంపూర్విక యత్యద్భుతము. మీ రొకరితో నొకరు కలియువారుగారు. ఇట్లు కలసియుండ టచ్చెరువే గదా?

మేనక—ఆమాటకా! మాకేమియు నొకరియెడ నొకరికి స్పర్ధ లేదు. అసూయయు లేదు. నారదఋషీంద్రా! బ్రహ్మసభలో మేము మొఱపెట్టుకొన్న కాలమున, నీవునుంటివే. ఈ రుక్మాంగదుఁడు మాకెక్కడ దాఁపురమాయెనో? అతని యేకాదశీవ్రతము మాకు మారణ మంత్రముగానున్నది. బ్రహ్మయు మా బాధలఁ దీర్పఁ దనచేఁగాదని యొప్పఁజెప్పె. ఋషిచంద్రమా! నీవును మాఱట బ్రహ్మయేయగుదువు. దీని కేమైనఁ బ్రతిక్రియ దోఁచియున్న దయచేసి చెప్పరాదా?

నార—వనితామణులారా! మీకు నే నేమి చెప్పఁగలను? నాసంగతియు సమీపమునకు వచ్చునట్లున్నది. ఈలోపల విష్ణుదూతలు జీవములనూరేగించుకొని పోవునపుడు గొప్పవారి జీవాత్మలకు గంధర్వులు చాలక నన్నును దుంబురుని బిలువ సమకట్టియున్నారు ఎట్లో యీవఱకుఁ దప్పించుకొని యున్నాము.

మేనక—అట్లయిన వనితామణులారా! మనరూప ప్రభావమున నా రుక్మాంగదు నిర్జించి యీ యేకాదశీవ్రతము మాన్పింపవలయు. ఇదితప్ప నుపాయాంతర మెలేదు. నే నే పోయెదను.

ఊర్వశి—మేనకా! నీకేటికింత శ్రమ? నేఁబోయెదను.

తిలో—విశ్వామిత్రుఁడు మొదలగువారిఁబోలిన గొప్పవారైన మిమువంటివారికి శ్రమ యివ్వవలయు. ఈ రుక్మాంగదునంత వానికి మీ రేల? మే మెవ్వరైనఁ బోయెదము.

మోహిని—అక్కలారా! నా విన్నప మొక్కటికలదు. మీ రెల్ల జగత్ప్రసిద్ధిఁగాంచిన వారలు. రూపముననేమి, ప్రభావముననేమి, మిమ్ముఁ బ్రశంసింపనివారే కలుగరు. నేనన్ననో పేరుమాత్రము మోహినియని యున్నదిగాక, నా సమ్మోహన ప్రభావ మెవ్వరు వినియుండలేదు. ఈరుక్మాంగదునకు నేనచాలుదు. నన్నంపుఁడు. నేఁబోయి మీ కెల్లరకు ఖ్యాతిఁ దెచ్చెద.

మేనక—మోహినీ! నీవంతకుఁ జాలుదువనుటకు సందేహమేమి. ఏదీ! నీ చాతుర్యమైనఁ దిలకింతము. నీవేమి చేయుదువు? ఎట్లీకార్యము సాధింతువు? వచింపుము.

మోహినీ—వచింప వలసినదేమున్నది? నా మోహవాగురలలో రుక్మాంగదుఁ జిక్కించుకొని నే నాడించు నాట్లాడఁజేసి యీ వ్రతము మాన్పఁ బ్రయత్నించెద.

మేనక—చూడు మదికార్యము. ఇంకెక్కువగా నేమిచెప్పవలయు?

రంభ—సఖీ! మోహినీ! ఇదివఱకు దేవేంద్రుఁడు తపస్వులయెడకు మమ్ముఁ బంపుచుండుఁగదా? అతని కార్యముకొఱకు మేము ప్రయత్నించి యతులనెల్ల మాటు

కొలిపి దేవేంద్రునిచే మెప్పులు వడయుచుంటిమి. ఇప్పటిపనియన్న నట్లుకాదు. స్వంతకార్యము. రుక్మాంగదు జయించితిమా మన శ్రమలెల్లఁ బరిహారములగు. ఎంతనేర్పరిగాఁ గార్యము సాధించెదవో సుమా?

మోహినీ—అక్కా! అప్సరలలోఁబుట్టి యింతకార్యము సాధింపలేక మీకందఱికి నపకీర్తి తెచ్చెదనా? మీ రేమియు యోచింపకుఁడు. ఆరుక్మాంగదుఁడన్న నెంతవాఁడు. వాని ధూపార్తి నిటుగాఁ జేయఁజాలకున్న నేనొక యచ్చరనా?

నారద—రంభా! ఈ మోహిని తానన్నంతపట్టునుఁ జేయఁగలదియే. మిక్కిలి చాకచక్యమునుగలది. మోహినీ! ఎట్లయినఁజేసి నీ వీకార్యము సాధింపనేవలయు. నీవు మాకును నుపకారము చేసినదానవగుదువు.

మోహినీ—నారదా! నీ యాశీర్వాదమున్న నాకిది యెంతకార్యము?

మేనక—అదిగో పలువురు దేవసేవకులప్పుడే పఱువెత్తుచు వచ్చుచున్నారు. ఈ జీవాత్మల యబ్బగంటంతయు మాయొద్దఁ బూడిచి పెట్టినట్లు మమ్ము బాధించుచున్నారు. ఇంక మేము పోవలసియేయున్నది. మోహినీ! ఇక్కడికార్యములు మే మెట్లైనఁ జూచికొందుము. రుక్మాంగదు మఱల్పు కార్య భారమంతయు నీపైననే మోపియున్నారము. లెండు-చెలులారా! పోవుదము.

(మోహిని తప్ప నందఱు నిష్క్రమింతురు).

మోహిని—నేను ప్రఖ్యాతిఁజెందుట కిదిగదా సమయము! మొదట నతనియూరికి వేషాంతరమునఁబోయి యతని వృత్తాంతమంతయు నరసెద.

తే. గీ. రంభకును మేనకకును నూర్వశికి ధరణి
నెందు నెనలేని ప్రఖ్యాతి యొసఁగెఁగాదె
యూర రుక్మాంగదుని వ్రతం బడఁగఁజేసి
మోహిని యటన్న విఖ్యాతి నొనయుదాన.

పిదప నందులకుఁదగిన విధాన మాలోచించెద.

(నిష్క్రమించును).

తృతీయాఙ్కము-తృతీయరంగము.

———:0:———

విష్ణుదేవాలయము.

[ప్ర : మోహిని (పురుష వేషమున).]

మోహిని——ఏమి జనులు కలసియున్నారు? పదివేవు రుండవచ్చును. ఈదిన మేకాదశి యగుట జాగరమునకు రుక్మాంగదుఁడే వచ్చునట్లున్నది విష్ణుదేవాలయమునకు. కావున నింత జనసమ్మర్దము కలిగియున్నది. ఆహా! రుక్మాంగదుఁ డే మీ వేషమున వచ్చుచున్నాఁడు? జాగరము నాఁడిట్లనే కాఁబోలు. అదియేమి హరికథా కాలక్షేపమున కుద్యమించినట్లున్నది. ఔరా! తెలిసె. ఈ రాజేంద్రుఁడు జాగరమునాఁడు తానే హరికథచెప్పుటయుఁ గలదని తోఁచెడు. ఇది యాశ్చర్యకరమైన విషయమే? చూచెదఁగాక యెట్టివేడుక జరుగఁగలదో? (ప్రక్కనఁ గూర్చుండును).

(వెనుక యవనికనెత్తఁగా- మృదంగాది వాద్యములవెంట రుక్మాంగదుఁడు హరికథోద్దేశమున గాన మొనర్చుచుండును. జనములునుందురు. రుక్మాంగదుఁడు హరికథా కాలక్షేప విధానముగా నుపన్యసించును. పిదప ముందటి యవనికపడును).

మోహిని——(ముందటికివచ్చి) ఆహా! ఏమి యీ రాజేంద్రుని విష్ణుభక్తియు గానవైశద్యమును, నద్భుతముగా నున్నవియే! తానే యిట్లుపన్యసించుచు జనులకెల్ల ముక్తిమార్గము గఱపుచుండ జనుల యాత్మలు వైకుంఠమున కరుగుటయరుదా? ఈ రాజేంద్రవరేణ్యుఁజూడ నేను పైవేసికొనియున్న కుహక మోహామంతయుఁదీటి నిక్కంపు మోహ ముప్పతిల్లుచున్నది. అయినను జూచెద. ఈరాజు నెట్లు మరులుకొలుపవలయునో యావిధానమే తోఁచకున్నది. అతనియింటికి నేనేపోయి కనిపించుకొంటినా, పలుచఁదనమునకుఁ గారణమగు. ఇంకెట్లు చేయవలయు? ఆరాజు నను జూచు విధానమైననెయ్యది? ఇతనికిగానమునందు మిక్కిలి ప్రీతియగుటచే గానమూలముననే యితనిమనసు గరఁగింపవలయు. దైవభక్తి మెండగుటచే నేనును నెక్కువుగా దైవభక్తి గలిగియున్నట్లు నటించి మదికెక్కవలయు.

ప్ర: (మాటలాడుకొనుచు) నిరువురు పౌరులు.

1. పౌర——ఓరీ రాజుగారు మాత్రమే వెడలుదురఁట అమ్మగారు పోవర్లఁట. వినలేదా?

మోహిని——(స్వగతము) రాజుగారెక్కడకుఁ బోవుదురు. అమ్మగారేలపోరు?

2. పౌర — అమ్మగారును బోయియుండిన మాకేకాక మనయీఁడువాండ్రకును సహితము వాయనములు లభించుచుండెను.

1 పౌర — ఒక్కొక్క ఘటమున కొక్కమాడవంతున దక్షిణలిచ్చెదరు వినలేదా?

2. పౌర — తెలియును లెమ్ము. నేఁడు క్రొత్తగఁ జూచెదమా? ఎప్పటికి నిట్లేకదా?

(మోహిని ముందఱికివచ్చి).

మోహిని — బ్రాహ్మణోత్తములారా! రాజుగారెక్కడకుఁ బోయెదరు? ఎప్పుడు పోయెదరు?

1. పౌర — నీది యేయూరు?

మోహిని — నేను పరస్థలమునుండి వచ్చియున్నవాఁడను.

1. పౌర — ఎంత పరస్థలమైనను మాఘమాసములో శివరాత్రి వచ్చుచుండఁగా, మారాజుగారు విన్ధ్యాచల ప్రాంతమునఁ జంద్రమౌళీశ్వరుని కయుత ఘటాభిషేకము చేయించుమాట తెలియదన్న నేమనవలయు.

మోహిని — ఔనయ్యా! నేను దూరదేశమునకుఁ బోయియుంటిని గాన వినలేదు. శివరాత్రి మూఁడుదినములుమాత్రమున్నదే. ఇంకెప్పుడు వెడలెదరు.

1. పౌర — మారాష్ట్రములోనుండి యీ వృత్తాంతము తెలియదన్న నీ వెవరవో? నీతో మాకేమిమాటలు పొమ్ము.

(పౌరులు నిష్క్రమింతురు).

మోహిని — ఇంతమాత్రము తెలియవచ్చెఁగదా? నేను మున్ముందుగా నక్కడకే పోవుదును. (నిష్క్రమించును).

—: తృతీయాఙ్కము సమాప్తము. :—

శ్రీ

మోహినీ రుక్మాంగద నాటకము.

——:o:——

చతుర్థాఙ్కము-ప్రథమరంగము.

——o——

వింధ్యపర్వతములోని యిష్టకామేశ్వరాలయము.

[ప్ర: మోహిని.]

మోహిని—మొన్ననే చతుర్దశి. అయుత కుంభాభిషేక మీ స్వామికి జరిగినది. పూజా విధానములన్నియు ముగిసినవఁట. ఈనాఁటివఱకు నాకారాజేంద్రుని జూచుటకావ్వ దము కాలేదు. నేఁడీ స్వామియొద్దకు నా మహీశుఁ డేకాంత సేవకు వచ్చునఁట. ఇప్పుడు తప్పిన నింక సంవత్సరమువఱకు సమయ మొదవదు. సంగీతకళానిధియు, భాగవత శిఖామణియు, ధర్మమార్గ ప్రవర్తనాపారీణుఁడునునైన యీ రుక్మాంగ దుపై నాకేల యింత భక్తిపూర్వకమైన మోహము సంభవించినది! కపటమోహము పూని నాలుగుదినములు కార్యము చూచుకొని వ్రతభంగ మొనర్చిపోవ నుద్దేశించి యున్న నాకు నిటు నిక్కంపుమోహమున్న నే నేమి కార్యము చేయఁగలను?

(లోపల రుక్మాంగదునిధ్వని "మీరక్కడనే యుండుఁడు".)

మోహిని—అదిగో! వచ్చుచున్నాఁడు. ఇంక నా కార్యమునకుఁ బ్రారంభింతును.

(అని వీణ పెట్టుకొని).

సీ. అంభోజభవ సురేంద్రార్చితచరణాయ
మరణదూరాయ నమశ్శివాయ
పద్మాప్తకోటిప్రభా దివ్యదేహాయ
మథుసంహరాయ నమశ్శివాయ
డమరుత్రిశూల ఖడ్గ కపాలహస్తాయ
మథితదోషాయ నమశ్శివాయ
గగనకల్లోలినీకలి తోత్తమాంగాయ
మౌళిచంద్రాయ నమశ్శివాయ

తే. గీ. మౌనిసంసేవితాయ నమశ్శివాయ
మదనదర్పహరాయ నమశ్శివాయ
మధువిరోధిశరాయ నమశ్శివాయ
మంత్రరూపాత్మకాయ నమశ్శివాయ.

ప్ర॥ రుక్మాంగదుఁడు (దూరమున).

రుక్మాంగ—(గానము నాలకించి) ఏ మీ గానచాతుర్యము! ఇట్టికాలమున, నెవ్వరీ యుమేశపూజకు వచ్చియున్నారు? ప్రత్యక్షముగాఁ గోకిలయే గానము నేర్చి పాడుచున్నట్లున్నదే! ఇంకింత విందును.

మోహిని—

కం॥ శూలిన్ గపాలమస్తక
మాలిన్ నయశాలిఁ జంద్రమౌళిన్ గ్రతుని
ర్మూలిన్ సుగుణాలిన్ శుభ
శీలిన్ సారంగచర్మచేలిన్ గొలుతున్.

రుక్మాం—ఆహా! వీనులవిందై యీగాన మింతానంద మొనగూర్చునే! వానికిఁబోయి యెవరో తిలకింతునా? పూజాభంగ మొనర్చితినని యీనారికిఁ గోపము గలుగునో?

మోహి—సీ. నీటఁదేలుశరంబు పాటసోలురసంబు
ధరియింపభరియింపఁ దలఁపఁడేని
ఉబ్బపాతెడియాలు బెబ్బులిబలుతోలు
జడలందునోడలందుఁ బడయఁడేని
యుగముగాల్చినచేఁదు జగముగెల్చినజోదుఁ
గడిసేయఁబొడిసేయఁ గలుగఁడేని
అలివేణివలిచంట వెలలేనివలియింట
నుండఁగాఁబండఁగా నోపఁడేని

గీ. ఈడువత్తురె మీసాటి కితరమూర్తు
లవనిమండలి దేవవేశ్యాభుజంగ
త్రిపురసంత్రాస జాహ్నవీతీరవాస
క్లేశభవభంగ యిష్టకామేశలింగ.

రుక్మాంగ — ఆహా! ఏమి యీస్వరవైఖరి! ఎందెందును నేను వినియుండలేదుగదా. పూజాభంగమైననుమానె. ఇంకేమైననుమానె. పోయి చూచివత్తును. (మెల్లఁగా లోనికిఁబోయి మోహినినిజూచి, దిగ్భ్రమము నభినయించి యొక్కింతసేపుండి వెలుపలికివచ్చి). అహా! ఎవ్వతీతరుణీలలామ! శచియో! రతియో! ఎవ్వరో యెఱుఁగఁ గదా? ఇది యేరాకన్నియయో యప్సరసయో యయుండవలయు. కాకున్న నేను చూచినవెంటనే నాకీతరుణిపై నింతవ్యామోహము పుట్టునా? ఇక్కడ నేనుండి యీలలన పూజావిధానమైన పిదప నిక్కడకువచ్చినా యెట్లయినఁ జేసి మాటలాడించి చూచెద.

సీ. కందుచెందనిసుధాకరపూర్ణబింబంబు
మెఱసిపాఱకయున్న మెఱుపుఁదీఁగె
పంకంబునందుఁ గీడ్పడనిమృణాళముల్
కవవిచ్చిచననిజక్కవయుగంబు
వికసించిమొగడనివిమలాంబుజాతముల్
కర్కశంబులుగానికరికరములు
చిలుకముక్కంటనివలఁతిబింబఫలంబు
తతకాంతిఁబాయనిదర్పణములు
గీ. అనఁగ నాననంబు నంగంబు హస్తముల్
చన్నుదోయి వాలుగన్ను లూరు
లలఁతిమోవి చెక్కు లలరు నియ్యరవింద
గంధి యెచటనుండు కాంతయగునొ.

ఆతరుణి యచ్చరవెలఁదియైయున్నఁ బూజావిధానమైన పిదప నట్టే యంతర్ధానముఁ జెందిన గతియేమి? లోనికిఁబోయి యిప్పుడే మాటలాడించెద. యేల భయపడవలయు! (లోనికిఁబోవ నుద్యమించి) వలదు. వలదు. అది దుడుకుతనమగు. దేవాలయమున దైవధ్యాన మొనర్చుచున్న యాతరుణీమణి యెవ్వరైనది యెఱుఁగక ప్రార్థనాభంగ మొనర్చి మాటలాడించుట పాడిగాదు. ఈ యెడ నేయుండి తిలకించుచుండెద. ప్రార్థన నిలిపెనా పోయి ప్రశ్నమొనర్చెద. ఇంతలో నంతర్ధానమయ్యెనా దినదినము నిందేయుండి యెన్ని యేండ్లయినను మానక యాతరుణి మఱల సందర్శన మిచ్చువఱకు మానకుండెద.

మోహి.—సీ. గంగానదీజూట కైరవాప్తకిరీట
శమనకవాట పశ్యల్లలాట
వ్యాఘ్రాసురాఖేట వనజాసనకరోట
విబుధపర్వతకూట వేదఘోట
మృత్యువక్త్రచపేట మిహిరపాదాశాట
జితకాలకూట యానతవిరాట
దూరీకృతారాట త్రుటితకుంభినిశాట
వరభక్తసంఘాట వజ్రఖేట

గీ. వాఙ్నిరాఘాట దురితపావకకృపీట
ఘనభుజాస్ఫోట భూమిపంకజవరాట
తాపసస్తోత్రవాచాట దక్షఘాట
భీమశివలింగ హాటకస్తోమపోట.

(కొంచముూరకుండి) ఆహా! ఆ ధరణీశవరుఁడు నన్ను దిలకించి యట్టే వెలికిఁబోయెను. మరల రాఁడయ్యె. ఏమికారణమో? నేనేపోయి దర్శించుకొందు. (వెలుపలికి రాఁ బ్రయత్నింప)

రుక్మా.—(స్వగతము) ఆహా! గానము నిలిపినట్లయ్యె. ఇంకఁబోయి విచారింతును. (లోపలికివచ్చును).

మోహి.—ఎవరుమీరు?

రుక్మా.—తరుణీ! నేను రుక్మాంగదుఁ డనుపేరఁబరఁగు ధరావిభుఁడ. ఎండిన చెట్టైనను జిగిరించి యెలర్చురీతి మనోహరగానమున నీయుమానాథు స్తుతించుచు దిక్కులనెల్ల మిఱుమిట్లు నించుతేజమున విలసిల్లు నీవెవ్వరవు? (స్వగతము) హృదయమా! సంభ్రమింపకుము. అయ్యో! ఈ తరుణీమణి తానెవ్వరని చెప్పుచు నున్నదోగదా?

మోహి.—రాజేంద్రా! నే నెవ్వరైనదియు నెఱిఁగి కార్యమేమి? జనసంచారములేని యీ శైలభూమి భాసిల్లు నీయిష్టకామేశుపూజకే తెంచియున్నదాన నిక్కడను జనసంచారముండు భంగి యెఱిఁగితి. రాజేంద్రా! నీ విక్కడ కేలవచ్చితివి?

రుక్మా.—కామినీ! నేను నేఁడు క్రొత్తగా వచ్చినవాఁడనుగాను. ఇప్పుడు బహుదినములనుండి ప్రతి యయిదు సంవత్సరముల కొకసారి శివరాత్రినాఁ డీదేవునకు నయుత

ఘటాభిషేకమును జేయుచుండుటచే మొన్న శివరాత్రి యభిషేకమునకు శివదర్శన మున కేతెంచితి. భామామణీ! నీవు దేవవనితవేయగుదువు కాని యితరముకాదు. ఈయెడకు దేవత లెవ్వరును వచ్చినవారి సందర్శించి యెఱుఁగ. అనుగ్రహించి చెప్పుమా నీవెవ్వరవు? ఏల యిక్కడకు వచ్చితివి?

మోహి—రాజచంద్రా! నేను మోహిని యను పేరఁబరఁగు నప్సరసను. నేనును దేవదర్శనమునకై—

రుక్మా—ఆహా! కాంతామణీ! నీవప్సరసవు కాకుండిన నొరులకు నిట్టి రూపవైభవ ముండునే? నీసందర్శనము లభించుటకు నెన్ని యజ్ఞములో యొనర్పవలయుఁగదా? నేనెంత ధన్యుఁడనైతిని. రమణీ! మనసున నున్న మాట నిక్కముగా వచింతునా? నిన్ను జూచినప్పటినుండియు నెనలేని వ్యామోహము నాకుఁగలిగె. నీవనుగ్రహింపకున్న నాజన్మమే నాకువలదని నిస్పృహ జనింపఁగలదు. అనుగ్రహించి నీ యాశ్లేష సుఖము నాకు నొసంగుదువా?

మోహి—(స్వగతము) ఒక్కింత వేడుక యొనర్చెద. (ప్రకాశము) రాజేంద్రా! ఇదియా పురుషులమాట? ఎన్నఁడును జూడక యాకస్మికముగఁ జూచినంతనే మోహించుచు, మోహించుటయే కాక మోహించితినని కొంకులేక వచించుచుఁ దారతమ్యము గణింపక యీతీరున సరసపు మాటలాడుట రాజధర్మమా?

రుక్మా—రమణీ! నీయాన నిక్కము వచించెద. నిన్ను మోహింపకుండుటకు నిన్ను దర్శించిన పురుషుల కెవ్వరికైన సాధ్యమగునా? నిన్నుఁ జూచినప్పుడే నాకు దిగ్భ్రమముగలిగి పరవశతప్రాప్తించె.

సీ. చక్రవాకులమించు సవతురాదనిపించు
వలిగుబ్బచనుదోయి చెలువుచూచి
నిండుచందురుకాంతి నిరసించునల్లంత
మొలకనవ్వులముద్దుమోముచూచి
యింద్రనీలపురంగు నెరపుసేయఁగడంగు
కుటిలకుంతలములకొమరుచూచి
మరుబాణములయేపు నెరపుసేయఁగనోపు
నిడువాలుగన్నుల కడిమిచూచి

గీ. పొలపుమీఱిన నెలవంక బొమలఁ జూచి
రమణఁ దళుకొత్తు బింబాధరంబుఁ జూచి
తలిరులను బోలు మృదుహస్తములను జూచి
వలవకుండంగ నెంతటివాఁడనబల.

నీ వెవ్వారి వనితవో! యెవ్వారి గృహిణివగుదువో యను సంశయము వొడమినందునఁ బాప భయమున మేనునఁ దొట్రుపాటు గలిగె. నీ వప్సరవై యుండఁగూడదా యని మిక్కిలి కోరితి. నీ వప్సరవేయై యుండుట నాభాగ్యమే కదా! పౌండరీకాది యజ్ఞములొనర్చినవారికిని ఘోరయుద్ధమున మరణము జెందినవారికిని గాక నిను బోలు నప్సరల సహవర్తనము లభింపదనుట నేని నెఱుఁగుదును. ఆయినను మదనుఁడు వాఁడి బాణములఁ దాడి కోర్వఁజాలక యీ ప్రార్థన మొనరించెద రమ్ము. నన్ను ధన్యుఁ జేయుము. నాకుఁగల యైశ్వర్యమునెల్ల నీ స్వత్వముగా నే భావించి నా కేళిక సానివి గమ్ము. రమణీ! నీవు తడసిన నేనోర్వ.

చ. మొకరపిసాళితుమ్మెదల మూఁకకును గందపుగాలి రాకకున్
మకరపతాకు ధాకకును మామిడిమోకకుఁ జంద్రు కాకకున్
బికముల వ్రేఁకకున్ సిరులఁ బేర్చిన యామనియుబ్బునికకున్
జకితమృగాక్షి యోర్వనికఁ జాలఁ గృపామతి నాదరింపుమా.

కుసుమ కోదండుఁడు మనసీఁడు. ఏదీ! నీ మనోహరాలింగనమిమ్ము.

మోహి.—రాజేంద్రా! ఇట్లొనర్చుటవలన నీ గౌరవమునకు హానికలుగదా? కన్నవారికై వీధి పిలిచినంత నే కలియఁగల కామిని యంచు దలంచితివా? ఊరకుండుము. నాకుఁ గోపము గల్గును. నా దారిని బోనిమ్ము.

రుక్మా.—మారనారాచములఁ దూలి కడగానని యాపదఁ బ్రాణములఁ ద్యజింపనున్న నన్ను నీయధరామృత పానమునఁ జేసి రక్షించుటకంటె నీ కింకొక దారిగలదా? కామినీ! నన్నుఁ దెగడకుము. అరగంటఁ జూడకుము. నిన్నే నమ్మియున్నాను. నీకంటె నితర మెఱుఁగను. నాకుఁ గలవన్నియు నీకే యర్పించెద.

మోహి.—ధరణీధవా! నన్నిట్లు బాధపెట్టసాగితివి. దేవలోకమున విచ్చలవిడిగాఁ దిరుగాడుచు దేవేంద్రు ననుగ్రహమునకుఁ బాత్రురాలనైయున్న నన్నుఁ బోలిన యచ్చరలు భూమికిదిగి నీ వెంత రాజవైనను నిన్నుఁ బోలిన యొక్కరి వశమున మెలఁగుట దగునా? ఏల నెఱవేఱని కోరికలు? నన్ను విడువుము. నీకు శుభమగును. పోయివచ్చెద.

రుక్మా—తరుణీజనావతంసమా! నీకిట్టి నిర్దయయుండునే? నీవనుగ్రహింపకున్నఁ బ్రాణములు వాయుదునని చెప్పుమాట యతిశయోక్తిగాదు. ఔపచారికముగాదు. వాయాన నిక్కము. ఏల నన్ను నిరాదరణ మొనర్చి పోవనెంచెదవు.

అనుబంధము 11.

నిన్ను నమ్మిన యొకప్రాణిని ప్రాణాపాయమువలనఁ దప్పించుటకు నింత యుపేక్షయా? నీ చరణములంటి వేఁడెదను. నినుమానను.

మోహి—ఆహా! రాజన్యా! ఇదియేమి నీయపేక్ష. దేవవనితనైన నేను నీతోఁ నెట్లు మెలఁగనేర్తు. అంతఃపురమున నెందఱో నీకుఁ దరుణులున్నవారే వారి కనుచర భావమున నేనెట్లుండనేర్తు. ఇది కానిపని. నీకుఁ దెలియదా? ఊరక దేవదర్శన మొనర్చి నీదారిఁబొమ్ము.

రుక్మా—రమణీమణీ! నీవె నన్నింత కటాక్షించితివా! నాయువతులఁ బుత్రుని నా సర్వస్వమును నీయాధీన మొనర్చువాఁడ. నీమాట జవదాటక మెలఁగువాఁడ..

మోహి—రాజేంద్రా! మోహమునఁ గన్నుగానక కార్యసాధనమునకై యేమేమో వచియింపవచ్చుఁగాని యనియన్నియు జరుపుటకగునా? నీవపేక్షించినది క్షణిక సౌఖ్యము. అది లభించినవెంటనే యభిలాషలన్నియుఁ గడముట్టఁబోవు. తరువాత నొకవిధమగు మోహముండఁగలదా? ఏల తెలియనిభంగి మాటలాడెదవు. అన్ని మాటలంతయు నీకు జరుపుటకు సాధ్యమగునా?

రుక్మా—కామినీ! నాసదుద్దేశము సంశయించిన మాటలాడి నీవు నాకెంతయుఁ దప్పొనర్చితివి. అదే! అంగన్న యిష్టకామేశు పాదపద్మములాన వచించెద. నీమాట నేజవదాటువాఁడఁగాను. ఏల నన్నింత పరీక్షించెదవు? నను నీకృపకుఁ బాత్రునిగాఁ జేయుమా?

మోహి—ధరణీవరా! నీకెందఱో తరుణులుందురే? పుత్రుఁడును నున్నవాఁడని నీవాడిన మాటవలనఁ దెలిసె. నీదారలతోఁగల యుపభోగము చాలదా? చూచిన వారి నెల్లను రూపవతైన మాత్రముననే యేమి? ఇటు కలయఁగోరుట ధర్మమా? ఈ యాచరణము నీభార్యలు సమ్మతింతురే? నీకుసుఖమా? నాకుసుఖమా? వదలుము నీకోరిక.

రుక్మా—మోహినీ! నాభార్యలెల్ల నేఁగోరినవెంటనే నీకుఁ జరణదాసులుగా నుండుటకు నామోదింపఁ గలరు. నాపుత్రుఁడు నీపుత్రుఁడేయగుఁగదా? ఇంకేల నీవిషమ పరీక్ష? ఎట్లును నను కృతార్థుఁజేయక నీకుఁ దప్పదు. అపరమేశునాన వచించెదను. నిన్నుమానిన వనితాంతరప్రసక్తి నే నిచ్చయింపను.

మోహి—పరమేశా! ఇష్టకామేశా! నినుదర్శించి పూజయొనరింప వచ్చియున్న నాకు నెట్టి తగులము ఘటించితివి?

రుక్మాం—వనితామణీ! ఇంకఁ దామసింపకుము. నన్ననుగ్రహింపుము. పూర్ణాభిలాష వశమున వాంఛించిన నీకౌఁగిలి దయచేయుము.

మోహి—అయిన నీవు నన్ను విడువవు?

రుక్మాం—నిన్ను విడుచుటకా యింతసేపునుండి నేనిట్లు ప్రార్థించుట?

మోహి—రాజచంద్రా! అప్సరసలగు మాకు మానవసహవాసము నూతనము కాదు అయిన నన్ను నీవు గారవించినన్ని నాళ్లును వనితాంతర ప్రసక్తి నీవు మానెదవనియు నాయాజ్ఞ నీవుండఁగలవాఁడనియు నీవు నమ్మకమగు ప్రమాణ మొసంగితివా నేను నీమాటకు సమ్మతింతును.

రుక్మా—(మోహిని చేతులుబట్టుకొని) రమణీ! నన్ను గృతార్థుఁజేసితివి. నను ధన్యుఁజేసితివి. నీ వేరీతిఁ బ్రమాణముచేయుమన్నను జేయుదును. నాపుత్త్రునాన వచించెదను అదే! ఆలయమునను్న యిష్టకామేశునాన బాసఁజేయువాఁడ. నీవు నన్ననుగ్రహించినన్ని వాళ్లు పెఱవనితలఁ గాంక్షింప నీవేమిమాటచెప్పినను నించుకంతైన జవదాఁటక జరుపువాఁడ. ఇంకనైనను నన్ను నమ్మితివా? నీయాలింగనము నేయార్జించితినని యెంచవచ్చునా? (ఆలింగనము చేసికొనఁబోవ).

మోహి—(తప్పించుకొని దూరముపోయి) నిలు మింత త్వరయేల? నీవు ప్రమాణ వాక్యము నాయిష్టకామేశునొద్దనే వచియింపుము. పిదప నూరికిఁబోయి నీవచనముల కన్నిటికి నా మోదించితినని నీపట్టమహిషి యెవ్వరో యామెతోడను నీపుత్త్రవతియగు నీకాంతతోడను బలికింపుము. పిదప నీయిష్టానువర్తనమున నేనుందుదాన.

రుక్మా—రమణీ! సమధిక వ్యామోహమునఁ దల్లడిల్లుచున్న నీ నేమి పరీక్షచేసినను నెట్టి ప్రమాణము గోరినను సమ్మతించువాఁడనే. అయిన మఱల నూరికిఁబోయి పుత్త్రవతి యగు నాయగ్రమహిషి తోడను సమ్మతించినమాట పలికించునటుల నీయాలింగన మునకు నంతరాయము కల్పించితివే యిదెట్లు సహింతును.

అనుబంధము 12.

మోహి—నీవు నన్ను జూచి చూడకముందే యింత మోహపుమాటలాడితివి. నీ మోహము క్షణభంగురమగు నేమో యనుభీతిచే నీకింత వకాశమిచ్చితి. అదిగాక తత్కాలమున నుద్భవించిన యంధ మోహమున నీవు నను జేపట్టుట నీమహిషి కయిష్టమైన నప్పుడు మానదువ నీకెట్టి దుస్థితియు నెట్టి దుఃఖమును గలుగఁగలదో నీ వెఱుఁగ నేరవా? అది నీకు లేకుండఁజేయుటకును నీసమయము నభిలషించితి.

రుక్మాం—కానిమ్ము. నీయిచ్చచొప్పున నెఱవేర్చెద. ఎట్లును నీయిష్టానువర్తనమున మెలఁగనెంచియున్న నన్ను నీవెట్లేలుకొన్నను విహితమేకదా? పోదమురమ్ము స్వామి దర్శనమునకు. (లోనికిఁబోయి) మోహినీ! ఈశ్వరమేశు నెదుటఁ బ్రమాణము చేయుమన్న నీయపేక్ష నిర్వహించెదను.

మోహి—నాథా! నాకేమియుఁ బ్రమాణమువలదు. నీమాటకంటె నిదియొక యెక్కువయా? ఊరక నీమనసరయఁగోరి యడిగితిఁగాక. నీవు మాటయిచ్చి యుండినఁ జాలు.

రుక్మా—మనోహారిణీ! నీవెట్టి యుదార దయాగుణభూషణవు. నిన్ను జేపట్టుట నాకెంత ధన్యత. నీవు వలదన్న మానితిఁగాక నే నాడిన మాటకంటె నీయెడ నొనర్చు ప్రమాణము నాకెక్కువ యనుపించదు. చెప్పినది చెప్పియేయున్నాను. మనకింత సమ్మదమావహింపఁ జేసిన యీయుమామనోహర నిష్టకామేశు నుతింతము.

సీ. దంభోళిధరసతీ తాంబూలపేటీషు
దహనబింబాధరీస్తనభరేషు
శమనశుద్ధాంతయోషాఫాలభాగేషు
నిఋతిసాధ్వీముఖనీరజేషు
కంధినాయకబాలికాకర్ణపత్రేషు
గంధవహాంగనాకచభరేషు
రాజరాజాంతఃపురస్త్రీకరాగ్రేషు
కరకంఠభామినీకటితటేషు

గీ. చంద్రశకలంతి హారంతిచందనంతి
విశదహాసంతి క్షీరంతివిచికిలంతి
దర్పణంతి దుకూలంతి తవయశాంసి
క్లేశభవభంగ యిష్టకామేశలింగ.

సీ. కోటిమన్మథరూప హాటకాచలచాప
చటులబాహాటోప శరణుశరణు
శ్రుతిచతుష్టయఘోట శుభ్రగంగాజూట
జలజాసనకరోట శరణుశరణు
వ్యాఘ్రాసురధ్వంస వర్ణితమీమాంస
చంద్రఖండవతంస శరణుశరణు
భుజగేంద్రకేయూర భువనత్రయాధార
సద్భక్తమందార శరణుశరణు

గీ. సతతకరుణాఘనాపాంగ శరణు శరణు
సామజాసురమదభంగ శరణు శరణు
శైలకన్యామనస్సంగ శరణు శరణు
శరణువిశ్వేశశివలింగ శరణు శరణు.

మోహిని—(ముందటికివచ్చి స్వగతము) ఆహా! ఈరాజవరుపై నాకెంత మోహము జనించినది. ఈయనకుఁగల దైవభక్తియు స్తోత్రనైపుణ్యమును జూడఁ నవకాశము కలిగినంతనే నాయెడ మోహమెక్కడ తిరుగునో యను భీతి నాకు జనించుచున్నది. అట్లతఁడు ప్రీతి మఱలించిననే నెట్లోర్వఁగలదానను. ఏమిచేయుదును. (ప్రకాశము) రాజేంద్రా! ఏమేమో దీర్ఘాలోచన చేయునట్లున్నావు.

రుక్మాం—ఏమియులేదు. నావీనులకు చల్లఁగ నాథా! యని సంభోదించితివికాని నీకౌఁగిలి యైన నొక ముద్దయిన నాకీక మసలఁ జేసితివేయని చింతించుచుఁ దీఱని యభిలాష వశమున నిన్నడుగుదునా వలదాయని యోచించుకొను చుంటిని.

మోహి—కౌఁగిలికి ముద్దునకు మాత్రము నాథా! నన్నింత యాచింపవలయునా! నీ వపేక్షించిన కార్యమెల్ల నేనును నొనర్పవలసిన దాననేగదా?

రుక్మాం—అట్లయిననే ధన్యుఁడ. కడుధన్యుఁడ. (అని యాలింగనముచేసి ముద్దిడును.)

(యవనికపడును.)

చతుర్థాంకము-ద్వితీయరంగము.

---o---

రుక్మాంగదునంతఃపురము.

[ప్ర: కోమల-చంద్రకాంత (రుక్మాంగదుని భార్యలు.)

చంద్ర—కోమలా! ఇంక మనమెట్లు సహింపవలయును? ఎంత వేఁడికొన్నను రాజన్యుఁడు తిరుగువాఁడా? ఆ కాంతను మరులుగొని ఘోరప్రమాణ మొనర్చియున్నాఁడు దీనికేమి చేయుదము?

కోమల—చంద్రకాంతా! దీని నూరక యిట్లే పోవనిచ్చిన బ్రతికినన్నాళ్లు మనకు దుఃఖము గలదే! రాజునకు భోగినులెందఱో యుందురుగాక యెవ్వతెయైనను నితరుఁ గలియఁగూడదని ప్రమాణము చేయించుకొనునే? దేవతలలోని వెలయాలగు నా కామిని కిట్టి సాహస మొదవెఁగాక.

చంద్ర—కోమలా! మనమిప్పుడు మనోదార్ఢ్యముఁ జూపకున్న మనకార్యమంతయుఁ జెడిపోవు. మనమెల్ల విజృంభించిన మమ్ము మాత్రము మీఱఁగలవాఁడా యా రాజేంద్రుఁడు? తుదకామోహినియే భీతిఁజెంది కళవళించి పరువెత్తునట్లు చేయఁజాలమా?

కోమల—చంద్రకాంతా! మనమెల్ల నీరాజేంద్రు నగ్రమహిషియగు సంధ్యావళిని మున్నిడుకొని ప్రయత్న మొనర్చితిమా కార్యసాధనము కాఁగలదు. ఆయమ యేమిచెప్పునో యరయుదము. అదే యీ యంతఃపురమున నయ్యేడ నే యా యమ కనుపించుచున్నది. పోయి విచారింతమురమ్ము. (అని యిరువురును రంగము ముందటికి వచ్చెదరు).

[ప్ర: సంధ్యావళి.]

చంద్ర / కోమ — అక్కా! సేవించెదము (నమస్కరింతురు)

సంధ్యా—(వారినిరువురిని నాలింగనముఁ జేసికొని) చెల్లియలారా! సుఖమున్నారా?

కోమల—అయ్యో! ఎట్లు సుఖము జనింపఁగలదు?

సంధ్యా—ఏల యిట్లాడెదరు?

చంద్ర—అక్కా! ఏమియు వినలేదా? మననాథుఁడు నీయొద్ద కింకనురాలేదా? వృత్తాంత మేమియు వినలేదా?

సంధ్యా—ఏమి? ఏమి? నాథుని కేమైన నాపదగలిగెనా? సుఖముగ నున్నాఁడని యింతవఱకుముందు వింటినే!

చంద్ర—అక్కా! అట్లయిన నీవెఱుఁగవు. సవిస్తరముగా వివరించెద. మననాథుఁడిష్ట కామేశు సేవకుఁబోయియున్న కాలమున మోహినియను నప్సరసను దిలకించెనఁట, మోహించెనఁట. ఆటాఁగ తన్నుమానిన వనితాంతర ప్రసంగము విభునకుఁగలుగరాదనియుఁ, దనమాట నెన్నఁడును జవదాఁటరాదనియుఁ, విభునితోఁ బ్రమాణ మొనరించి, తన పాణిగ్రహణమునకు నీవు ముఖ్యము సమ్మతింప వలయుననియు, నీసమ్మతి వడసిన పిదపనే పాణిగ్రహణము గావింపవలయుననియు నింతనర్థము జరిపియున్నది. మా ప్రమాణములు మా భాగ్యమంతయు నిప్పుడు నీచేనున్నది. నీవు మాత్రము సమ్మతింపక పోతివా యా మోహిని చప్పనిముఖమున వచ్చినదారి వట్టుకొని యూరేగిపోవఁగలదు. దృఢమానసమున నీవీకార్య మొనర్పవలయునని నీ చరణములపైఁబడి వేఁడువారము. (ఇరువురు నమస్కరింతురు).

సంధ్యా—ఎవ్వరుచెప్పిరి మీకింత వృత్తాంతము?

చంద్ర—ఒకరని చెప్పఁదునా? ఊరంతయు నీగజిబిజి నిండినది. నా దాసివలన నీ వృత్తాంతమంతయు నేనెఱింగితి.

సంధ్యా—నిక్కమే యుండవచ్చు. మననాథుఁడూరికి మఱలివచ్చి రెండుదినములు కావచ్చినను, దన శుభదర్శనము నాకొసఁగకున్నాఁడు. బాలుని ధర్మాంగదు మాత్ర మింతకుముందుఁ బిలిపించుకొనియుండె. ఆబాలుఁడును నాయనగారితోఁ జెప్పఁగూడని చక్కఁదనముగల యొకకాంత వచ్చియున్నదనియు నాయమ నాకుఁ బినతల్లియని చెప్పిరనియు నాతోఁజెప్పె. నాయొద్దకు సంకోచము తోడనే రాకున్నాఁడని యిప్పుడు తోఁచుచున్నది.

చంద్ర—అక్కా! చెప్పితిమే అంతయు నీచేతనున్నది. నేఁడో-రేపో నాథుఁడు నీసమ్మతి యడుగ రావచ్చును. నీవుమాత్రమీయకుండుము.

సంధ్యా—చెలులారా! మీకేమజ్ఞాన మిట్టిమాటలాడెదరు? నాథుఁ డపేక్షించిన కోరిక జరుపుటకంటె సతికింకొక్క పనిగలదా? అతఁడాజ్ఞయిడిన భంగి జరుప కున్న నది పాతివ్రత్యమునకే భంగము గలిగించుఁగదా? యోచింపుఁడు మీరు చెప్పి నట్లొనర్చుట కానిపని. అవశ్యము నా సమ్మతి యొసఁగెద.

కోమల—అయ్యో! సోదరీ! ఎవతెయేకాని తాను విభునకు మెచ్చులాఁడియైనఁ గావలసిన సొమ్ములు, వేఱభిలాషములన్నియుఁ గలిగించుకొనవచ్చుఁగాని విభుని శరీరమునకుఁదన కంటె హెచ్చగు స్వాతంత్ర్యము గల యితని భార్యల యొద్దకుఁ బోవరాదని ప్రమాణము చేయించుకొనునే. అదియొక్క సతియా? దానియెడఁ గృపఁజూపవచ్చునా?

పతివ్రతయగు భామిని యిట్టి ఘోర ప్రమాణముఁ గోరునే? కన్నవారిఁ గలయు వేశ్య యగుటచేఁగదా! అదింత సాహసమున కుద్యమించినది.

సంధ్యా—చెలులారా! మీ రెల్లఁ దప్పక పొరబడితిరి. మన నాథుని మోహము నా కర్షించె నేయని యాకాంత యెడఁగలిగిన యీర్ష్యచే నిట్లాడెదరుగాక యొక్కించుక యుక్తాయుక్తములఁ బరిశీలించితిరా మీకుఁ బశ్చాత్తాపబుద్ధి కలుగకపోదు. ఆ తన్వి ప్రమాణము కోరినది యెట్లుండినను మననాథుఁడు ప్రమాణము నిచ్చినదిగదా ముఖ్యము. నాసమ్మతి యిప్పించెదనని విభుఁ డెంతగా ప్రీతితో నిచ్చినమాట తప్పఁజేయ నగునా? నాపై నెంత ప్రీతియో నాయెడ నెంత విశ్వాసమో యుండకున్న నాథుఁ డామాటఁ జెప్పియుండునా? ఆ విశ్వాసమునకు నేనై భంగము దెచ్చుకొందునా? అది యటుండనిండు. ఏవేళయందుఁగాని యెట్టికార్యము పట్లఁగాని నాథుఁ డేమభిలషించినను నామాట నడపుట పతివ్రతయగు మానినికిఁ దీఱరానిపని. అందునకుఁ దప్పి పాతివ్రత్యమునకు భంగముఁ దెచ్చుకొందునా? నాచేతఁగాదు. నా పరిహారణమునకు నే నవశ్యము సమ్మతించెద. మీ రింకొండాడకుఁడు.

కోమల—అక్కా! నీ వేమో మాటలాడెదవుగాని, విశ్వాస భంగము గాని పాతివ్రత్య భంగముగాని దీనివలన నెట్లు సిద్ధించును? నీవుసమ్మతిమాట యిచ్చుటకును నీయకుండుటకును స్వాతంత్ర్యము నీకు లేదా? అట్టిచో నేను సమ్మతింపనని చెప్పిన, నేమాత్రమును దోషము గలుగదు. నాథునిమాట జరుపలేకపోయిన దోషము సిద్ధించునని నీవాడ నెంచితివా? కానిమ్ము. ఆదోషము నీవు సమ్మతించుటవలన రాఁగల ఫలముతోఁ దలదూఁగఁజేయుము. ఏది యెక్కువగునో? ఆఫలము మహాఘోరము. నీయంతకు నీవై పతివియోగము ఘటించుకొని యంగలార్చుటొకటి. అట్టి వియోగము లభింప నున్నప్పుడు పతియుండియు లేనివాఁడే యగుఁగదా? అది వైధవ్యమున కంటె నికృష్ట స్థితియని నే నెంచెద. అది యటుండ నీతోఁగూడ నాథు యువతుల కంతయు వియోగము ఘటిల్లఁజేయుఫలము నీ వరయలేవైతివే? ఈదుర్విధి యెక్కువగునా? ద్రోహకాంక్షచే నొక్కవేశ్య యుపదేశించిన మాటపై యుక్తాయుక్తములరయక తత్పాణిగ్రహణ దుష్కార్యమునకు నీసమ్మతి యడుగవచ్చినప్పుడు వలదనుటవలనఁ గలిగెడు దోషమెక్కువగునా? అమ్మో! ఇంతరయ లేవే? అనుగ్రహించి మామాట పాటింపుము.

సంధ్యా—తరుణీమణులారా! మఱియొకమాట. మీరే యోచించుకొనుఁడు. పాతివ్రత్యమట్లుండుఁగాక యామోహినిపై నెంతయో తీఱరాని యభిలాష లేకున్న మననాథుఁ డట్టి ప్రమాణముఁ జేసియుండునా? నే సమ్మతి యొసంగని కారణమున నయ్యభిలాష తీఱకున్న నతని మన మెంత నొచ్చునో? అతని కెట్టి యాపద గలుగనో? అది

కొంచెము విచారింప వలయుఁగదా? నాథుని కష్టమైన నాపదగలిగిన మనమెవ్వరైన గాని భరింపఁగలమా?

అనుబంధము 14.

కోమల—అక్కా! నీవూరక లేనిభీతి తెచ్చిపెట్టుకొనియెదవు. ఏమో సమయ దోషమున మోహము పుట్టియుండ, నప్పటికి కేదో ప్రమాణ మొసంగెఁగాని యా మోహిని లభింపక పోయిన మనవిభుని కెట్టి యాపదలైన రాఁగారణములేమి? అది వెడలి పోయినంతనే యొకవేళ లేక రెండు దినములు కొంచెము మనోవిచారము కలుగవచ్చు నని యెంచుకొన్నను నచిరకాలముననే యదియంతయు మఱచిపోఁగలఁడు. ఇట్టిపనికి సాహసించి సామాన్య వేశ్య లభింపకపోయి నంతనే లోకము మునిఁగినట్లెంచునా?

సంధ్యా—అక్కలారా! మీ రించుక యోచించుకొనుఁడు. ఆ మోహిని సామాన్య వేశ్య యంటిరి. ఎంతపనికైన సాహసింపఁగలది యంటిరి. ఒకవేళ నాథుని మాటకు నేసమ్మతింపకున్న నా కాంత మనసు త్రిప్పి తన పాణిగ్రహణమునకు నా సమ్మతి లేదన్నను నొప్పికొని విభుని జెట్టపట్టుటకభ్యంతర మేమైన నున్నదా? అప్పుడు నే నెట్టిదాన నగుదు? విభునిమాట త్రోసివేయుటగాక విభుని మనసున వంత జనించు కార్య మొనర్చినదగుటగాక యింకెన్నఁడును విభుని ప్రేమవడయుట కర్హత లేని దాననగుదు. ఆ మోహిని నామనసరయఁగోరి నాసమ్మతియను నెపము గల్పించి యుండినను గల్పించి యుండవచ్చుఁగదా? దానికి నేనై చెడుతనము దెచ్చుకొందునా? మన నాథుఁ డొకవేళ యేకారణము లేకయే మమ్ముఁ గన్నెత్తి చూడక నిరాదరణ మొనర్చిన మన మేమొనర్పఁగలవారము? నే సమ్మతి యీకున్నఁ గారణములేని నిరాదరణమునకుఁ గారణ మొకటి కల్పించి యిచ్చినట్లగు. సమ్మతి యిచ్చిన పిదప నెప్పుడైన నా మోహినికే యనుగ్రహము గలిగి మఱల మనవిభుఁడు మమ్మాదరించుటకు నాస్పదము కలుగవచ్చును. కాని సమ్మతి యివ్వకున్న నా మోహిని కరుణించినను విభుని యనుగ్రహము వడయుట దుస్తరము. తరుణీమణులారా! యోచించుకొలఁది యూరక సమ్మతించుటకు నెన్నియో కారణములు కనపడుచున్నవి. చూచితిరా! నాథుఁ డిచ్చటికివచ్చి రెండుదినములయ్యుండియు నాసమ్మతి వడయుటకైన, ననుఁ జూడరాకున్నాఁడు. ఆమాట డుగుటకుఁ గొంకి కర్తవ్యము లేక యోచించునట్లున్నది. నాథునికిట్టి తొందఱపాటు కలిగించుట నాకుఁబాడియా? కాగితము లేఖినియుఁ నిండు (అని యక్కడనున్న కాగితమును లేఖినియు గ్రహించి జాబు వ్రాయును).

కోమల—అక్కా! ఏమి జాబువ్రాసితివి?

సంధ్యా—(జాబు చదువును).

"సీ. అనఘులౌరుక్మాంగదావనీశ్వరులకుఁ
దమముఖ్యదాసిసంధ్యావళిసతి
చరణంబులకుమ్రొక్కి సలుపువిజ్ఞప్తులు
ప్రాణేశమీరువింధ్యాద్రిసీమ
మోహినీకాంతను మోహించుటయు నామె
వనితాంతరాసక్తివదలుమనియు
దీనికినాసమ్మతినిబొందుమనియుఁబ్ర
మాణంబుగైకొన్నమాటవింటి

గీ. సంతసంబునిండెఁ జాలగౌరవమయ్యె
మీకుమదినిఁబ్రీతిమీఱనిదియె
లిఖితమూలమన్నలీలనాసమ్మతిఁ
బంపియున్నదానఁబ్రాణనాథ.

నాథా! ఇష్టకామేశు సన్నిధి నప్సరస్తరుణియగు మోహినీ కాంతకును నీకును గలిగిన సమయ నియమము నెల్ల వింటిని. ఆ కాంత నిన్నుఁ జేపట్టుటకు నాసమ్మతి యొక్క నియమముగాఁ గోరియున్నదని వింటి. ఈ యాచరణము నాకెంతయు గౌరవము గలిగించునందులకు సంతసించుచు నీవడుగుటకు ముందే నాసమ్మతి యనఁగా నా మోహినీ కాంతఁ దప్ప నీ యితరకాంతలతో సంసర్గ మొనరింపకుండుటకు నే నొప్పుకొందునను సమ్మతి నోటచెప్పుటకంటె వ్రాత మూలమున వచించుటయే యొప్పునని యీకమ్మ వ్రాసియున్నదాన.

నిరతము నిన్ను దైవముగా భజించు,
సంధ్యావళి."

చంద్రకాంతా! ఈకమ్మ యీక్షణమున నెవ్వరితోడనైన మన నాథు నొద్దకుఁ బంపుము.

చంద్ర—అక్కా! కొంచెము యోచించుకొనుము.

సంధ్యా—అటులైన నేనెవ్వరితోడనైనఁ బంపెదను.

చంద్ర—కోపగింపకుము. ఇట్లిమ్ము (జాబుతీసుకొని లోనికిఁబోవును).

కోమల—అక్కా! నీవొనరించినది యుక్తమనియే దీర్ఘాలోచన మొనర్చిన నాకుఁ దోఁచుచున్నది. ఇంకే కారణము కాకుండినను నీవు వచించిన తుద కారణము కలదు కదా యదియేమన్న మోహిని తరువాత నీసమ్మతి వలదని చెప్పఁగల కారణము. అది మిక్కిలి సమర్థమైనదని నాకుఁ దోఁచుచున్నది.

సంధ్యా—అంతకంటె ముఖ్యకారణము నాథునాజ్ఞ జరుపుటయే. చెలియా! పాతివ్రత్య ధర్మాచరణమున నెంతమేలు కలదు. సావిత్రిదేవి తన పాతివ్రత్య ప్రభావమున మృతపతిని బ్రతికించుకొనియె. ఇంక నంతకంటె నెక్కుడగు కార్యముకలదా?

పునః ప్రవేశము: చంద్రకాంత.

సంధ్యా—పంపితివా సఖియా! యాజాబును?

చంద్ర—అప్పుడే పంపితిని. నాథుఁడిందువచ్చునేమో యని నిరీక్షించుచు నింతవఱకు మసలితి.

సంధ్యా—నాథుఁడిం దేల వచ్చునను కొంటివి?

చంద్ర—వింధ్య ప్రాంతమునుండి మఱలివచ్చినపిదప నిన్నుఁ జూచుటకును, నీసమ్మతి వడయుటకును మొగములేక యింతవఱకు దిక్కుతోఁచక సంకోచించు నాతనికి నీవాజాబు పంపుట తూగియాడు వానికిఁ బలుపు వేసియిచ్చినట్లయ్యెఁగదా కాబట్టి పరుగెత్తివచ్చునను కొనుచుంటిని.

ప్ర: మోహిని (వెలుపటి ప్రక్కన జాబుచేపట్టి).

మోహిని—(స్వగతము) ఆహా! ఇదియేమి ఋణానుబంధము. నాకృత్రిమ మోహమంతయు యథార్థ మోహమై పరిణమించె. రుక్మాంగదు పట్టమహిషి సమ్మతిగోరియుంటిఁ గదా? అది యనుగుమనుటకే నాకు నోరెగయకుండె? నేనడిగివచ్చెదనని యా రాజేంద్రుఁడు పలుమాఱు చెప్పినను, నామె యొప్పదనియు నప్పుడు శంకరు సన్నిధానమున నొనర్చిన ప్రమాణమునకు భంగముకలిగిన నేనెక్కడ నతని మానిపోవలసి వచ్చునోయను భీతిచే నామనోహరు మంగళాంగ దర్శనమైన నిరంతరము నొనర్చుచుందునని వలదని యాఁపుచు వచ్చితి. ఇప్పుడట్లడుగుటకువుండే సంధ్యావళీదేవి యీజాబు పంపవలయునన్న నెంత మహోదారగుణము? ఎంత పారమార్థికము? ఎంత పరోపకార పరత? ఎంత యాత్మతిరస్కారము? ఇట్టి మహోదారతిలకను దర్శించుకొనవే వలయుఁగదా?

(లోపలివైపుఁజూచి)

ఏమంటివి దాసీ! అక్కడనే కూర్చుండియున్నారా? ఈమువ్వురిలో సంధ్యావళి యెవరు? ఓహో! అమధ్యయున్న యామెయా? మోముచూచిననే మహాత్మ్యము తెలియుఁగదా? (సమీపించి) సంధ్యావళీదేవీ!

సంధ్యా—(స్వ) ఆహా! ఎవ్వరీ తరుణీమణి. చూడ్కికి మిఱుమిట్లు గొలుపు తేజముఁ గలిగియున్నదే? ఈమె మానవవనిత యగునా? దేవవనితయగునా?

మోహి—అమ్మా! ఈజాబే నీమహోదారగుణమంతయు నాకుఁజాటిచెప్పె. మీనాథుఁడు నాయొద్దనుండిన కాలమున మీదాసి తెచ్చియిచ్చె. అతఁడు నాచేతికిచ్చె. చదివితి. నీపరోపకారపారీణత నెఱిఁగితి. నిన్ను దర్శించుకొను కుతూహలము వొడమి నాథుని యనుమతివడసి యేతెంచితి. నే మోహిని యను నచ్చర చేడియను.

సంధ్యా—(శీఘ్రముగ లేచి) అమ్మా! మోహినీదేవీ! నానాథునికి ననురాగము గలిగించిన నీవు నాకెంతయుఁ బూజనీయవు. అమ్మా! నీవీయెడకు రావలసియుండెనా? ఒక మాట చెప్పియంపియుండిన నే వచ్చియుందునే? నీయనుగ్రహవిశేషము మమ్మును మా నాథుని భాగ్యరాశిముంచె. దేవతలకైన భజనీయవైయున్న యప్సరస్త్రుణివగు నీవు నాథుని జెట్టపట్ట వలయునన్న, నతని భాగ్యవిశేషమే కాదా? ఇంక నీయట్టి దుర్లభ్యకాంతామణితో మాకెల్లరకు సపత్నీత్వము చేకూఱవలయునన్న మాభాగ్య మెంతనవచ్చును! కూర్చుండుము.

మోహి—(కూర్చుండి) అమ్మా! నిన్ను దర్శించుట నాను భాగ్యోదయమే. నీవు వ్రాసినకమ్మ చూచినవెంటనే, నీయెడ నాకింతింతనరాని భక్తిపొడమె. నాతప్పు లున్న క్షమింపుము. వింధ్యప్రాంతముననున్న శిష్టకామేశు భజించువేళ నీనాథుని సందర్శనము నాకు లభించె. ఎనలేని మోహాబ్ధి మునిఁగితి. ఊరక చెట్టపట్టక వనితాంతర ప్రసక్తిమానుటయేకాక యటుమానుటకు నీసమ్మతివడయుటయొక సమయముగా నభిలషించి ప్రమాణముగైకొంటిని. ఒకయెడ మోహాతిరేకమును మఱియొకయెడ నీవు సమ్మతింపకున్నఁ బ్రమాణభంగమును నిష్టార్థభంగమును నగునని భీతియుఁ బాధింపఁ ద్రొక్కులాడుకాలమున నీకమ్మఁ బంపి పుణ్యము గట్టుకొంటివి. ఒక సమ్మతి యిచ్చితివి గదా? ఇంకొకసమ్మతి సమక్షమమున నిను వేఁడుటకై నేనువచ్చితి. అదియేమన్న—

సంధ్యా—అమ్మా! సమ్మతియని నీవనకుము. నీయాజ యేమైనను నెఱవేర్చెదను. నీ వడ్డుగుటకుముందే యది యెట్టిదయినను నాయంగీకారమున్నదె నమ్మును.

మోహి—అట్లయిన ధన్యనైతి. నాప్రార్థన వచించెదను. స్వామి సన్నిధిఁ బ్రమాణ మొనర్చియున్నందున నీసమ్మతివడయక నాథుని పాణివట్టుటకు శక్యముకాకుండెఁ గాక యది నెఱవేర్చినపిదప నాకోరిన సమయము నే మానుటకు నాకుఁబూర్ణస్వాతంత్ర్యము గలిగె? కావున నే దండనుండువఱకు వనితాంతర ప్రసక్తి మాన

వలయునన్న సమయము నేనై వదలుకొనెద. నన్ను మీలోఁ జేరినదానిఁగాఁ దలంచి మూన యందఱి యెడ నేకరీతిగా మననాథుఁడు వర్తించుటకు నీసమ్మతి కావలయునని ప్రార్థించుదాన.

కోమ (మోహినికి నమస్కరించి) అమ్మా! మోహినీదేవీ! నీవు మాతల్లివి మమ్ము
చంద్ర) నానంద పయోరాశి ముంచితివి.

సంధ్యా—కాంతాలలామా! నీ కెంత మహోదారగుణము! మాయెడ నక్కటికము కలిగి ప్రమాణము నైన మఱలించి యింతనుగ్రహింతువే! ఎంతటి ధీరగుణము! మమ్ము నీ చెల్లెండ్రఁగా దాసులఁగా నేలిన నదియే మాకుఁ బరమార్థము.

అనుబంధము 15.

(యవనికదిగజారును.)

—:o:—

చతుర్థాఙ్కము-తృతీయరంగము.

—:o:—

ఉద్యానవనము.

ప్ర: మోహిని-రుక్మాంగదుఁడు.

రుక్మాం—అలివేణీ! చూడు మప్పుడే సాయంకాలమగుచువచ్చె. ఆచక్రవాక దంపతు లకు లభింపనున్న వియోగమునకై యవి యప్పుడే తపించునటులున్నది.

మోహి—నాథా! ఇప్పుడు వచ్చినట్టున్నదే మనమీ యుద్యానవనమునకు! మధ్యాహ్నమున వచ్చితిమి. అప్పుడే సాయంకాలమయ్యెనా?

రుక్మాం—మోహానుబంధమున్నందున మనకుఁ బ్రొద్దే తెలియదయ్యె. ఈప్రొద్దుచేత మన మోహము మరెంతయు గ్రుడ్డివారిగా నొనర్చినది?

మోహి—అటుగాదు. మన మొక్క-యాట యాడితిమిగదా? దానివలనఁ బ్రొద్దు తోఁచకపోయినది.

(లోపల భేరీధ్వని.)

నాథా! ఏమి భేరి మ్రోయుచున్నది? ఇదేమి రణభేరియా?

రుక్మాం—కామినీ! ఇఁక మూఁడు దినములు నన్ను విడువుము. ఈదినము దశమి. సాయంకాలమైనది గనుక యేకాదశీ వ్రత నియమమును జాటించుచున్నారు. ఇప్పటినుండి విష్ణుధ్యాన మొనర్పవలయు. రాత్రి భోజనములేదు. రేపంతయు నుపవాసము. రాత్రి జాగరము. మఱునాఁడు సూర్యోదయమునకే పారణ. పగలంతయు నిద్ర లేకుండ నుండవలయు. మఱల రాత్రిభోజనము వర్జింపవలయు. ఈ మూఁడు రాత్రులును నీవియోగము నాకెంత చింత ఘటిల్లఁజేసినను హరివాసర వ్రత నిష్ఠ మానని నాకు విధిలేదు. ఇప్పటికిదియే కడముద్దుగా నుండుఁగాక (అని యాలింగనము చేసికొని ముద్దిడఁబోవ.)

మోహి—(దూరముపోయి) నాథా! ఇదియేమి పిడుగు పాటు తెచ్చితివి. ఇట్టివ్రత మెందైనఁగలదా? నీవేమో సులభముగ మూఁడుదినములంటివి. అవి నాకు మూఁడు యుగము లౌట విచారింపవైతివే? సర్వసుఖము లనుభవింప నాస్పదము గలిగించు నట్టి వయసున్న కాలమున నిదియేమేకాదశి? విడువుము. ముసలితనము వచ్చి నప్పుడే కాదశి నియమము లన్నియు నింక రెండుసాళ్లెక్కువగా నుపవాసము లుండి గ్రామెన నడిపింతువుఁగాక? ఇప్పుడేటికి వదలుము. నాకొఁగిటికిరమ్ము.

రుక్మా—మోహినీ! నేనెట్టి మాటకైనఁ దాళుదుఁగాక, యీవ్రతమును మాత్రము నీవు చులుకనగ మాటలాడితివా నేనోర్వను.

మోహి—ఇదియా నీసరసము? సుఖరీతి దేవలోకమున మెలఁగుచున్న నాకు లేని యాశలు గల్పించి, లెక్కలేని ప్రమాణములుచేసి యిటు కొనివచ్చినది నీవేకాదశీ వ్రతమొనర్చి నీ శరీరము శుష్కింపఁ జేసికొని నామోహము శుష్కింపఁ జేయుటకా? ఇది నేనుమాత్ర మెట్లోర్తును? నాథా! ఏల యీ భ్రాంతి? వదలుము. అలపూఁబాన్పుపై వినోదక్రీడల మెలఁగుదము రమ్ము.

రుక్మా—మోహినీ! ఇంకొండనకుము. ఇది నాచేతఁ గానిపని.

మోహి—రాజేంద్రా! నామాట లించుకైన జవదాటనని నాచెట్టపట్టితివే? ప్రమాణ మొనర్చితివే? పురుషులయొక్క మాటనిలుకడ నిప్పుడుగదా నాకుఁ దెలిసినది? ఘోరప్రమాణ మొనర్చి పదిదినములైనఁ గాలేదే?

రుక్మా—మనోహారిణీ! నీచరణములపైఁబడి వేడికొందు నన్ను మసలింపకుమా? నీమాట యెట్టిదైన నొనర్తునని ప్రమాణ మొనర్చినది నిక్కమే. ఆ ప్రమాణమునకై నా ప్రాణమైన నాకంటె నెక్కువగు నేపదార్థమైన నొసంగెదఁగాని యీ యేకాదశీ వ్రతము మాత్ర ముజ్జగింపను. అనుగ్రహించి యీ యుద్దేశము మానుమా?

మోహి—నాథా! ఒక పనికిరాని యేకాదశినాఁ డుపవాసముచేసి సగము చచ్చుట మానుమని వేడి నందులకు నీప్రాణమే యొసఁగెద నంటివి. ప్రమాణమైనఁ దప్పెద నంటివి?

లయగ్రాహి.

ఆలయమునందుఁగల బాలురు కుటుంబినియు
జాలిఁబడుచుండఁ జని శైలగుహలందుక్
బేలవలెనుండియుఁ గపాలముగళాసమును
గేలనొకదండమును వ్రేలితుదదర్భల్
పోలధరియించి మృగజాలములఁగూడిఫల
మూలములుపర్ణములు గాలిభుజియింపక్
జాలిచరియించు మునిలీల నుపవాసముల
నేలమదిఁగోరెదు నృపాలకులచంద్రా.

ఇంతన్యాయ మెందైనఁగలదా? విడువరాని ప్రాణమే విడుచుట కొప్పువాఁడ వింక నన్నవలీలగా విడువఁగలవుగదా? ఇంక నేనేల యిందుండవలయు.

రుక్మా—(కోపమున) తరుణీ! అప్పుడే చీఁకటివడియె. నేను హరిభజన మొనర్ప వలయు. ఇంకఁజాలు నీ మోహప్రసంగము, ఇంతజ్ఞానమా? భగవద్విషయమున భక్తిగలవారి నెట్టియైన నింకింత భక్తి వెలయునట్లు చేయుటమాని చెడుమార్గమునకుఁ ద్రిప్పఁ జూచుట పాడియా? ఇంకూరకుండుము. నీమాట జవదాఁటువాఁడఁ గానని నేనొనర్చిన ప్రతిజ్ఞ కర్థమిదికాదు.

మోహి—(స్వగతము) ఆహా! నేఁ గడుదూరము పోవనిచ్చితి. ఈ విభు నెడ నాకుఁ గల మోహ మగ్గలముగదా? ఎట్లు మానిపోవఁజాలుదు? (లేవఁబోవ).

రుక్మా—ఏమి లేచెదవు? (చేయిపట్టి నిలిపి) నీవును నాతోఁగూడ నేకాదశీ వ్రతము నాచరింపుమా? పోయి స్నానమొనర్చిరమ్ము. భగవద్ధ్యాన మొనర్తము.

(యవనికపడును.)

—:చతుర్థాంకము సమాప్తము:—

—:0:—

శ్రీ

మోహినీ రుక్మాంగద నాటకము.

—:0:—

పఞ్చమాఙ్కము-ప్రథమరంగము.

—o—

పర్వతసానుదేశము.

ప్ర: రంభ-ఊర్వశి-మేనక-తిలోత్తమ.

రంభ—చెలులారా! కొంచమైనను దాక్షిణ్యముచూపక మనము బుద్ధిచెప్పవలయును.

ఊర్వశి—రానిమ్ము. దానిఁబట్టిన దయ్యము నేవిడిపించెదను.

[ప్ర: మోహినిని బిలిచుకొని వరూధిని.]

వరూ—అక్కలారా! ఇదిగో యీ మోహినిని బిలిచికొనివచ్చియున్నాను. రుక్మాంగదు నిద్రవుచ్చి వచ్చియున్నది.

(మోహిని యందఱికిని నమస్కరించును).

ఊర్వశి—చాలును నిలుపుము నీనమస్కారములు. నీ విక్కడినుండిపోయి యెన్నిదినము లైనది చెప్పుము? అట్లేల తలవంచుకొని యున్నావు? ఏలపలుకకున్నావు?

రంభ—ఏమే మోహినీ! సిగ్గులేదా? చెప్పుము మూఁడు నెలలు కాలేదా?

మేనక—ఇంకనైన రుక్మాంగదుని పొందు తృప్తిపడెనా-లేదా?

తిలో—అక్కడ నెవ్వరు విటులు దొరకక యిక్కడకుఁ బరుగెత్తివచ్చితివా? లేక నీ ముద్దుమోము చూచి నీపనియంతయు నేనే చేయుచు నీకు సెలవిచ్చితినా?

రంభ—కాదే మోహినీ! నీతలదన్నిన వాండ్రెందఱోయుండఁ బదిదినముల లోపల రుక్మాంగదు వ్రతము చెఱుచు యుక్తిశాలిను లెందఱోయుండ నే నీ కార్యము చే యుదునని ముందుఁబడి వచ్చితివే. ఇందులకా?

మేనక—దేవేంద్ర భోగముకంటె-సోమయాజుల భోగముకంటె-యుద్ధహత వీరుల భోగముకంటె రుక్మాంగదు భోగము నీకంత మెచ్చునకు వచ్చినదియా?

ఊర్వశి—దానితోఁ నేమిమాటలే? మొద్దుముండ. పోదము రండు. దీని బిలుచుకొని

పోయి దేవేంద్రునకుఁ జెప్పి యిదివఱకుసల్పిన యపరాధమునకుఁ గొన్నినాళ్లు యమ యాతనల కొప్పుఁ జెప్పుదము.

మోహి—అక్కలారా! నను క్షమింపుఁడు. నిక్కముగా నాకు బుద్ధిమాంద్యము గలిగెను. ఇంక మసలను. ఇదే యింక మూఁడుదినములలోనే యేకాదశి రాఁగలదు. ఎట్లయినను కార్య సాధనము గలిగించుకొని వచ్చెద. నన్ను మన్నించి విడిచిపొండు.

ఊర్వశి—ఇంక నీమాటలపై మాకు నమ్మకము గలుగఁగలదా? ఆ రుక్మాంగదునుఁ జూచిన వెంటనే నీ కెదలేచి అంగలార్పఁ గలవు. నీకుఁ దగినది యమలోకమే! నీ వొనరింప నున్న కార్యమునకు వేఱొకరిని నియమింతమఁట లెమ్ము. కొన్నినాళ్లు నీవు యమ లోకముననుండి వచ్చిన నీభోగాపేక్ష శాంతమగును.

మోహి—మీకు నమస్కరించి వేఁడికొందును. నామాటైనఁ జూడుఁడు ఇన్నినా ళ్లజ్ఞానినై నే మసలిన నేర మొప్పుకొందును. ఇంక మూఁడు నాళ్లుకదా! నే గడువు గోరుట? అనుగ్రహించి నాకొసంగుఁడు.

మేనక—ఊర్వశీ! ఏమో మిక్కిలి చెప్పుకొనుచున్నది ఈమూఁడు దినములు గడువు నిత్తము. మోహినీ! ఈసారిమాత్రము నీవు కార్యసాధనము గావింపక కామోన్మా దము చూపితివా నిన్ను యమయాతనలకు నప్పగించుట యట్లుండఁగా మేమంద ఱము గలసి నికొసంగఁగల యవమానమును బాధలును నీ వూహించుకొనఁ జాలవు.

రంభ—రంకుముండ, మేమందఱము జీవ వైకుంఠోత్సవమునఁ దనపని సహితము చేసి బాధపడుచుండఁగా సిగ్గులేక తానొక మానవునిప్రక్కనఁ బరుండి యానందపడు చున్నది. దీని కేటికను నే? ఈ మూఁడు దినములు విడిచిన సాధింపఁగలదనుకొంటివా? చెప్పినఁగొట్టి బిలుచుకొని పోవుదము మావరూధినిని రుక్మాంగద జయమునకై పంపుదము.

తిలో—(మోహినిఁ గాలదన్ని) అవును. దీనింగృపఁజూడరాదు. గడు వేమిగడువు? దాని పిండము. ఈ మూఁడు నెలలు పనిపాటలులేక సౌఖ్య మనుభవించినది యింక వచ్చునా? పోదము పిలుచుకొని దేవేంద్రునొద్దకు.

మోహి—(నమస్కరించి) అక్కలారా! నామాటనైనఁ జూడుఁడు. మూఁడు మా సములు బాధపడితిరిగదా? ఇంక మూఁడు దినములకేల కక్కసించెదరు. తప్పక కార్యసాధన మొనరించి మీబాధలు మాన్పెద.

ఊర్వ—చెలులారా! పోవనిండు. ఈ మూఁడు దినములలో నేమి చెడఁగలదు. మోహినీ! అందఱి పాదములు ముట్టి యింక రుక్మాంగదునిపై మరులునఁ గార్యహాని గావింపనని ప్రమాణము చేయుము.

మోహి—(అందఱి పాదములుముట్టి నమస్కరించి).

ఆ. వే. కోపగింపవలదు మీపాదములయాన
మూఁడునాళ్లలోనముదముమీఱఁ
గార్యసాధనంబుఁగావింతుమన్నింపుఁ
డరసితప్పులన్నియక్కలార.

(ముందు యవనికపడును.)

—— :o: ——

పఞ్చమాఙ్కము-ద్వితీయరంగము.

మోహిని పడకటిల్లు.

మోహిని పండుకొనియుండును.

[ప్ర: తిలోత్తమ.]

తిలో—(లేపి) మోహినీ! ఈ నాఁడేకాదశి. రంభాదులగు మనవారు నిన్ను హెచ్చరించుటకై నన్ను బంపియున్నారు. అప్పుడే సాయంకాలము కావచ్చె. ఈరాత్రి లోపల నీవొనరింపఁదగిన కార్యము నొనరింపక పోయితివా తత్ఫలమును గుఱించి చెప్పఁ బనియేలేదుగదా? మహోత్సాహముతో మేమందఱము విమానములపైనుండి నీకార్యము నిరీక్షించుచుందుమని వచింపుమనిరి. రేపు సాయంకాలమునకు ముందే నీవేతెంచి మమ్ముఁ గలిసికొనవలయునని చెప్పుమనిరి. హెచ్చరిక!

(నిష్క్రమించును).

[ప్ర: రుక్మాంగదుఁడు.]

రుక్మా—(స్వగతము) ఏమికారణమో తెలియకున్నది. హరిభజన మొనర్చుచు జాగరము సేయుటకై వచ్చుచుండిన మోహిని యీనాఁడు రాదయ్యె. పోయి విచారింతుఁగాక. (మోహిని యొద్దకువచ్చి) మోహినీ! అదేల శయనించియున్నావు. పద్మనాభ దేవాలయమునకుఁ బోవలసి యున్నదిగదా? ఏకాదశినాఁడు పడకపై శయనింతువే? నీకేమి బాధకలిగె?

మోహి—మనోహరా! నాకుఁ గలిగియున్న బాధ యింతంతనఁజాలుదునా. అదితీర్ప నీ చే నున్నది.

రక్షా—ఆహా! మోహినీ! నేఁడేమి క్రొత్తమాటవింటిని? నీకుబాధగలిగి నేతీర్ప సాధ్యమున్న యోచింపవలయునా? నీవింత యాజ్ఞాపించినఁ జాలుఁగదా?

మోహి—నాథా! నీవనుటకేమి. ఉపచారమునకిట్లాడెదవు గాక నిక్కముగా నీవొనరించుటకు సంశయింతువని బాధపడుచున్నాను.

రక్షా—తరుణీరత్నమా! నీవిట్లన్న నేనేమన నేర్తును? నీయెడ నాకుఁగల పూర్ణ స్నేహము నెంత సంశయించినట్టులయ్యె. అది యటుండుఁగాక. ఇష్టకామేశు సన్నిధానమున నీమాట యేదియున్నను జవదాఁటువాఁడఁ గానని ఘోరప్రమాణము నొనర్చితినే? దానినెట్లు మఱవసాధ్యము?

మోహి—మోహమునకేమి? ప్రశంసనీయమగు నీదక్షిణ నాయకత్వము నినుజేపట్టిన యందఱియెడను నేకరీతిగా మోహ ప్రాచుర్యమే గావించు. ఇంకఁ బ్రమాణమన్ననో పురుషులు రాజులును నగువారికి లక్ష్యముండఁగలదా? మీరెల్ల వారిజాక్షులందును వైవాహికములందును ప్రాణవిత్తమానములభంగమందును జకితగోకులాగ్రజన్మరక్షణమందును బొంకినను నఘము పొందదని కుదుర్చుకొని యున్నారే? మీకు బొంకఁగూడని విషయమే లేదు. అన్నియు నిందులోనే యణఁగియున్నవి.

రక్షా—దేవీ! ఇదియేమి యీనాఁడిట్లు పరీక్ష చేయసాగితివి. అప్పుడె పదిగడియల రాత్రియయ్యె. ఏకాదశీ పుణ్యకథ వేళ మీఱనయ్యె. చెప్పుము నీయభీష్టమైన నేమి? నాకు సాధ్యమున్న నవశ్యము నెఱవేర్చెద. దేవాలయమునకుఁ బోవువేళయయ్యె.

మోహి—ఇప్పటికైన నిది ప్రమాణమేనా? నమ్మనచ్చునా?

రక్షా—నమ్ముము. నీయాన-నాయాన, యీయుమేశు నాన నెఱవేర్చెదను. ఎట్టి ఘనకార్యమైన నొనరింపఁ బ్రయత్నించెద.

మోహి—ఘనకార్య మొక్కటికాదు. అఘటన మేమియులేదు, నాథా! చెఱకు విలుకాని బాధకు సహింపఁజాలక యన్యథా శరణముఁ గానక నిను వేఁడవలసి వచ్చియున్నది.

అనుబంధము 16.

రక్షా—(చెవులు మూసికొని) హా! నారాయణ! నారాయణ! పాపము శాంతమగుఁగాక, పాపముశాంతమగుఁగాక. మోహినీ! ఇదేమి మొఱకుఁదనము? ఈనాఁ

జేకాదశి యగుట మఱచితివా? దినదినము క్షాలముగఁ దే? నేఁడును దేవు ద్వాదశియుఁ బోనిమ్ము. ఇష్టవిధానమున ననంగ క్రీడలఁ దేలుదముగాక. తప్పాడితి ననుము. ఈమాట యంగీకరింపుము.

మోహిని—ఆహా! దైవమా! నే నెంత నమ్మియుంటి? ఇష్టకామేశు నాలయమున నాన యొనర్చినందున కిదిఫలమా? నిమిషముసకుముందు నాయభీష్టమెట్టిదైనను జెల్లింతునని వచించిన సత్యమున కిదిఫలమా? పనికిరాని యొక యేకాదశీ వ్రతమునకే యింత యసత్య మాడవలయునన్న నింక నాయభీష్టము నీవెట్లు చెల్లింపఁగలవు? ఎట్టి ప్రమాణ మొనర్చినను సత్యభాషణము నిలుపఁజాలవని నిన్ను సంశయించినది నిర్హేతుకముకాదుకదా? అయ్యో! నే నెంత నమ్మితిని! ఆ యిష్టకామేశుని దర్శించుకొను బుద్ధి నాకు నాఁడేల పొడమె? పొడమెఁగాక వచ్చినదాన నీరాజన్యు నేల చూచితి? చూచితిఁగాక నాకీ పృథివీపతిపై మోహము జనింప నేల? జనించి నంత నే యణఁచుకొని నే నమ్మతింప నంటి నే? ఆ పట్టె పూర్ణముగాఁ గొనవఱకు సాధింపక యతని ప్రార్థన నియ్యకొంటి నేల? ఇయ్యకొన్నను నామాట పాటించునని నమ్మితి నేల? గరావరుల వృత్తాంతమంతయుఁ బూర్ణముగా నెఱిఁగియుండియు నీ భూమీశుఁ డొనర్చిన ప్రమాణమును విశ్వసించితి నేల? అకటా! ఎంత బేలనైతిని? ఎంత యాపదకు గుఱియైతిని. ఎంత క్రుంగిపోయితిని? సరివారిలో నెంత పలుచఁదనము దెచ్చుకొంటిని. ఎన్నియో యజ్ఞము లెన్నియో ఘనకార్యములు ప్రకటించిన మానవులకుఁ గాక చిక్కని నాయట్టి యప్సరస యొకరాజ మాత్రునికి సశరీర సుఖమిక్కఁ దలపడి వచ్చినందునకు నాకుఁ దగిన శిక్షయేకదా? రాజేంద్రా! ఇంకానతిమ్ము. నీప్రమాణమునమ్మిన వివేక శూన్యతకు నాకుఁ దగినశిక్ష యొసంగితివి. నీపూర్వ జన్మమున నొనర్చిన తపఃఫలమున నీమాటలకు బేలుపోయి నీకిన్నినాళ్లు చిక్కియుంటి. ఇంక నే వెడలిపోయెద. నీమాట నీకొప్పఁ జెప్పెద. మాయప్సరస్త్రీ లకెల్ల నీయమోఘ సత్యనియమము వచించి నాయొక్కదాని చేటువలన వారి నందఱి నిట్లు మోసపోవకుండ నొనర్చెద. (లేచును).

రుక్మా—తరుణీ జనవతంసమా! నీవిట్లాడుట పాడియా? నాల్గుమాసములనుండి నను బాలించుచువచ్చితివే? ఒక్కనాఁడైన నాయెడ నపరాధమునకుఁ గారణముండెనే? మీఱరాని యేకాదశీ వ్రతముగాక, నీయభీష్టము చెల్లించకుందునే? నీకుఁ గన్నీ రేల కలిగెను? నన్ను మన్నింపుము. నాయపరాధముల క్షమింపుము. ఇది నాకు సాధ్యము కానిపని. చూచితివా! నీకిట్టి ప్రణయకోపము కలిగినవేళ నిన్ను గౌఁగిలించుటకును, నీకన్నీరు ముద్దాడుటకును, నీచెక్కులంటి-చేతులంటి-చరణములంటి వేఁడుకొని యూఱార్చుటకును నీ యేకాదశీ వ్రతమే యభ్యంతర పఱచుచున్నదిగదా?

సీ. ఘనవేణి నీ చెక్కుఁగవ నంటి నా మోహ
 మొగిఁ జెలువంగ లేకున్నవాఁడ
వనజాయతాక్షి నీ ప్రణయకోపము దీఱ
 నిన్ను గౌఁగిటఁ జేర్పకున్నవాఁడఁ
వరశాక్షి నీ మోహపరితాపమారనీ
 కన్నీరు ముద్దాడకున్నవాఁడ
మానినీమణి నన్ను మన్నింపుమని కాళ్ల
 నొరఁగి వేఁడఁగఁ జాలకున్నవాఁడ

గీ. వదలరాని యేకాదశీవ్రతము గాక
 కారణం బొండు గలుగదు సారసాక్షి
బాసఁ జేసెద నింతైన మోసమెఱుఁగ
 నన్ను మన్నింపవే మదనాగయాన.

మోహి—సఖీధవా! నీవును, నీ యేకాదశియు సౌఖ్యముగా నుండుఁడు. నాకేల యిరికీ నీగొడవ? నీవేకాదశినే పెండ్లియాడితివి గాక, నాచెట్టపట్టితివా? ఎట్లును బోయెడిదే గదా! నాకేమియుఁ గొదవ గలుగదు కాని నిను జూచిన, నత్యంతమగు దుఃఖము గలిగెడు. భూరమణా! మీపూర్వీకులు సత్యరక్షణమునకై యెన్నియో కార్యము లొనర్చిరి. తనప్రాణములనైత మిచ్చిరి. లోకమున నెందఱు రాజులుండలేదు? ఎందఱు చక్రవర్తులుండలేదు? ఎంతపాటుపడి, యెన్ని దుఃఖములకోర్చి, వారు సత్యధర్మమును రక్షించిరి. నీవు మూఢుఁడవై, యరకాసు చేయని యేకాదశీవ్రతమునకని విడువరాని సత్యవ్రతము నవివేకివై విడిచెదవేయని పరితాపపడుచున్నదాన. ఇది శేఁగుఁబంట్లు కొనుటకు ముత్యములు పోసినట్లయ్యెఁగదా? నీకర్మమునకు నే నేమి చేయుదాన? అసత్యపాపము నొప్పుకొంటివా? ప్రమాణధిక్కృతి కియ్యకొంటివా? వచింపుము కడమమాట. పోఁబోయెద.

రుక్మాం—ఇది నా దుష్ప్రాప్తి యనవలయును నా? లేక నీ దుశ్చరిత మనవలయునా? నాప్రాణములైనఁ దృణప్రాయముగ మానుదుఁగాక, యసత్యపాపమునకు నే నియ్యకొందునా?

మోహిని—మాటలాడితివి గాక, కార్యమున నేమి చూపితివి?

రుక్మాం—తరుణీ! ఇంకూరకుండుము. నాకుఁ గోపము వచ్చును. సభక్తితాత్పర్యముగ విష్ణుసేవయొనర్చుచుఁ దిరుగరాని మానసముతో నిశ్చలనిష్ఠ నేకాదశీ వ్రతము జరుపుచున్న

నాకు వ్రతభంగ మొనర్చురీతి నిట్టికోరిక కోరెదవా? అదివలదనిన నాకు సత్యభంగమా? చాలునీచాతుర్యము. నేనసత్యవాదినైన, హరివాసరమున నీతో రమింప సత్యవ్రతుఁడగు పతినే కోరుకొనుము. ఇంకనైననేమి?

మోహిని—రాజేంద్రా! నీసాహసమును, నీవాచాలత్వమును నెంతనవలెను. అసత్యమాడియు, నందునకుఁ గుందుటమాని నాపైననే తిరుగుపడి ప్రమాణములు సరకుగొనక, యసత్యముకాదని వాదించెదవే? ఇంకనాపై- నన్నే కోపగించెదవే? ఇదిజాణతనము కాదా? పోనిమ్ము. ఇదిప్రమాణమైనదియు నప్రమాణమైనదియు, దీర్చివగదెంచు వారు లేకుందురా? అదితరువాత విచారింతముఁటు. ఇప్పుడైనవచింపుము. నామాట యెట్టిదైనను, జవదాఁటనని స్వామికోవెలయందుఁ జేసినప్రమాణమును బట్టిసాధించెద. నేను నేఁడేకాదశియైనను, నేమైనను నిన్నువిడువను,

రుక్మాం—మోహినీ! నావ్రతనైష్ఠికత నిన్నిదినములు చూచియు, నీవెఱుఁగవైతివా. ఇదినాకుసాధ్యమగునా?

అనుబంధము 17.

వలసియున్న నారాజ్యమంతయు నీకొసంగి యడవులఁ జేరుమనుము. నాభార్యలనెల్ల నీకు దాసులుగానొనర్చి యూడిగము చేయింపుము నాకుత్తుకయైనను, నాకొమారు నుత్తుకయైనను, ఖండించి నీయెదుటఁ బెట్టుమనుము. ఏదైననొనర్తుఁగాక, యీ వ్రతోపసంహారము మాత్రమునాచేతఁగాదు.

మోహిని—నిక్కమా? ఇదితప్ప నీవింకేమైననుపడిగిన నీయ్యఁగలవా? ఇత్తువా? ఇదియైనఁ బ్రమాణవచనమేనా?

రుక్మాం—నీవేప్రమాణము చేయుమన్నను జేసి తప్పక యొసంగుదును.

మోహిని—అట్లయినకానిమ్ము. నీవు నీకొడుకు తలకోసి యిచ్చెదనని వచించితివికదా? ఆకార్యమొనరింపుము.

రుక్మాం—హా! దైవమా! (అనిమూర్ఛిల్లును)

మోహిని—(రుక్మాంగదునకు శిశిరోపచారములు చేయుచు) రాజేంద్రా! రాజేంద్రా! ఆహా! ఎంతకార్యమాయెను. సేవకా!

[ప్ర: సేవకుఁడు.]

నీవీక్షణమునఁబోయి రాజుగారు మూర్ఛిల్లియున్నారనిచెప్పి తగినయౌషధములతో తీసుకొని రాజవైద్యుని రమ్మనుము. అహో! నేనెంత క్రూరకృత్యమొనర్చితి. నామనోనాథునకెంత యాపదగలుగునట్లొనర్చితి. అచ్చరలలో నెందఱో యుండిరి గదా! నేనేల యీవ్రతభంగ కార్యమునకుఁబూనితి.

ప్ర: తిలోత్తమ (పైనుండివచ్చి)

తిలో—మోహినీ! పైనుండి మేమంతయు వినుచున్నారము. మంచిమార్గముంబట్టితివి. మనకార్య సాధనమునకు నిదియే సమయము. ఇదియే దారి. తిరిగితివా! పనితప్పును. భద్రము. భద్రముసుమా? (నిష్క్రమించును.)

ప్ర: (శ్రీఘ్రగమనమున) రాజవైద్యుఁడు సంధ్యావళి-కోమల చంద్రకాంత-ధర్మాంగదుఁడు.

సంధ్యా—అమ్మా! మోహినీదేవీ! ఏల యీరాజన్యున కీమూర్ఛగలిగె?

మోహిని—వైద్యచంద్రమా! ఏదేనిచికిత్సయొనర్పుము. తెలివిగలిగింపుము. అమ్మా సంధ్యావళీ! దాఁపనేల చెప్పెదను. నేనీరాజన్యు నొకస్వల్పకార్యమపేక్షించితి. అదితన యేకాదశీవ్రతమునకు భంగముకలిగించునని యొసఁగఁడయ్యె. నామాటమీఱఁడని యతఁడొనర్చిన ప్రమాణమును నిర్బంధించితి. ఏమన్ననుమానక తనకొడుకు కుత్తుక మైనఁగోసియిత్తుఁగాక యీకార్యము నేఁ జేయనని మనస్విగా నను గోపగించుకొని మాటాలాడె. నేనును నీకొడుకు కుత్తుకయే కోసి యిమ్మంటి మూర్ఛిల్లియున్నాఁడు.

కోమల చంద్రి — ఓసి! దురాత్మురాలా! ఓసిగయ్యాళి ఇదెట్టికోరికయే? సుకుమారు కంఠచ్ఛేదనమొనర్చుటకు రాజేంద్రుఁ డెట్లోర్వఁగలఁడు. ఇంతదౌరాత్మ్యమెందైన వింటిమే?

(వైద్యుఁ డుపచారము చేయఁగా రాజునకుఁ దెలివిగలిగి లేచి కూర్చుండును).

రుక్మా—హా! మోహినీ! నాకెంతటిపిడుగుపాటు గలిగించితివి. సతీమణులారా! మీరువచ్చియెంత సేపైనది? మోహినీ! నీక్రూరకృత్యము మానితిననుము. తప్పాడితిననుము. నిర్బంధము మానుము. నాపైఁగరుణ రానిమ్మ.

సంధ్యా—మోహినీదేవీ! చేయరాని కార్యములు చేయుమనిపతిని నిర్బంధపెట్టుట పాతివ్రత్యమునకే భంగము కలిగించునదికదా?

సీ. కామినీమణికి మంగళసూత్రమే చాలు
శృంగారములకెల్లఁ జెలువుచూప
ధవళలోచనకు నైదువతనంబే చాలు
వైభవంబులకెల్ల వన్నెఁబెట్ట
నంబుజాననకుఁ బుణ్యాంగనాత్వమే చాలు
రాజసంబులకెల్లఁ దేజమెసఁగ
సతికి నాథుఁడు దృఢస్థితినుండుటే చాలు
భాగ్యలక్ష్ములకెల్లఁ బ్రభ దనర్ప

గీ. నెన్నిజన్మములందుఁ బద్మేక్షణలకుఁ
బతిహితంబునకంటె శోభనముగలదె
యిహపరములిచ్చు హృదయేశుమహిమ దెలియ
కధిపుమదినొవ్వఁ జేయుట యుక్తమగునె

మోహిని—నీధర్మోపదేశము నాకు ననపేక్షితము. పాతివ్రత్యమంతయు నీవే యెఱిఁగిన దానవనుకొంటివో! రాజేంద్రా! ఏదైననొకటి నీవొనర్పకున్నఁ బోదు. వ్రతము మానెదవా? కొడుకుం జంపెదవా?

కోమల—నాథా! దీనికేలయిట్టియున్నతి? దీనిమాటజరుపకున్న జగత్ప్రళయమా. కాఁగలదా? తొలఁగింపుము నీయింటినుండి? ఇట్టిక్రూరచింతయొనర్చుదాని నాదరింప వచ్చునా?

చంద్రకా—ఇదికోరినకోరిక జరుప నేవలయునను నంత నిర్బంధమేమి? ఎవతెద్దైనను, గొడుకుం జంపుమని నిర్బంధ మెట్టుదుర్జాతి గలుగునే?

మోహిని—సవతులారా! మీకేమి కావరము హెచ్చినదా? నోటికడ్డములేక మాటలాడు చున్నారు? మిమ్ము న్యాయము తీర్పఁడనియెవ్వరైనఁ బిలిచిరా? పిలువని పేరంటము గావచ్చి, కారులువల్కసాగితిరా? ఊరకనాలుక బిగఁబట్టి పడి యుండుఁడు. మిమ్మెవ్వరునీతులడుగలేదు.

కోమల—వేశ్యా! ఇది నీకులము తప్పితము కాని నీతప్పితము కాదు. కన్నవారిఁగలపి పెంపా మన్నమాట మూలఁబెట్టి మనఁగలసామాన్యకు నకపటికముగలదా? సదసద్వివేకము గలదా?

మోహిని—ఔనే! సిగ్గులేక పతియెదుటనే వేశ్యతోసరిగట్టుకొని నాట్యమొనర్చునట్లు మాటలాడితివే? నీవుప్రచ్ఛన్న వేశ్యవుగావా?

సంధ్యా—అమ్మలారా! మీరేలవాదించుకొనియెదరు. నిలువుఁడు.

మోహిని—రాజచంద్రా! నాకుఁ బ్రత్యుత్తరమిచ్చుటకుఁ జేతఁగాక నాసవతులఁగల్పించి నను దిట్టింపసాగితివా? నాకేమియువలదు. సత్యముజరుపలేక పోయితిననుము. మాటయిచ్చి తప్పితిననుము. ఆమాటాడుము. నాకింకేమియువలదు. ఇట్లేవెడలి పోయెద.

ధర్మాంగ—జనకా! నీవేలయోచించెదవు? వ్రతభంగమైన నాప్రాణమైనఁగదా మాపిన్నతల్లి మోహినీదేవికోరికొనుట? ఎన్నిదినములనుండియో, యాచరించుచుండిన యీ వ్రతముమానుటకగునా? చెప్పరానిదోషము సిద్ధించుఁగదా? ఇంక నాకొఱకా? నీవేల యోచింతువు. క్షణభంగురమైన యీప్రాణము వ్రతమునిల్పుటకై త్యజించి పరమ పావనమగు హరివాసరము నాఁడు నారాయణచరణసన్నిధికిఁ బోవనెంచుటకు, నాకు

జన్మజన్మాంతరగతపుణ్యఫలముకదా? అదియెట్లులభింపవలయును? నేనంతసముచితస్థితిం జెందెద. నీవింకయు నాలోచింపకుము. ఎత్తుము నీకరవాలము! నన్ను ఖండించి నాకుఁబున్యాగతి చేకూర్చి, వ్రతముస్థాపింపుము. మాతల్లియును నీవును సుఖమున నున్న నాయట్టిపుత్రులు నీకెందఱో గలుగవచ్చు. సంశయింపకుము.

రుక్మాం—హా! దైవమా!

మోహిని—కుమారా! అరకాసుచేయని వ్రతమునకై, నీప్రాణములుపోవఁగొట్టుకొన నుద్యమించితివా?

అనుబంధము 18.

ఇదెట్టి వివేకము?

సంధ్యా—రాజచంద్రా! ఈమోహినీదేవిమాట యెట్టిదైనను, జవదాఁటనని ప్రమాణమొసంగియుంటివి. ఏమిదైవప్రేరణమో యీయమ నీవు వ్రతభంగమొనర్పనభిలషించినది. దానికొప్పక నీకొడుకునైనఁ దలకోయుమనని వచించితివి. అదియేపట్టుగా నాయమ నిర్బంధింపఁదొడఁగె. దీనియందు ధర్మసూక్ష్మమేదియు లేదు. నీవుసత్యముపరిపాలింపవలయును.

చ. తనువులు తోడరావు తుదఁ దామరసాక్షుల శాశ్వతంబుగా
ధనములు రాజ్యసౌఖ్యము వృథా సహజన్ములు బంధుమిత్రులున్
దనయులు మిథ్య యెంతయు ముదంబునఁ జేసిన ధర్మమొక్కటే
మనుజవరేణ్య నిల్చునది మానవకోటికి నెల్లకాలమున్.

ఈకుమారుఁడును ధీరమానసమునఁ దానొప్పగించుకొనుచు వ్రతమును గాపాడుమని నిండుగనోచనతోఁ బలికె. కావున సత్యపాలనమునకై పుత్రమారణకృత్యమైనఁ జేయఁదగియేయున్నది. (ధర్మాంగదుని గౌఁగిలించి) తనూజా! నీవుగదా సత్పుత్రుఁడవు. పుణ్యదినమగు హరివాసరవ్రతము భంగములేకుండ నిలిపి పుణ్యలోకగతి వడయుటకు నీవుద్యమించితివి. ఇంతకంటె భాగ్యముకలదా? చిఱుతవాఁడవయ్యు జ్ఞానాధికత గలిగి తలిదండ్రులకింత ప్రీతియొనర్తువే? నీయట్టిసుతుఁగనుటచే, నేవీరమాతనైతి, ధన్యనైతి. అయిన నీకుఁబెండ్లి మొదలగు కార్యములు గావించి, పెద్దవాఁడవై, కొడుకులఁగాంచి సుఖించుచుండునది చూచి, యానందింపలేక పోయితినేయని యంతమాత్రము పొక్కుచున్నదాన. (కన్నీరునించి ముద్దాడును).

రుక్మాం—హా! దైవమా! నాకెట్టిప్రాప్తిఁ దెచ్చితివి.

ధర్మాంగ—జనకా! నీవుప్రాకృతునిభంగి నిట్లు యోచింతువేల? లోకమున నెల్లధర్మములు సత్యమునకంటె నెక్కుడు కాదు? ఎన్నికష్టము లనుభవించినైనను, నెన్నికష్టములు

పడినయైనను సత్యము కాపాడకున్నఫలమేమి? నేనెన్నిదినములు బ్రతికినను హరిప్రీతిగాఁ బ్రాణము లొసంగునంతపుణ్యము నాకుఁ గలుగ నేర్చునే? జనకా! ఇంతైనయోచింపకుము. నిగ్రహముఁగలిగి సత్యము పాలించి, నన్నువధించి నాకును మాపినతల్లికిని సంతసము నింపుము.

మోహిని—

క. కలిమికి రాజ్యవిభూతికి
నిలవ్రతములుసేయుటెల్ల నీగతిఁజావన్
వలవదు ప్రాణముగల్గిన
బలుసాకులుదినియునైన బ్రదుకఁగవచ్చున్.

చచ్చినపిదప నేటిసద్గతి? నీవుపసివాఁడవు. అరయ నేరవు. మేఘములనమ్మి చెఱువు నీటినిజల్లించుకొను వారుందురా?

ధర్మాంగ—మాతా! దేవవనితవై సర్వధర్మములు నెఱిఁగిననీ వీమాట యాడవచ్చునా?

అనుబంధము 19.

జనకా! లెమ్ము.

మోహిని—సంధ్యావళీ దేవీ! నీవైనను జెప్పుము.

కం. అ[illegible]పైకంబును జేయని
హరివాసరమునకునై నిజాత్మజుదునుమన్
గరవాలంబునుబూనెడు
కరణి యినుపమొలకు మేడఁగాల్చుటకాదే.

ఈ వ్రతము మిమ్ముద్ధరించునదేమి?

సంధ్యా—మమ్ముద్ధరించుటటుండనిమ్ము. ఆవ్రతము నీకొసర్చినకీడైన నేమి? ఇంతదానిపైఁ బగఁబట్టితివి? ఈవ్రతము భంగపఱచుటకే నీవు కంకణముకట్టి యిందువచ్చినట్లు తోఁచుచున్నది. నాథా! వ్రతమును, సత్యమును రెండునునిలుపుము.

రుక్మా—ఆహా! నాకిప్పుడుజ్ఞప్తికివచ్చె. ఈమోహిని వచ్చిన యెనిమిది పదిదినములకే, యేకాదశివచ్చె. ఆనాఁడునన్నెంతో నిర్బంధపెట్టె. అప్పటికొకరీతిఁ జాలించి యిప్పుడింతనిక్కచ్చియొనర్చుటకుఁ బ్రారంభించియున్నది. ఇందేమోయున్నది. నాదుర్విధియేయీమార్గమున, నాకు వ్రతభంగము ఘటించి కీడొంచినట్లున్నది. కానిమ్ము. మోహినీ! నీ వూఱడిల్లుము. నేసత్యవాదినగుటయుఁ గాకుండుటయు నీ వెఱుఁగఁగలవు. కుమారా! రమ్ము.

ధర్మాంగ—(చేతులుజోడించికొని తండ్రియొద్దకుఁబోయి నిలిచి) పరమేశా! నన్ను నీ సన్నిధికింగొమ్ము. మాతండ్రికిట్టిపాపమును గలుగకుండ వ్రతస్థాపనము చేయింపుము. స్వామీ! ఇదెనమస్కరించువాఁడ. (నమస్కరించి) అమ్మలారా! మీరెల్ల ధైర్యము వహింపుఁడు. మీపుత్రునికి సద్గతిగలుగనున్నదే యనియానందింపుఁడు.

అనుబంధము 20.

(బోరగిలఁబండుకొనును.)

రుక్మా—(ఖడ్గముచేఁబట్టిలేచి) రమారమణా! ఇదే నేఁబ్రతినచెల్లించువాఁడ. వ్రతభంగమునకు మనసొప్పక యసత్యపాపమునకుఁగోసి, నాసుతునిఖండించువాఁడ. ఇదెంత క్రూరకృత్యమైనను, సత్యభంగమునకంటె మించినది కాదనినమ్మి, యీకార్యమొనర్చువాఁడ. పరమేశా! నాకు ధైర్యముఘటిల్లఁజేయుము. తిరుగుఁబాటు జనించునట్లొనర్పకుము. నీపాదముల నే సభక్తితాత్పర్యమునఁ బూజించువాఁడ నేని, నిశ్చలమానసమున నీకుఁ బ్రీతిగా నీయేకాదశీవ్రతము నే సలుపుదు నేని, యెల్లవేళల నసత్యమున్నఁ గంటగించువాఁడ నేని, మానసమున నెపుడును బరోపకారము చింతించువాఁడ నేని, కృత్రిమవిధానము లేక నిక్కంపు దైవభక్తి కలవాఁడ నేని, యనవరతము భూతదయ నాకుఁ గలదేని, వెలలేని నీయనుగ్రహము నేఁ బడసినవాఁడ నేని, నాకేమియుఁ బాపము గలుగకుండ సత్యమునిలిపి వ్రతభంగము లేకుండ నను గాపాడుము. (కత్తియెత్తి) ఆహా! హస్తమా! నీవు నాకెంత యుపయోగకారివైయున్నావు. హరిపాదసరోజపూజ యొనర్చుటకు నీవేకదా నాకాధారమవు? ఆశ్రితతృప్తిగా సర్వదానములొనర్చుటకు నీవేకదా మూలమవు? గోబ్రాహ్మణధర్మసంరక్షణకై యరినిధన మొనర్చుటకు నీవేకదా నాకుఁ దోడు? అతిథులకుఁ బెద్దలశుశ్రూషలొనర్చుటకు నీవేకదా నాకు సహాయమవు? నీతో నెన్నితపములో, యెన్నియజ్ఞములో, యెన్నిదేవపూజలో, యొనర్చి లేక లేక, పడసిన నాయేకపుత్రుని సంహారమొనరింపింతునని నే కలనైనఁదలంపనైతిఁగదా? ఇప్పుడా కార్యమొనర్పనుంకించితిని. ఇదియంతయు సత్యమునకై యొనర్చుటకావున నీవుశంకింపకుము. ఎన్నిదురవస్థలో, యెన్నిమనఃక్లేశములో, యెన్నిశరీరకష్టములకైన నోర్చి సత్యముపరిపాలింపవలయుఁగదా? ఆసత్యపరిపాలనానంద మేకపుత్రమరణదుఃఖమునకంటెనూఱుమడుంగు లెక్కువయగుఁగదా? కానిమ్ము. నీపనియొనర్పుము. హృదయమా! నీవించుకైనఁ గళవళింపకుము. పూర్ణభావమున సత్యస్థాపనమునకై కడఁగుము. భ్రాంతిమై దారాపుత్రులని సంబంధములేనివారియెడ మోహమునించి పవిత్రంతముగాక ఇవియంతయుఁగలలోని నటనములని యెఱుంగఁజాలక యున్నాము. పుత్రుఁడెక్కడ? జనకుఁడెవ్వఁడు? ఒకరు నిలుచువారు కారు. సత్యమొక్కటియే నిలుచునది. సత్యమొక్కటియే ప్రజ్వలించి ప్రకాశించునది. ధర్మమొక్కటియే పాడమాపునది. కావున నీవింతైన వెనుదీయక నాచేత నీకార్యమొనరింపఁజేయుము.

కన్నులారా! మీరు నీరు నింపకుఁడు. జితేంద్రియత్వమున ధర్మస్థాపన మొనర్చుటకై యెట్టిసంకటములు నించుకార్యమయినఁ జేయఁగల సమయముకాని శోకమునకు సమయముకాదు. మనోహరైక పుత్రసంహార మొనర్చుకార్యమే మేమెట్లు చూడఁగలమని మీ రాలోచింపకుఁడు. నశ్వరమైన నైహికఫలము లభింపకున్న మానెఁగాక యీ కార్యమున ననశ్వరమైన యాముష్మికఫలముతప్పక లభింపనున్నది. కావున మీరు జాగరూకతమై యశ్రునిర్బంధములేక చూచి కార్యమొనర్పుఁడు, ఇదే యింకఁ గార్య మొనర్చెద. (ధ్యాన మొనర్చి భగవంతుని బేర్కొని) శ్రీహరీ! (అని యరచి ఖడ్గ మెత్తును).

[పైనుండి ప్ర: విష్ణువు-లక్ష్మి.]

విష్ణు—ఆహా! రుక్మాంగదా! మెచ్చితి. మెచ్చితి. నిలువుము.

మ॥ అరరే మెచ్చితిమెచ్చితిన్ దలఁపఁగా నత్యద్భుతంబయ్యెనీ
చరితం బీగతిసద్వ్రతాచరణమున్ సాధించువారుందురే
కరుణన్ బూనక దానికై నిజసుతున్ ఖండింప నుంకించితే
సరిమీరాంగదసాహసోద్యమమికన్ జాలింపురుక్మాంగదా.

(అందఱు సాష్టాంగ నమస్కృతు లొనర్చెదరు)

విష్ణు—రుక్మాంగదా! నీమహిమ మసమానము. ఎవరును నీయట్టి మనోదార్ఢ్య ముగలవా రుండుటరిది. వ్రతమునకై యిన్ని నియమములు జరిపితివి; నైనఁ బలినొసంగ నుద్యమించితివి. మాయురే! నీయట్టి వ్రతశీలుఁడున్నే? మీ యెల్లరయెడ నా కత్యంతానుగ్రహము గలిగె. కొన్ని దినములలో నిను నాలోకమునకుంగొని యున్నతపదవి యొసంగెద. ఏడెనిమిదేఁడుల బాలుఁడయ్యు నీకుమారుఁ డొనర్చిన యాత్మత్యాగస్కార మెంతయుఁ గొండాడఁదగియున్నది. డెబ్బది యేండ్లవారికైన నిట్టి తృణీకృత దేహత్వము సిద్ధించునా? ఇతఁడును బహు సంవత్సరములు రాజ్యమేలి నాయెడకే తెంచి నీతో నుండఁగలవాఁడు. నీపట్టమహిషి సంధ్యావళి యుదారగుణమును నా పతిభక్తియు వ్రతభక్తియు సత్యాభిలాషమును నింకను గొండాడఁదగియున్నది. కాకున్న తనయేక పుత్రు-ముద్దుపట్టి నెనిమిదేఁడుల పాపనిదానికై పోకార్చుకొనుట కొప్పియుండునా? ఆమెకు సద్గతియే కలుగఁగలదు. ఈమోహినియు నొకకారణమున నీకు వ్రతభంగముకలిగించు నుద్దేశమున నిట్టిపూనిక చూపినదిగాక క్రూర మానసము వహించినదికాదు. నీసంసర్గము కలిగియుండుటఁజేసి యీతన్వికిఁ బుణ్యము లభింపవలసియే యున్నది. అమరవనితయై నందున నీచేలువకు నాలోకమునకు

సశరీరముగా వచ్చుట కొక్కొక్కవేళ లభించుఁగాన నీసంసర్గమున నీపుణ్య ప్రాప్తి నేనొసంగెద. ఏకాదశీవ్రతము సాంతముగా జరిపినవారు ద్వాదశి పగటివేళ నిద్రించిన వారికిఁ దద్వ్రతఫలము లభింపకుండుఁగదా? ఆఫలమెల్ల నీ మోహినీ సతికి లభింప ననుగ్రహించెద. తన్మూలమున నాలోకమునకు నిరాటంకముగా వచ్చుటకును నప్పుడప్పుడు నాదర్శనము లభించుటకును స్వాతంత్ర్యము గలియుండుఁగాక. రాజేంద్రా! నీకు శుభమగుఁగాక.

అందఱు—(సాష్టాంగనమస్కారమొనర్చెదరు.)

లక్ష్మి— అనుబంధము 21.

రుక్మా—దండకము:—జయజయజయలోకనాథా! బుధారాధ్య వేధో నిలింపాదినాథాదివంద్యా-పరబ్రహ్మవీవే - జగత్కర్తవీవే - పరేశుండవీవే-గిరీశుండవీవే-సురేశుండవీవే-దిగీశుండవీవే-జగత్సాక్షివీవే-త్రికాలుండవీవే-త్రిలోకుండవీవే-త్రిరూపుండవీవే-త్రివాచ్యుండవీవే - త్రివంద్యుండవీవే-త్రిదూరుండవీవే-చరాత్ముండవీవే-స్థిరాత్ముండవీవే - సమస్తప్రపంచంబులందున్న జంతుప్రకాండంబులందున్న తేజోవిలాసుండవీవే-జగద్గర్భ నిన్నున్నుతింపంగ నేనెంతవాఁడన్, గుణంబెన్నఁజాలన్, విలోకింపఁజాలన్-నుతింపంగఁజాలన్-

రుక్మా—మునీశాన సందోహ ప్రేమావలోకా,

మోహి—ఘనశౌర్యచంచన్మహాధైర్యరేఖా,

సంధ్యా—సునిడోద్భవాధీశ దివ్యత్తురంగా,

చంద్ర—అనాయాస నిర్ఘాతదైతేయసంఘా,

కోశ—ధనుస్త్వంస కారమ్యనిధ్యాతశార్ఙ్గా,

ధర్మ—మనోమాత్రసంసృష్టలోకప్రపంచా,

రుక్మా—మనోజ్ఞప్రకారాత్తమాయూరఫించా,

మోహి—దినాధీశమిత్రాది దేవేశపూజా,

సంధ్యా—జనాలోకదుర్గమ్య మహాత్మ్యజంఘా,

చంద్ర— అనాధారలోకాధికాధారవిష్ణో,

కోమ—దినేశాన తేజోతిగమ్యప్రఖేటా,
ధర్మ—అనూచానసేవావసన్నీలకంఠా,
రుక్మా—అనాధేయగర్భస్థబ్రహ్మాండభాండా,
మోహి—క్షణాగమ్యవృత్తిప్రకృష్టప్రగూఢా,
సంధ్యా—అనార్ద్రప్రధారావిరాజత్కృపాణా,
చంద్ర—సునిలా ధరత్రీ రమాసత్సమేతా,
కోమ—ఘనీభూతకారుణ్యభంగీసనాథా,
ధర్మ—అనాయత్తమాహాత్మ్య వేదాంతపాదా,
రుక్మా—సునాభీసరోజాతసంభూతవేధా,
మోహి—అనాఖ్యాతదుర్జ్ఞేయలీలావిధానా,
సంధ్యా—సునామప్రభాజాలనిర్ధూతపాపా,
చంద్ర—సునాశీరచేతస్సరోజద్విరేఫా,
కోమ—సునాకద్విషత్కుంభిహర్యక్షశాబా,
ధర్మ—వినాయత్ననివృత్తసల్లోకగర్భా,
రుక్మా—సనాథప్రభోపేతవైకుంఠధామా,
మోహి—మనీషావిచారప్రనిర్దగ్ధమాయా,
సంధ్యా—వినీలాంచదుత్తుంగదివ్యచ్ఛరీరా,
చంద్ర—అనాదిప్రకారస్వసంబోధలీలా,
కోమ—సునారాయణా కేశవా వాసుదేవా,
ధర్మ—దినాధీశమధ్యప్రకాంతప్రకాశా,
రుక్మా—గుణాతీతవాఙ్మానసాతీతవేషా,
మోహి—ఘనానంతసానందశశ్వద్విలాసా,
సంధ్యా—మనోబుద్ధికర్మేంద్రియాతీతదేహా,
చంద్ర—వినాశప్రభాపూరకల్పాంతవేళా,
కోమ—సునీడాయతాకల్పచక్రప్రదక్షా,
ధర్మ—సురారాతిశిక్షా, సురేశానపక్షా,
రుక్మా—మదేభేంద్రరక్షా, సదాదివ్యమోక్షా, నమస్తే నమస్తే॥

(మంగళం. యవనికపడును).

—: మోహినీ రుక్మాంగదనాటకము సమాప్తము :—

ఉత్తరరంగము.

——:o:——

[ఒకానొక నటుఁడు ప్రవేశించి]

ద్వి॥ అనఘాత్ములార రుక్మాంగదుచరితఁ
గనుఁగొన్న నాశ్చర్యకరమగుఁగాదె
ఘననిష్ఠసలిపి యేకాశీవ్రతము
వనజాక్షుసత్కృపఁబడసె నీఘనుఁడు
నిత్యమహావ్రతనిష్ఠఁ జెన్నారి
సత్యవ్రతమునిల్పుసరణికై యకట
జగతీజనంబులాశ్చర్యంబుఁ జెందఁ
దగఁగుమారుని నైనఁ దలగోయఁగడఁగె
నెట్టిసత్యవ్రతంబిదిజనులార
పట్టిఁజంపుటకోర్చుభంగియద్భుతము
ఏనిష్ఠమైన మహీఁజనుల్ జరుప
మానకయడరించు మహితమౌయశము
ఎల్లనిష్ఠలలోన నిలసత్యనిష్ఠ
విల్లసిల్లెడుకీర్తి వెలయించుచుండి
అదియుండుఁగాక మహాజనులార
మదినెంచియొక్కసూక్ష్మమునింతకనుఁడు
సత్యవ్రతంబుల సరిలేనిమహిమ
స్తుత్యుఁడై యున్నయీక్షోణీవిభునకుఁ
బట్టినైనఁదెగించివధియింపఁగడఁగు
నిట్టిమహాపదకేమికారణమొ
మతినెంతచూచిన మఱివేఱులేదు
అతికృత్యమొక్కటేయగుఁగారణంబు
వడి "నతిసర్వత్రవర్జయేత్" నెడి
నుడియింత తలఁపనెందునుదప్పనదియె

అక్కటమంచి కార్యంబైనఁగాని
మిక్కిలిచేయుట మేలుగాదరయఁ
జెలువార నేకాదశీవ్రతం బెంత
వెలలేనిదని తానువినియున్న నేమి
తానావ్రతము సల్పఁదగు నిందుభక్తిఁ
గాని లోకము పట్టుగా బలవంత
పెట్టంగఁదగునె యీవృత్తంబటన్న
నట్టనికష్టంబుగా నతికృత్యమయ్యె
భావింపఁజనులకు ఫలమయ్యెఁగాని
దేవవేశ్యలకు నెత్తినదుఃఖమయ్యె
నెంతమేలైననా నెవరికో కీడు
ఎంతకీడైననా నెరివకో మేలు
జాడగానటు మేలొసంగనికీడు
కీడొసంగని మేలు క్షితినుండఁ బోదు
మితిమీఱఁగీడైన మేలైనఁగాని
యతిమాత్రముగఁ జేయుటది విరోధంబు
దాననే కాదె యీధరణీవరునకుఁ
గానని యెడనుండి ఘనదుఃఖ మడరె
హితమార జనులార యెన్నఁడుగాని
యతికార్యమొనరించుటది కీడు సుండి
విరిబోణులార సాధ్వీమణులార
యరయరే యిందుసంధ్యావళిచరిత
మిట్టిపతివ్రతలెందైనఁగలరె
యట్టె విచారింప హరిణాక్షులార
తెలియంగనీ సాధ్వి ధీరగుణంబు
వెలయాలికిని నించెనెసనద్భుతంబు
తానింతవలదన్నఁదనపతి మోహి
నీనారిఁగలయుటనిలుచుచునుండెఁ

బాడిగాదంచు నొప్పకుమమ్మ యంచుఁ
దోడియాండ్రెల్ల నెంతో వేఁడికొనిరి
యొప్పులాడి నిజేశుఁ డొనరించు వాంఛ
తప్పక తీర్చుటే తనధర్మ మనుచు 56

ధీరమానసమునఁ దీపారి విభుఁడు
కోరిన వెలయాలిఁ గూర్పఁ దేయకట
యిది యెంత సతిధర్మ మిది యెంత సుగుణ
మిది యెంతయుపకార మిది యెంత ఖ్యాతి 60

యింతటి మాహాత్మ్య మెనయుటఁ జేసి
శాంతసంతసమారఁ గాంచె శ్రీధరుని
మంచి పతివ్రతామహిమకు నెందు
నెంచి చూడఁగ సాటి యిలలేదు సుండి 64

భామాసుధీయుతులార బాలకులార
మహితంబుగాదె ధర్మాంగదుమహిమ
తనతండ్రిసత్యంబు తగనిల్పుకొఱకు
తనతలఁ దెగఁగోయఁ దానొడంబడునె 68

యీపసిబాలున కెంతటి త్యాగ
మేపాటునే యెందు నింత వైరాగ్య
మహహా సుగుణ మహౌదారత యెంత
రహిమించు నాత్మతిరస్కార మెంత 72

విలసిల్లు సరిలేని పితృభక్తి యెంత
వెలలేని పరమార్థవిజ్ఞాన మెంత
యరుదారియున్న యాహరిభక్తి యెంత
పరఁగినయుపకారపరత యదెంత 76

శీలమెంత మహార్థసిద్ధియెంత
మేలెంత తత్త్వసమ్మితబుద్ధియెంత
బాలకులకు నెల్లభక్తియటన్న
వాలారు పితృభక్తివరరాజభక్తి

ఘనసత్యభక్తియుఁగడు దేవభక్తి
దనరారనివియేకాదాభక్తులవని
కర్తలౌ బాలకశ్రేష్ఠులార
ధర్మాంగదుని మహోదారసద్గుణము

లెల్లఁజేకూఱి మీకేదియసాధ్య
మెల్లందుఁగీర్తియు నేపారుముదము
గలిగిభూజనులెల్లఁగనిమిమ్ముఁబొగడ
నలఘుదేశక్షేమములరారుసుండి

:o:

అనుబంధములు.

———:0:———

అనుబంధములు.

1 యమ—రాగము-బిలహరి తాళము.

మేలుగానాకు-నను-కూలమెంత
గల్గెనహో పోలఁగమఱి-చాలసుఖము
లీలనిం చేఁగాదే-సఖా ॥పల్లవి॥
పొందుగామిత్రతతి-నందమూఱఁజూడఁగా
నిందుగనర-విందనయను-చందమెందుపాడఁగా॥ ౧

2 అందఱు—రాగము-మోహన రూపక తాళము.

పాలనసేయవే యోకరి-వరదాకరుణాలవాల ॥పల్లవి॥
ఎనలేని-కరుణజూడు-మనిపిమ్ముల్-గాపాడు-మనుచువేడు
వారముశ్రీ-వనజభవాదినుతశౌరీ॥పాలన॥
సురజాలావనకరుణా-కరసుగుణామాధవనీ
చరణసారసములపూజలె-మరువక చే-సెదము దేవా॥పాలన॥

3 మోహినీ—రాగము-హిందూస్తాని బెహాగ్ ఏకతాళము.

వర-నీరెజనేత్రకరుణింపవే-నానేరములనుమదిమన్నింపవే
మదిమన్నింపవే-దయనింపవే ॥పల్లవి॥
నీమదినెంతోయాదరము-న్నిండఁగనీవలకుల్ప్రేమజెలంగఁగ
నాయెడల్-బెంచితిమోహముల్॥వర-సామాజయానదయ
పోనాడకె-నను-నీమాడ్కి-నరగంటఁ-జూడఁగనేనెటు
కాముబారికిని-దాళుదునే-హాకామినీ ॥వర॥
చాలునునాపైఁగోపమునీ-సమ్మతిజూఁపఁగదే
బాలరోనాయపరాధముల్-వారకకావవె॥

అనుబంధములు.

వరశీతాంశుకముఖినే-నీదాసుఁడనీ-కేలంటికాలంటి
వేడెదఁగాసను-బాలించికౌగిలియాగదవె నీలాలకా

4 మోహిని—రాగము-బెహాగ్ ఏకతాళము.

నా-మోహన-రారానాకు-మోదము-నింప
నామోహనరారా-నాప్రాణేశరారా నాకు ॥ప
తాళగలనె కడుదయతో-తగదేనఁగలసి
యేలరార-బాళిదీర-యిదెంత వింతచలమో
యెలానీ-కీరాగు-శ్రీలోల-తాళనురా
చాలఁగనె-బాలనురా॥నామోహన॥
చిన్నతనమున నెనీయెడ-జెలఁగినమోహమునఁ
జెన్నుమీఱి-యున్న నారి-సిలుగుబెట్టఁదరమా
యున్నతి చెన్నారగ-నన్నేలక-యున్నావుగా
యెన్నాళ్ళునా-విన్నపము॥నామోహన॥

5 అందలు—రాగము-పీలు ఆదితాళము.

వాణీనాయక-వైభవదాయక
వరజగత్సృష్టివిధాయకా ॥పల్ల
తుంగవిలాస-మంగళవేషా
సంగతసజ్జనపోషణా॥
శ్రీమహనీయా-శ్రేమామేయా
కామితఫలసంధాయకా॥
పాపవిభంగా-తపససంగా
దీపితహంసతురంగమా

6 బ్రహ్మ—రాగము-బిలహరి రూపకతాళము.

ఇందిరావిభుఁడు-నందనునెడ
నందంబగు-చందముదయ-చెందెనుగా ॥పల్ల

అనుబంధములు.

వనరుహాలోచనునకుఁ దెలి
యనియోచననాకున్నదె
ఘనమగుననురాగమునఁ
మనసారగ-ననుబ్రోచుట
కనికాదె-నినుపంపెను॥ఇంది॥ ౧

7 అప్సరసలు—రాగము-సురటి రూపకతాళము.

శారదామనోబ్జ-భృంగవారిజాసనా॥
దేవపాలనందనా-శ్రీవరనందనా
పావనమానీంద్రవినుత-పాదపంకజా॥ ౧

8 అప్సరసలు—రాగము మాల్కోస్ రూపకతాళము.

ఆహాధాతమాకౌనె-కూర్చుండగా
మహాకష్టగతిగల్గె-నేమందుము॥
నిరంతరవైకుంఠ-గమనంబున
దురంతంబుగామాకు-దుఃఖంబగుఁ॥ ౧
పగల్ రాత్రియెడలేని-నాట్యంబునఁ
దిగంబారె-బల్లమెల్లనేట్లోర్తుము॥ ౨
గతులోప్పెనిదియేమియేకాదశీ
వ్రతంబయ్యెయో-యెంతవర్ణింతుము॥

9 బ్రహ్మ—రాగము-కాంభోజి రూపకతాళము.

ఇదినాకుదరమే-తరుణీ
ఇ-తటి-కార్యము-సాధ్యమెరమణీ॥
వింతగనను-నింతయడుగ-స్వాంతమునకు
చింతగదా-తలపఁగ-కాంతరో-యింతటి
వంతల-జింతిలి-మెంతకాల మింతదాళసంతోషమా॥

అనుబంధములు.

10 అప్సరసలు—శ్యామకల్యాణి. ఆదితాళము.

మాకు-వారనిముదమలరారెను
చేకొనిసరసము-లాడుదము॥ ॥పల్లవి
విలాస-ముతోయె-బలామ-నలాగిది॥
తరుణులకిదెయీ-వెరవునమదిలో
తెరసినముదమిం-పరయగగదిరే॥
సురు-చిర-విధమున-గర-మరు-దగుగద॥మాకు॥
విలసితగతిమా-కలరెనుదగ-నేడలవిగనిన
సొం-పలరెనుగదనే-భళి-భళి
విధమున-సలలిత-గతినిటు॥మాకు॥

11 రాగము-కేదార. ఆదితాళము.

తుక్మా—నాగవేణిరమణీ-తరుణీనుదయగనవే-నునుపనెఱుటు ॥పల్లవి
మోహి—భూమిపాలతిలకా-తగునే-పురుషులమనుచుం-
బలుకఁగనిటు ॥పల్లవి
తుక్మా—నీ-వీకరణిందయఁగనవే వేకరికోరిననసునీ
నాకులపెట్టఁగఁదరుణీ-భీకరమదనుని-దాళనునఖ॥
మోహి—భూ-మీవరచూడవలదె నే-దేవలతాంగినిగానా
నావిధమంతయుఁగనకే-యీవగనీమదిఁదలపోయనె॥
తుక్మా—లేమనీవెల-లేనిరూపము-నామనంబున-నిల్పఁగా
ప్రేమతో-విన్నపం-బెన్నుచు-కాముబారిదాలంగగా॥
మోహి—ధారుణీధవనీకు-జెల్లునే-తారతమ్యముచూడక
వారకీ-దారిదే-వాంగన్-గోరుసరసతధర్మమె॥

12 రాగము-హిందుస్తాని జంజూటి ఏకతాళము.

తుక్మా—వరసరోజనయనా-మరాళసుందరగమనా
ఇదికరాళగతితలపఁగదే॥ ॥పల్ల

అనుబంధములు.

మోహి—వర-ధరాధిరమణా-సరోజరిపుసమవదనా
నిను-వరింపగల-దడయఁగదె॥ ॥పల్లవి॥

రుక్మా—కదుఁ-గృపాపరతమన్నింపవే-వర-జపాకు
సుమసామ్యాధరా-నాపైన-గోపము-మానవె కామినీ॥ ౧

మోహి—నామనోరమణయిటుతడయక-గను-వినోదమని
మదిగనక-జానార-నీనారిగా-నెంచినిల్వవే॥ ౧

13 కోమల— రాగము-చక్రవాకము త్రిపుటతాళము.

మనసునదయలేక-వనజాక్షియిట్లుచేసెనేఁడు
మనుజేశుఁగొన్నదయ్యో-ఘనపాపకర్యమూ మెగాదె। పల్లవి।
వెరతారనిట్టిరీతి-ధరలోననెందునైన-విన్నారమె
తరళాక్షిపైననేఁడు-దయజూపనౌనెనీకుకాంతామణి ౧

14 సంధ్యా— రాగము-ధన్యాసి అదితాళము.

పరికింపరే-విరిబోఁణులారా
ధరణీశవరుని-నిరసింపనౌనె
తరళాక్షులారా-తరమౌనె-విభుఁగలపగ। ॥పల్లవి॥
మననాథుఁడింత-మదినొచ్చెనేని
వనజాక్షులారా-తనవున్ననేమిఫలము॥ ౧

15 రాగము-కాంబోజి ఏకతాళము.

సంధ్యా—మోహినిసతీ-మోదంబగునీచరితకు॥ ॥పల్లవి॥
మోహి—మానినీమణీ-నానేరము-కరుణింపవే॥ ॥పల్లవి॥
సంధ్యా—నీ-కఠిణా-లో-కమునక-మా-కొదువల్
షోకార్చితిగదకామినిని॥మోహిని॥ ౧
మోహి—భామినిరో-నీ-మహిమల్ -నా-మదిలో
నేమెంచనుగొనియాడుదు॥మానిని॥ ౧

అనుబంధములు.

సంధ్యా—ఎంతో-దయగలుగన్-కాంతా-మముమనుపన్
వింతా-ఘనగతిగా-సంతోషముమదిలో-జెందితిమిటు॥

మోహి—బాలా-నీమహిమల్ -చాలా-ఘనములుగా
ఏలా-ననుబొగడన్-మేలా-పలుకగనీవిధమున॥

సంధ్యా—సా-రసదళసమనయనా-రజనిశవదనా
బిసరుహనేత్రా-యసమముగాదే యసువ్రుల-బెంపన్-
నీదయనిటు॥ మోహి॥

మోహి—కా-మినిననుదయగనుమా-మనవినివినుమా
ఘనమగునేరం-బొనరెనునాకున్-గొనకొనివేడన్-
వచ్చితినిటు

16 మోహి—రాగము-పీలు ఏకతాళము.

భూరమణా-రతిగోరుదాన॥ ॥
వాడిశరమ్ముల-వంచననేయుచున్నాను
బ్రదుకఁగా-నీడుమారుఁడు॥

17 రాగము-కాంభోజి ఏకతాళము.

రుక్మా—మానగఁజాలుదునే-నాగవేణీ
కానకవిమలై-కాదశివ్రతము॥ ।

మోహి—తాళఁగజాలుదునే-ప్రాణనాథా
చాలునేకాదశి-యేలుమురమణా॥ ।

రుక్మా—కీడునుమేలును-జూడకయీలాగున
వేడగనీకును-బాడియెరమణీ

మోహి—మంచియొచెడ్డయొ-మించెనుమోహము
ఎంచివదలగా-వంచనగాదె॥

18 రాగము-జంజూటి తాళము.

మోహి—కుమారా-యిదేలయీచరిత
చూడవే-చూడవే-ప్రమాదగున్

శ్రీ

మోహినీరుక్మాంగద నాటకము.

:0:

ఇది

బళ్ళారిలోనున్న డిస్ట్రిక్టుకోర్టు వకీలు

"ఆంధ్రనాటక పితామహ" యను బిరుదువహించిన

ధర్మవరము - రామకృష్ణమాచార్యులచేత

రచియింపఁబడి

టి. కె. కృష్ణమాచార్లు, వారిసహోదరులవలన ప్రకటింపబడియె.

మొదటి కూర్పు.

బళ్ళారి

రమావిలాస ముద్రాక్షరశాలయందు

ముద్రింపబడియెను.

1920

[క్రయము రూ. 1-0-0.]

అనుబంధములు.

ధర్మా— అసారంబిదెంతయీతనువు-తల్లిరో
తల్లిరో-తల్లిరో-అసత్యమగుక్-అసత్యమేకలుగుక్ ||పల్లవి||
మోహి—ప్రాణంబులనీ-పగిదింబాయ
నానందంబగునోకో-కుమారా||
రుక్మా—శ్రీహరివాసర-సిద్ధితలపనీ
దేహంబెక్కు-వయే-యసారం||కుమారా||
మోహి—ఏకాదశియన-యెంతటిదయ్యా
ఏకార్పంగనసుపుల్ -కుమారా||

19 ధర్మ—రాగము-జోగిసావేరి ఆది తాళము.

ఈమాటడగదగునే-జననిరో
భూమిధర్మములువలదే-కడు-ప్రేమ
నించుచునుగనుమా|| ||పల్లవి||
ఈకాయంబదియెంత-జననిరో
హితవుచూచికనుమా-నాకు
నీ-మృతియే భాగ్యమా ౧
ఘనమగుపుణ్యముగలుగుక్
జనకుని-కన్నతముతొలగగజేయక్
తనువునుగణనముసేయక్||

20 ధర్మ—రాగము-ఆనందభైరవి ఏక తాళము.

హరినారాయణ-మాధవశౌరి
సురనాథాదర-చక్రిమురారీ|| ||పల్లవి||
గరుడాంచితబహురమ్యతురంగా ౧
పరిపాలిత-సారంగమురారీ||

21 లక్ష్మి—రాగము-కమాజు ఆది తాళము.

అళికులాలక-మెచ్చితిక్|| ||పల్లవి||
భళి-భళియనరె-సంధ్యావళీధరణి|| ||అను||
నీమగని-నేమమును-ప్రేమగని-ధీమతము
వేపూను మెచ్చితి-భామామణిరో|| ౧
ధారుణిని-నీరమణు-ధీరమతి-నారయుచు
ప్రేమమునించితి-భామామణిరో|| ౨

:0: